ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 22.03.2026 | సంపుటి : 12 సంచిక : 242 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



రాష్ట్రాలకు ఎల్పీజీ కేటాయింపు

## పెంపు

20% అదనంగా సరఫరా చేసేందుకు కేంద్రం ఆమోదం

## ఆరు కాదు.. అరగ్యారెంటీ కూడా అమలు లేదు

- వాటికి చట్టబద్ధత కల్పించాలని ప్రైవేట్ బిల్లు పెడతాం
- మీడియా సమావేశంలో కేటీఆర్

## అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

- రెవెన్యూ విచారణలో వెలుగులోకి
- డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు
- అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు

## మొన్న భార్య.. నేడు భర్త ఆత్మహత్య

కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం

వివరాలు లోపలి పేజీల్లో..



హిందూ మహాసముద్రాన్ని తాకిన

# యుద్ధమంటలు

## సుదూర లక్ష్యాలను ఛేధించే బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన ఇరాన్

- సతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి బాంబుల వర్షం
- ఖండించిన ఇరాన్.. అంతర్జాతీయ ఉల్లంఘనేనని ఆరోపణ
- దాడులను తీవ్రతరం చేసిన ఐఆర్‌జీసీ
- ఇజ్రాయిల్ యుద్ధవిమానం కూల్చివేత



సతాంజ్ అణు శుద్ధి కేంద్రం

**టెహ్రాన్(జనంసాక్షి):** రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది. ఏకంగా 4 వేల కిలోమీటర్ల దూరంలోని యూఎస్, యూకేల సంయుక్త సైనిక స్థావరమే లక్ష్యంగా రెండు బాలిస్టిక్ క్షిపణుల ను ప్రయోగించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హిందూ మహాసముద్రంలోని డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై ఇరాన్ ఈ మిసైల్స్‌ను ప్రయోగించిందని సమాచారం. చాగోస్ ద్వీపసముదాయంలో ఇదొక భాగం. మీడియా కథనాల ప్రకారం, ఇరాన్ ప్రయోగించిన తొలి మిసైల్ మార్గమధ్యంలోనే విఫలమైంది. మరో మిసైల్‌పై ఒక అమెరికా యుద్ధ నౌక క్షిపణి విధ్వంసక రాకెట్‌ను ప్రయోగించింది. ఈ దాడిలో రెండో మిసైల్ ధ్వంసమైందా? లేదా? అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఈ వార్తలపై అమెరికా ఇంకా స్పందించ లేదు. ఇప్పటివరకూ ఇరాన్ మిసైల్ దాడులు పశ్చిమాసియాకే పరిమితమయ్యాయి. తాజాగా హిందూ మహాసముద్రంలోని దీవిని ఇరాన్ టార్గెట్ చేసిందన్న వార్తలు కలకలం రేపుతున్నాయి. ఇదే నిజమైతే ఐరోపా ఖండంలోని పలు యూఎస్ సైనిక స్థావరాలు ఇరాన్ దాడుల పరిధిలోకి వచ్చినట్టు అవుతుందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. మిగతా 2లో..




# తుదిదశకు యుద్ధం

## ఇరాన్‌పై సైనిక చర్యను తగ్గించే ఆలోచనతో ఉన్నాం
## కానీ పూర్తిగా కాల్పుల విరమణ జరగదు: ట్రంప్

**వాషింగ్టన్(జనంసాక్షి):** యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణ్యా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. మిగతా 2లో..

## వచ్చే వారం ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం

ఇజ్రాయెల్ మంత్రి కీలక వ్యాఖ్యలు 2లో..



## యుద్ధం ఆపించండి మహాప్రభో..

- హర్మ్యూజ్‌ను వెంటనే తెరవండి..!
- ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి
- ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేత
- యుద్ధం వేళ అమెరికా కీలక నిర్ణయం
- ఇరాన్ అధ్యక్షుడికి మోదీ ఫోన్

వాషింగ్టన్(జనంసాక్షి):హర్మ్యూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం మిగతా 2లో..



నిందితుల ఫోటోలు సోషల్ మీడియాలో

## ప్రచారం సరికాదు

- అది పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయి
- సుప్రీం కోర్టు ఆందోళన ఇంటి పనుల్లో భర్త కూడా సహాయపడాలి
- విడాకుల కేసులో అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యలు



ఎమ్మెల్యే దానంకు క్లీన్‌చిట్‌పై

## హైకోర్టుకు బీజేపీ

స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్

నేటి నుంచి వినియోగంలోకి

## నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

- సిద్దిపేట జిల్లాలో ప్రారంభించనున్న సీఎం రేవంత్
- ఆ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం కష్టం మాది.. శిలాఫలకాలు మీవా?: 
- హరీశ్ ఆగ్రహం

వివరాలు 2 లో






## మూడు దశల్లో భద్రాచల ఆలయ అభివృద్ధి

### అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): ఇప్పటి వరకు పూర్తయిన భూసేకరణ అనుగుణంగా భద్రచల ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన సీఎం ఆలయ సహజత్వానికి భంగం కలగకుండా పూర్తిగా ఆగమశాస్త్రానుసారం అభివృద్ధి పనులు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శేషాద్రి, శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఆలయ ఈవో, పూజారులు, అధికారులు పాల్గొన్నారు. సీఎం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మూడు దశల్లో ఆలయ అభివృద్ధి పనులను పూర్తి చేసేలా ప్రణాళికలుండాలని తెలిపిన ముఖ్యమంత్రి వచ్చే గోదావరి పుష్కరాల నాటికి చేయగలిగిన పనులను ముందుగా గుర్తించి అంచనాలతో తొలి దశ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించిన సీఎం గోదావరి పుష్కరాల ప్రణాళికలకు అనుగుణంగా ఆలయ సమీపంలోని ఘాట్స్ నిర్మాణం, అభివృద్ధి ఉండాలన్న సీఎం 2027 మార్చి 31 నాటికి తొలిదశ అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు లక్ష్యంగా పనిచేయాలని సూచించిన సీఎం పుష్కరాలు ముగిసిన అనంతరం మిగతా పనులు పూర్తి చేసేందుకు ఇప్పుడే ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## తుదిదశకు యుద్ధం

ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

## యుద్ధం ఆపించండి మహాప్రభో..

పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. "గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోంది" అని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా రంజాన్, నౌరుజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన.. ఈ పర్వదినాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం తీసుకువస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా గొలుసుకు ఆటంకం కలిగించే కీలక మౌలిక సదుపాయాలపై దాడులను ప్రధాని మోదీ ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని.. నౌకామార్గాలు తెరచి ఉంచడం, వాటిని సురక్షితంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు ఆ దేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడటం ఇది రెండోసారి. మార్చి 12న ఓసారి ఫోన్‌లో సంభా షించిన ప్రధాని.. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చలు, దౌత్యమార్గాల్లోనే సంక్షోభాలను పరిష్కరించుకోవాలని ఇరా న్ అధ్యక్షుడికి సూచించారు. అనంతరం సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రె యిన్, ఖతార్, కువైట్, జోర్డాన్, మలేసియా, ఫ్రాన్స్ అధినేతలతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై చర్చించారు. యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

# హిందు మహాసముద్రాన్ని తాకిన యుద్ధమంటలు

ఇటీవల శ్రీలం కకు దక్షిణాన హిందూ మహాసముద్ర జలాల్లో ఒక ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా సబ్‌మెరైన్ ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. టార్పిడో ప్రయోగంతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ నౌక నీట మునిగిపోయింది. ఈ ఘటనలో సుమారు 85 మంది మరణించారు. భారత్‌లో జరిగిన మిలన్–2026 నావికాదళ విన్యాసాల్లో పాల్గొన్న ఇరాన్ నౌక తిరిగి వెళుతున్న సమయంలో అమెరికా దాడి చేసింది. ఇరాన్ నావికా దళాన్ని నిర్వీర్యం చేయడం తమ ప్రాథమిక లక్ష్యాల్లో ఒకటని అమెరికా అప్పట్లో పేర్కొంది. అయితే ఈ క్షిపణులను ఎప్పుడు ప్రయోగించారన్న దానిపై స్పష్టత లేదు. డిగో గార్సియా హిందూ మహాసముద్రంలో యూఎస్–యూకేకు ఉన్న వ్యూహాత్మక సైనిక స్థావరం. హిందూ మహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. అందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా వినియోగిస్తోంది. ఇదిలాఉంటే.. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు, ఇరాన్‌కు చెందిన ఖర్గ్ ఐలాండ్‌ను ఆక్రమించే అవకాశాలను అమెరికా పరిశీలిస్తోందని వార్తలు వస్తున్నాయి. ఆ క్రమంలోనే పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను మోహరించేందుకు అమెరికా సిద్ధమైంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం వెల్లడించిన సంగతి తెలిసిందే. అగ్రరాజ్యానికి చెందిన యాంఫిబియస్ అసాల్ట్ షిప్ యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల వేళ.. ఈ క్షిపణుల ప్రయోగం గురించి వెలుగులోకి వచ్చింది. తమవద్ద క్షిపణుల పరిధి 2000 కి.మీ. వరకు ఉంటుందని ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడించారు. కానీ చెప్పిన దానికంటే ఇరాన్ వద్ద ఉన్న మిస్సైళ్ల పరిధి చాలా ఎక్కువే ఉండొచ్చని తాజా ఘటన వెల్లడి చేస్తోంది.

**అణు కేంద్రంపై భీకరదాడులు**

దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియా దద్దరిల్లు తోంది. తాజాగా ఇరాన్‌లోని నతాంజ్ అణు శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ మరోసారి దాడులకు పాల్పడినట్టు స్థానిక మీడియా సంస్థ తస్నిమ్ తెలిపింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత నతాంజ్ అణు క్షేత్రంపై దాడులు చేయడం ఇది రెండోసారి. నతాంజ్ అణు క్షేత్రంపై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడ్డాయని, అయితే రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల ప్రజలకు ఎలాంటి సమస్యా లేదని తెలిపింది నతాంజ్ క్షేత్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్ అణు కేంద్రంపై ఇజ్రాయెల్, అమెరికా దాడులు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్ అణు కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగిన సంగతి తెలిసిందే .తాము జరిపిన దాడుల్లో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ప్రకటించారు. నెతన్యాహు ప్రకటించిన కొద్ది గంటల్లోనే నతాంజ్ అణు కేంద్రంపై దాడులు జరగడం గమనార్హం. నతాంజ్ అణు కేంద్రం టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది.

**వచ్చే వారం దాడులు మరింత తీవ్రతరం: ఇజ్రాయెల్ మంత్రి**

పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై దాడుల తీవ్రత రానున్న వారం మరింత పెరగనుందని చెప్పారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే కట్జ్ ఈమేరకు వ్యాఖ్యలు చేయడం గమనార్హం. "ఇరాన్ పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనాయంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు" అని సైనిక అధికారులతో సమీక్ష సందర్భంగా కట్జ్ అన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే తమ లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న విషయం తెలిసిందే. హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియా ద్వీపంలో ఉన్న యూఎస్–యూకే సైనిక స్థావరం లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించడాన్ని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులను దుస్సాహసంగా పేర్కొంది. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడం వంటివి.. తమ ప్రయోజనాలకు, తమ మిత్రదేశాలకు ముప్పుగా బ్రిటన్ రక్షణశాఖ తెలిపింది. ఇరాన్‌పై దాడుల్లో బ్రిటన్ ఇంతవరకు నేరుగా పాల్గొనలేదు. కానీ.. ఆ దేశంపై దాడుల కోసం అమెరికాకు తమ స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతించింది. హర్మూజ్ జలసంధిలో నౌకలపై ఇరాన్ దాడులను కట్టడి చేసేందుకు.. డిగో గార్సియా సహా ఇతర స్థావరాలను కూడా ఉపయోగించుకోవచ్చని శుక్రవారం తెలిపింది. బ్రిటన్ ఈ ప్రకటన చేయడానికి ముందే డిగో గార్సియా లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. ఈ ద్వీపం.. ఇరాన్ నుంచి దాదాపు 4,000 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనికి ఎంత సమీపానికి క్షిపణులు వచ్చాయనేది తెలియరాలేదు.

**ఇజ్రాయిల్ యుద్ధవిమానం కూల్చివేత**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే అమెరికా ఎఫ్–35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది. ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷–గ్గ÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా–ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగంగానే ఈదాడి జరిపిందని, అణుభద్రతా నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు తూట్లు పొడిచిందని నిప్పులు చెరిగింది.

## నేటి నుంచి వినియోగంలోకి నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ

సిద్దిపేట(జనంసాక్షి):సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది. మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు.


**నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం: హరీశ్**

సిద్దిపేట(జనంసాక్షి): సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ ఫామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆర్ఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ అన్నారు.

## ఎమ్మెల్యే దానంకు క్లీన్‌చిట్‌పై హైకోర్టుకు బీజేపీ

### స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆర్ఎస్ బీ–ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.



## నిందితుల ఫోటోలు సోషల్ మీడియాలో ప్రచారం సరికాదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన వీడియోలను ప్రజలు వెంటనే సోషల్ మీడియాలో షేర్ చేసే ధోరణిని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. అలాంటి చర్యలు పారదర్శక విచారణకు ముప్పుగా మారుతాయని ఆందోళన వ్యక్తంచేసింది. నిందితుల వీడియోలు, ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి, ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలైంది. ఒక కేసు విషయంలో పోలీసుల మీడియా బ్రీఫింగ్‌పై మార్గదర్శకాలు రూపొందించాలని అత్యున్నత న్యాయస్థానం ఇప్పటికే రాష్ట్రాలను ఆదేశించింది. అందులో సోషల్ మీడియాను కూడా చేర్చాలని పిటిషన్ కోరారు. ఈ పిల్‌పై జరిగిన విచారణలో భాగంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సంకెళ్లు వేసిన, తాళ్లతో బంధించిన, మోకాళ్లపై కూర్చోబెట్టిన నిందితుల ఫొటోలను పోలీసులు సోషల్ మీడియాలో షేర్ చేయడం ఆ వ్యక్తి గౌరవానికి భంగం కలిగించడమే అవుతుందని, అది ప్రజల ఆలోచనను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. "నిబంధనల ద్వారా పోలీసులను నియంత్రించడానికి వీలు ఉంటుంది. కానీ సోషల్ మీడియా, ప్రజల సంగతేంటి..? వారిని నియంత్రించగలమా..?" అని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై విస్తృత పరిశీలన అవసరం అని అభిప్రాయపడింది.

ఇంటి పనుల్లో భర్తా సహాయపడాలి

'రోజులు మారాయి. దుస్తుల వాషింగ్ సహా ఇంటి, వంట పనులను, కుటుంబ బాధ్యతలను దంపతులిద్దరూ సమానంగా పంచుకోవాలి. గృహ సంబంధమైన పనులను భార్య సరిగా చేయడంలేదని ఆరోపించడం సరికాదు. ఆ పనులన్నీ ఆమె చేయకపోవడాన్ని వేధింపులుగా పరిగణించలేం' అని సుప్రీంకోర్టు పేర్కొంది. విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వివాహమాడింది జీవిత భాగస్వామినేనని, సేవకురాలిని కాదని గుర్తు చేసింది. దంపతులిద్దరూ ఉద్యోగులు. 2017లో వివాహమైంది. బిడ్డ పుట్టిన తర్వాత ఆమె పుట్టింటిలోనే ఉండి పోయింది. 2019 నుంచీ ఆ దంపతులు విడిగా ఉంటున్నారు. ఇంటి, వంట పనులు సరిగా చేయకుండా తనను భార్య వేధిస్తుందని ఆరోపిస్తూ భర్త కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా విడాకులు మంజూరయ్యాయి. ఈ తీర్పును భార్య హైకోర్టులో సవాల్ చేయడంతో విడాకులు రద్దయ్యాయి. భర్త సుప్రీంకోర్టును ఆశ్రయించగా మధ్యవర్తిత్వం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది. అయినప్పటికీ ఫలితంలేకపోవడంతో భార్యాభర్తలు తమ ఎదుట హాజరుకావాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. వారితో తాము నేరుగా మాట్లాడుతామని తెలిపింది. విచారణ ఏప్రిల్ 27వ తేదీకి వాయిదాపడింది.

ఈ పిల్ విచారణ నుంచి తప్పుకొంటున్నా: సీజేఐ

ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) విచారణ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తప్పుకొన్నారు. "ఈ కేసు నేను విచారిస్తే.. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉంటాయని అంటారు. అందుకే వైదొలగుతున్నా" అని శుక్రవారం సీజేఐ తెలిపారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సర్వీసు షరతులు, పదవీకాలం) చట్టం– 2023ను సవాల్ చేస్తూ పిల్‌లు దాఖలయ్యాయి. ఈ చట్టంలో ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తొలగించారు. దీన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. ప్రధాన న్యాయమూర్తి రేసులో లేని వారు ఈ పిటిషన్‌ను విచారిస్తే బాగుంటుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కూడా సీజేఐ అభిప్రాయంతో ఏకీభవించారు. ఈ అంశాన్ని మరో ధర్మాసనం వచ్చే నెల ఏడున విచారిస్తుందని సీజేఐ తెలిపారు.

## ఆరు కాదు.. అర గ్యారెంటీ కూడా అమలు లేదు



హైదరాబాద్(జనంసాక్షి):ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోసం అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వెల్లడించారు. ఈ విషయంలో అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి చైర్మన్‌ను కలుస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో అర గ్యారెంటీ కూడా అమలు కాలేదన్నారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీల బిల్లుకు మద్దతు కోసం అన్నిపార్టీలకు లేఖలు రాస్తామని చెప్పుకొచ్చారు. 840 రోజులు అయినా ఆరు గ్యారంటీలు ఎందుకు అమలు చేయట్లేదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు పెద్ద ఫ్రాడ్ అని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన్గ ÷ల్ ఎందుకు దొరకడం లేదని నిలదీశారు. ఈ ఫైల్ ఢిల్లీ విమాన ప్రయాణంలో పోయిందా..?, ఎఫ్ఎస్ఎల్ అగ్నిప్రమాదంలో కాలిపోయిందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇంకా ఒక బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి ఉందని.. ఆరు గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు చట్టమైతే అన్నివర్గాలకు లాభం కలుగుతుందని చెప్పుకొచ్చారు. ప్రజల తరఫున ప్రైవేట్ మెంబర్ బిల్లు పెడుతున్నామని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన చరిత్ర అసెంబ్లీకి ఉందని ప్రస్తావించారు.ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు.. బీజేపీ ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రైవేట్ మెంబర్ బిల్లును బీజేపీ వ్యతిరేకించినా ఇబ్బంది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం కోటి మోసాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రజల నుంచి ఓట్లు రాబట్టడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల హామీల అమలు చట్టంగ ÷ల్‌పై సంతకం చేశారని ఉభయ సభల్లో గత గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన ప్రసంగంలో చెప్పారని ప్రస్తావించారు.

## అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

రంగారెడ్డి(జనంసాక్షి):సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. తాజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.

అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది.

## జీవన్‌రెడ్డికి బుజ్జగింపులు

- కాంగ్రెస్ నేత ఇంటికి వెళ్లి నచ్చజెప్పిన మంత్రులు మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం
- ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని వెల్లడి



హైదరాబాద్(జనంసాక్షి): పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు.

## టీఎన్‌జీవో కాలనీలో 16 ఎకరాలకు ఫెన్సింగ్

- ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా
- ఆధీనంలోకి రూ. 3200ల కోట్ల విలువైన భూమి



**హైదరాబాద్, మార్చి 20 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం టీఎన్‌జీవో కాలనీలో 16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. టీఎన్‌జీవో ఉద్యోగుల కోసం ప్రభుత్వం గతంలో కొంత భూమిని కేటాయించింది. 2007 వేసిన హెచ్‌ఎండీఏ లే ఔట్‌లో 10 ఎకరాల ముసాయికుంటగా పేర్కొన్నారు. ఆ పక్కనే 4 ఎకరాలు గ్రీన్ బెల్ట్ ఏరియాగా ప్రకటించారు. అలాగే 2 ఎకరాలు ప్రభుత్వ పాఠశాలకు కేటాయించారు. ఇలా కేటాయింపులు జరగగా..ఈ భూమి ఆక్రమణలకు గురవుతోందని ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ విభాగాలతో కలసి క్షేత్రస్థాయిలో విచారించింది. ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కొంతమంది ఈ ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులందాయి. ఈ ఫిర్యాదులను హైడ్రా క్షుణ్ణంగా పరిశీలించింది. ఆక్రమణలను నిర్ధారించుకుని మొత్తం 16 ఎకరాల చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. 10 ఎకరాల ముసాయికుంటతో పాటు గ్రీన్ బెల్ట్ ఏరియాకు కేటాయించిన 4 ఎకరాలను కాపాడినందుకు స్థానికులు హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడినందుకు ధన్యవాదాలు తెలిపారు. హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ వలలో మాజీ డీజీపీ కుటుంబం

- ఆయన మనవరాలుకు నకిలీ వాట్సాప్ మెసేజ్‌తో హాంఫట్
- ఖాతా నుంచి 1.20 కోట్లు మాయం



**హైదరాబాద్ (జనంసాక్షి) :**టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయి. పెద్ద పెద్ద కంపెనీల యజమానుల పేర్లతో అకౌంటెంట్లను, ఉద్యోగులను మోసం చేయడం ఇప్పుడు నేరగాళ్లకు పరిపాటిగా మారింది. తాజాగా హైదరాబాద్‌లో ఒక ఉన్నత స్థాయి మహిళా వ్యాపారవేత్త మాజీ డీజీపీ మనుమరాలుని భారీగా మోసగించారు. ఈ ఘటన మరోసారి సైబర్ నేరగాళ్ల చాకచక్యాన్ని బయటపెట్టింది. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మహిళా వ్యాపారవేత్త, మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. దివ్యారెడ్డి 18 కంపెనీలకు డైరెక్టర్‌గా ఉన్నారు. సైబర్ నేరగాళ్లు ఆమెతో పాటు అకౌంటెంట్‌ను మోసం చేశారు. ఈ నెల 13న దివ్యారెడ్డి పేరు, ఫొటోతో ఉన్న వాట్సప్ ఖాతా నుంచి అకౌంటెంట్‌కు మెసేజ్ వచ్చింది. తాను మీటింగ్‌లో ఉన్నానని.. చెప్పిన ఖాతాకు రూ.1.20 కోట్లు పంపాలని అందులో ఉంది. దీంతో అకౌంటెంట్ ఆ డబ్బును పంపారు. ఈ నెల 17న మరోసారి డబ్బు పంపాలంటూ వాట్సప్ మెసేజ్ వచ్చింది. ఈ క్రమంలో డబ్బులు పంపేందుకు చెక్ అప్రూవల్ కోసం డైరెక్టర్‌ను అకౌంటెంట్ సంప్రదించారు. గతంలో చేసిన రూ.1.20 కోట్ల లావాదేవి వివరాలను అకౌంటెంట్ చెప్పారు. తాను ఎవరికీ డబ్బు పంపమని చెప్పలేదని దివ్యారెడ్డి స్పష్టతనిచ్చారు. వెంటనే బాధితులు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఘటనలో సైబర్ నేరగాళ్లు అత్యంత చాకచక్యంగా వ్యవహరించారు. ఈ నెల 13న మహిళా వ్యాపారవేత్త పేరు, ఫొటోతో ఒక ఫేక్ వాట్సాప్ అకౌంట్ సృష్టించారు. ఆ అకౌంట్ నుంచి ఆమె సంస్థలో పనిచేసే అకౌంటెంట్‌కు మెసేజ్ పంపించారు. 'మీటింగ్‌లో ఉన్నానని.. వెంటనే ఈ ఖాతాకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ తెలిపారు. ఆ సందేశాన్ని నిజమని నమ్మిన అకౌంటెంట్ ఎలాంటి అనుమానం లేకుండా ఒకే ట్రాన్సాక్షన్‌లో రూ.1.20 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మోసం వెంటనే బయటపడలేదు. ఈ నెల 17వ తేదీన అదేవిధంగా మరోసారి మెసేజ్ వచ్చింది. ఈసారి డబ్బులు పంపేముందు అకౌంటెంట్ చెక్ అప్రూవల్ కోసం మహిళా వ్యాపారవేత్తను సంప్రదించారు. అప్పుడే అసలు విషయం బయటపడింది. 'నేను ఎలాంటి డబ్బు పంపమని చెప్పలేదు' అని ఆమె చెప్పడంతో ముందే జరిగిన ట్రాన్సాక్షన్ గురించి తెలుసుకుని ఆ మహిళా షాక్‌కు గురయ్యారు. మోసం తెలిసిన వెంటనే బాధితురాలు 1930 నంబర్ ద్వారా సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా కంప్లైంట్ ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ విచారణలో భాగంగా కేరళకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల రూ.1.20 కోట్ల భారీ నష్టం జరిగిందని.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరమని సైబర్ క్రైం పోలీసులు సూచించారు. డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని మెసేజ్ వస్తే తప్పనిసరిగా కాల్ చేసి నిర్ధారించాలని సూచించారు. వాట్సాప్ మెసేజ్‌లను నమ్మకూడదని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని అన్నారు. పెద్ద మొత్తాల లావాదేవీలకు డబుల్ వెరిఫికేషన్ తప్పనిసరి అని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## ఉద్యోగం పేరుతో యువతుల రవాణా

- ముగ్గురి అరెస్ట్


**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 21(జనంసాక్షి ):** బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్- 2025 నెలలో నమోదైన మహిళల అదృశ్యం కేసుకు సంబంధించి, దర్యాప్తు కొనసాగుతుండగా, ఆసిఫాబాద్ ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు, మొబైల్ ఫోన్ లొకేషన్, సాంకేతిక ఆధారాల ఆధారంగా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని, అత్రేయపురం గ్రామంలో బాధితులను గుర్తించి సురక్షితంగా రక్షించారు. తిరిగి తీసుకువచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ బాధిత మహిళలు చెప్పిన వివరాల ప్రకారం, వారు ఇద్దరు యువతులు ఉద్యోగం కోసం మంచిర్యాల ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో ముదిమాడుగుల ప్రశాంత్ (బబ్లు) అతని భార్య సవిత, కిష్టంపేట్, చెన్నూరు లు వారికి పని కల్పిస్తామని చెప్పి పరిచయం పెంచుకుని, మహేష్ ' సిరొంచ, మహారాష్ట్ర అను వ్యక్తి సహాయం తో డబ్బు కోసం ఇతర ప్రాంతాల వారితో వివాహాలు జరిపిస్తామని ప్రలోభపెట్టారు. బాధితులు అంగీకరించక పోవడంతో నిందితులు కుట్ర పన్ని, వారిని బెదిరించి బలవంతంగా రైలులో ఎక్కించి మధ్య ప్రదేశ్ కు తీసుకెళ్లారు. అక్కడ, వారి ఇష్టానికి విరుద్ధంగా అక్కడి వారిలో అమ్మాయిల మేన మామ అని చెప్పి దేవాలయంలో వివాహాలు జరిపించి, ఒక్కొక్కరి భర్త వద్ద నుంది రూ. 2,50,000 చొప్పున డబ్బు తీసుకుని మొత్తం రూ.5,00,000 అక్రమంగా లాభం పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం బాధితులను అక్కడే వదిలి నిందితులు పరారయ్యారు. ఈ కేసులో సంబంధం ఉన్న ముగ్గురు ప్రధాన నిందితులు అయిన ముదిమాడుగుల ప్రశాంత్ (బబ్లు), అతని భార్య సవిత, కిష్టంపేట్, చెన్నూరు, మహేష్, సిరొంచ, మహారాష్ట్రలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు చేసిన నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుండి బాదితులకు సంబందించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు, ఆధార్ కార్డులు, పాన్ కార్డులు, బ్యాంక్ పాస్ బుక్స్ వంటి పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఇంకొక నిందితుడైన మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని, ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నది తెలిపారు.

## దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు మోదీయే

- ఈద్ ర్యాలీలో మమత బెనర్జీ వ్యాఖ్యలు



**కోల్‌కతా, మార్చి21 (జనంసాక్షి) :** దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు ప్రధాని మోదీయే అని విమర్శించారు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ. బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో శనివారం జరిగిన ఈద్ ర్యాలీలో మమత పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మోదీపై, బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'దేశంలో అతిపెద్ద చొరబాటుదారుడు మోదీ. బెంగాల్‌ను ఎవరు లక్ష్యంగా చేసుకుంటారో వారు నరకానికి వెళ్తారు. బీజేపీని రాష్ట్రంలోకి రాకుండా చూస్తాం. మోదీ నుంచి, బీజేపీ నుంచి దేశాన్ని, బెంగాల్‌ను కాపాడటమే టీఎంసీ ప్రాథమిక కర్తవ్యం. బెంగాల్ మత సామరస్యాన్ని కాపాడుతాం. సర్ ద్వారా ప్రజల ఓటు హక్కుల్ని కాలరాసింది బీజేపీ. సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం. బీజేపీ అంటే గూండాలు, దొంగల పార్టీ. మీ ఓటు హక్కును మోదీ తీసుకోకుండా చూస్తా. ప్రజాస్వామ్యాన్ని, ప్రతి పౌరుడి హక్కుల్ని కాపాడేందుకు పోరాడుదాం. కొందరు ప్రజల ఓట్లు సర్ పేరుతో తీసేశారు. నేను దీనికోసం కోల్‌కతా నుంచి ఢిల్లీ వరకు, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు దాకా వెళ్లా. ప్రజల హక్కులకు రక్షణ దొరుకుతుందనుకుంటున్నా. బెంగాల్‌లోని అన్ని కులాలు, వర్గాల ప్రజలకు అండగా ఉంటా' అని మమత వ్యాఖ్యానించారు. అయితే, మమత వ్యాఖ్యలపై బెంగాల్ బీజేపీ నేతలు మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే నిరాశ, భయంతో మమత ఇలా ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని బీజేపీ నేత శిశిర్ బజోరియా అన్నారు. మమత ఉపయోగించిన భాష సరికాదన్నారు. ప్రధాని మోదీని చొరబాటుదారుడు అని ఎవరు అన్నా వారికి రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు. ఇక, బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడుతాయి.



## వేం నరేందర్‌రెడ్డితో 'ఉప్పల' భేటీ

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త కలిసారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఆయన రాజ్యసభకు ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావించి వారి అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇకపై కూడా ప్రజా సేవలో మరింత చురుకుగా వ్యవహరిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి తన వంతు పాత్ర పోషించాలని కోరారు.

## ఐటి రంగంలో భారీగా తగ్గిన ఉద్యోగాలు

- ప్రభుత్వం సమాధానం చెప్పాలి: కెటిఆర్



**హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) :** రాష్ట్రంలోని ఐటీ రంగంలో భారీగా ఉద్యోగాలు తగ్గుదలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని ప్రభుత్వం ఒక్క వారంలోనే రెండుసార్లు ఒప్పుకోవడం ఆందోళనకరమైన విషయామని అన్నారు. 2023లో హైదరాబాద్‌లోని ఐటీ రంగంలో 9.46లక్షల ఉద్యోగాలు ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ 2026 నాటికి అవి 9.39 లక్షలకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మొదట మార్చి 16న అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం సందర్భంగా వెల్లడించారని చెప్పారు. అనంతరం బ్జడెట్ ప్రవేశపెడుతున్న సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని తెలిపారు.ఐటీ సెక్టార్‌లో గణనీయంగా ఉద్యోగాల తగ్గుదలపై వారం వ్యవధిలోనే ప్రభుత్వం రెండు సార్లు అంగీకరించడం ఆశ్చర్యకరమని కేటీఆర్ అన్నారు. ఐటీ రంగంలో ఈ ఉద్యోగాల తగ్గుదలకు కృత్రిమ మేధస్సు కారణమా? లేదా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా వైఫల్యమా అన్నదానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సీతంపేటలో ఎస్‌ఐ చంద్రశేఖర్ ఆత్మహత్య

- భార్య మృతి తట్టుకోలేక కఠిన నిర్ణయం..
- ఆగమ్య గోచరంగా పిల్లల భవిష్యత్తు..
- దహన సంస్కారాలకు హాజరైన పోలీస్ అధికారులు నాయకులు







**ఇల్లంతకుంట, మార్చి 21 (జనం సాక్షి) :** మూడుముళ్ల బంధంతో ఒకటైన భార్యాభర్తల్లో భార్య అకాల మృత్యువాత పడడంతో ఆమె తనతో కలిసి ఉన్న జ్ఞాపకాలను మధుర క్షణాలను మరిచిపోలేక కలలో కనిపించి తనతో రావాలని అనడంతో ఆమె యాది లో భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కరీంనగర్ జిల్లాలో పెను విషాదాన్ని నింపింది. కరీంనగర్ పోలీస్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దేశం చంద్రశేఖర్ (38) అనే వ్యక్తి కి ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన దివ్యతో గత కొద్ది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు అశ్వత్థామ అభిమన్యు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ భార్య దివ్య కడుపునొప్పితో బాధపడుతూ ఆమె ఇంట్లోనే విషపూరిత మందు తాగగా కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఇల్లందకుంట మండలంలోని సీతంపేట గ్రామంలో అత్తగారి నివాసంలో భార్య దివ్య ఐదో రోజు పిట్టకు పెట్టి ఇంటికి వచ్చిన ఎస్సై చంద్రశేఖర్ డ్రెస్ మార్చుకుంటాను అని చెప్పి గదిలోకి వెళ్లి ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తలుపు బ్రేక్ చేసి చూడగా ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకొని ఉండటాన్ని గమనించి హుటాహుటిన జమ్మికుంట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. గత మూడు రోజుల నుండి చనిపోతాను అని కుటుంబ సభ్యులతో బంధువులతో అన్నారని అలా చేసుకోవద్దని కుటుంబ సభ్యులు బంధువులు కౌన్సిలింగ్ చేసిన ఫలితం లేకుండా పోయింది.కడుపునొప్పితో భార్య దివ్య మరణాన్ని తట్టుకోలేక తీవ్ర మనస్థాపానికి గురైన భర్త చంద్రశేఖర్ మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు తల్లిదండ్రులు లేని అనాథలు అయ్యారు. భార్యాభర్తల మృతితో కుటుంబ సభ్యుల రోధనలు పలువురిని కంటతడి పెట్టించాయి. మృతుని సోదరుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట రూరల్ సిఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

**జనసంద్రమైన సీతంపేట..**

ఐదు రోజుల వ్యవధిలో ఎస్సై చంద్రశేఖర్ అతని భార్య దివ్య ఆత్మహత్య చేసుకుని చనిపోయిన ఘటన మండలంలోని సీతంపేట గ్రామంలో కలకలం రేపింది. ఐదు రోజుల క్రితం భార్య చనిపోగా శనివారం భర్త చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన అంత్యక్రియలకు భారీ ఎత్తున గ్రామస్తులు తరలివచ్చి ఘన నివాళులు అర్పించి వీడ్కోలు పలికారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను చూసి గ్రామస్తులు కన్నీరు పెట్టుకున్నారు.

**పోలీస్ అధికారుల సంతాపం...**

కరీంనగర్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న ఎస్సై చంద్రశేఖర్ మరణం డిపార్ట్మెంట్కు తీరని లోటని అడిషనల్ డీసీపీ వెంకటరమణ హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. మృతి చెందిన చంద్రశేఖర్ మృతదేహాన్ని కరీంనగర్ సీఐలు రామచందర్ రావు, సృజన్ రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుమల్ గౌడ్ లక్ష్మీనారాయణ, రామకృష్ణ గౌడ్ తో పాటు 2014 సంవత్సరానికి చెందిన ఎస్సై బ్యాచ్ ఘన నివాళులు అర్పించారు. భార్య స్వగ్రామమైన సీతంపేటలోనే పోలీసులు అధికార లాంచనాలతో చంద్రశేఖర్ కు అంత్యక్రియలు నిర్వహించారు.

## అసోంలో ఇక హిమంతకు ఉద్వాసనే

- కాంగ్రెస్ కూటమి గెలుస్తుందన్న గొగోయ్

**గువాహటి, మార్చి21 (జనంసాక్షి) :** అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లలో పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తెలిపారు. ఐదు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నట్టు చెప్పారు. బీజేపీ వ్యతిరేక ఓట్లలో చీలిక ఉండకపోవచ్చని, తద్వారా హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అస్సాంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ ఇంతవరకూ 94 మంది అభ్యర్థులను ప్రకటించింది.'అస్సాంలోని ఆరు విపక్ష పార్టీలైన కాంగ్రెస్, అస్సాం జాతీయ పరిషత్, రైజోర్ దళ్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కలిసి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ 100 మంది అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలే అవకాశం ఉండదనుకుంటున్నాం. హిమంత బిశ్వా శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావంతో ఉన్నాం' అని గొగోయ్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ భాగస్వామ్య పక్షమైన రైజోర్ దళ్‌కు 11 సీట్లను కేటాయించింది.

## ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం


- డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం
- రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్



**న్యూఢిల్లీ, మార్చి21 (జనంసాక్షి) :** పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎస్ ఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదని అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశం కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## అడవి బిడ్డలకు అడవులపై పాఠం

- ఆనందం వ్యక్తం చేస్తూ.. ఛాయా చిత్రాలను తిలకిస్తూ..



**ఆదిలాబాద్ ప్రతినిధి, (జనంసాక్షి) :** ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం కోసాయి ఆదివాసీ గూడెంలో నివసిస్తున్న అడవి బిడ్డలకు ఆ ప్రాంతంలో ఉన్న అడవుల ఆవశ్యకత పైన పాఠం చెప్పి అనంతరం పెద్ద ఎత్తున అడవులు, పక్షుల ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు జిల్లాకు చెందిన ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ. పక్షులు ఇంకా అడవి అందాల ఫోటోలను తీసిన కృష్ణను గూడెం సర్పంచ్ ఇంకా గ్రామస్తులు కృష్ణను ఎంతో అభినందించారు. ఇంత పెద్ద ఎత్తున అడవి అందాలు, ఇన్ని రకాల పక్షులు మా కోసాయి గ్రామంలో దాగి ఉన్నాయా అని ఎంతో మంత్ర ముగ్ధులయ్యారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలోనే కోసాయి అడవులు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉన్నాయన్నారు. అటవీ అందాలతో పాటు ఎన్నో వందల రకాల వివిధ పక్షుల కిలకిల రావాలు ఈ అడవుల్లో నిత్యం వినిపిస్తూ సందడి చేస్తుంటాయన్నారు.వీటిని చూడటానికి ఎందరో మంది పర్యాటకులు ఈ ప్రాంతంకు వచ్చి ప్రకృతి అందాలను చూసి ఆనందం వ్యక్తం చేస్తుంటారన్నారు. అడవులను పక్షులను కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో గూడెం సర్పంచ్ సిడాం శైలజ రవి, ఉప సర్పంచ్ కొడప రామారావు, పటేల్ దాదే రావు, మహాజన్ మెస్రం సుభాష్, గూడెం పెద్దలు మెస్రం కేశవ రావు, చిన్ను, నాగ్ నాథ్, నాగోరావు,పాండు, మనోహర్, లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కన్నుమూత

**అనంతపురం, మార్చి 21 (జనంసాక్షి) :** అనంత జిల్లా కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కన్నుమూశారు.. ఆయన వయస్సు 81 సంవత్సరాలు.. శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు.. ఉమ్మడి ఆంధ ప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన ఆరేళ్ల పాటు పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పనిచేశారు. కళ్యాణదుర్గం మండలం గరుడా పురం పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగారు. నెల రోజులుగా గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతూ.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇవాళ తెల్లవారు జామున తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు ..

## జన హృదయ బడ్జెట్

# పీపుల్స్ మార్చ్ కష్టాలకు 'భట్టి' భరోసా!







**రాజకీయాల్లో పాదయాత్రలు కొత్త కాదు, కానీ ఆ యాత్రలో విన్న ప్రతి ఆర్తనాదం ఒక ప్రభుత్వ విధానంగా (Policy) మారడం అరుదు. 2023 మార్చి 16న ఆదిలాబాద్ గడ్డపై పిప్పిరిలో మొదలై జులై రెండు ఖమ్మం దాకా సాగిన ఆనాటి సిఎల్పీ నేత ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క 'పీపుల్స్ మార్చ్' కేవలం ఒక రాజకీయ యాత్ర కాదు.. అది తెలంగాణ భవిష్యత్ బడ్జెట్‌కు ఒక 'లైవ్ మేనిఫెస్టో' అని నేటి 2026-27 బడ్జెట్ కేటాయింపులు నిరూపిస్తున్నాయి.**

నాడు ఎండనక, వాననక భట్టి విక్రమార్క వేసిన ప్రతి అడుగు, ప్రజల గుండె చప్పుడిని విన్న అడుగు. ఆనాడు పేదవాడి కళ్లలో చూసిన భయం, నిరుద్యోగి గొంతులో విన్న ఆవేదన, చదువుల తల్లి పడుతున్న అవస్థలే నేడు అంకెలుగా మారి నూతనంగా 9 పథకాలు అసెంబ్లీ వేదికగా ఆవిష్కృతమయ్యాయి.

### మట్టి మనుషుల గుండె ధైర్యం: 'ఇందిరమ్మ' భరోసా

పాదయాత్రలో అనేక కుటుంబాలు ఇంటి యజమానిని కోల్పోయి వీధిన పడటం భట్టి స్వయంగా చూశారు. ఆ కష్టాన్ని తుడిచేందుకే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పురుడుపోసుకుంది. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా కవరేజీని కల్పిస్తూ, జూన్ 2, 2026 నుంచి దీనిని అమలు చేయనున్నారు. 1.15 కోట్ల కుటుంబాలకు రూ. 4,000 కోట్లతో రక్షణ కల్పించడం అంటే.. అది కేవలం బీమా కాదు, సామాన్యుడి ప్రాణానికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవం.

### చదువుల తల్లి ముంగిట కొత్త వెలుగులు

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ఈ బడ్జెట్ శ్రీకారం చుట్టింది. బడికి వెళ్లే పిల్లల ఆకలి కేకలు పాదయాత్రలో భట్టి విక్రమార్కను కదిలించాయి. అందుకే ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేశారు. విద్యార్థుల పోషకాహారం కోసం వినూత్నంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ అందించనున్నారు. రాగి జావ, పాలు అందించే బ్రేక్‌ఫాస్ట్ పథకం రూ. 800 కోట్లు కేటాయించడం విద్యార్థుల ఆరోగ్యంపై ఆయనకున్న శ్రద్ధకు నిదర్శనం.

### ఇంటర్ విద్యార్థులకు భోజనం

ప్రభుత్వ పాఠశాలలలోహొఒకటి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజన పథకం ఉన్నది. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఆకలి తీర్చేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తూ రూ. 100 కోట్లు కేటాయింపు ఒక మానవీయ కోణం.

### తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళ ఏర్పాటు

ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళు'గా మార్చనున్నారు. ప్రీ-ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్యనందిస్తారు. దీని కోసం రూ. 500 కోట్లు కేటాయించారు. "పిల్లల భవిష్యత్తు కోసం తీసుకునే నిర్ణయాలు ఎప్పుడూ ఖర్చు కాదు - అవి పెట్టుబడులు. అమ్మ కలలు, పిల్లల చదువు - ఇవే తెలంగాణ భవిష్యత్తు." అని పేర్కొంటూ విద్యారంగానికిహొఈ బడ్జెట్లో భారీగా నిధులు కేటాయించిన ఉప ముఖ్యమంత్రి భట్టి కి విద్యావేత్తల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

### ఉద్యోగులు, పెన్షనర్లకు 'అపర రక్షణ'

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం దేశంలోనే ఎక్కడా లేని విధంగా భద్రతను కల్పించారు. రూ. 1,056 కోట్లతో నగదు రహిత చికిత్స అందించడం ఒక విప్లవాత్మక అడుగు. 23.51 లక్షల మందికి 1,998 వ్యాధులకు సంబంధించి 421 ప్రైవేట్ ఆసుపత్రులలో నగదు రహిత చికిత్స అందుతుంది. ప్రతి ఒక్కరికీ 'డిజిటల్ హెల్త్ కార్డు' అందజేయడం ఉద్యోగులకు రక్షణ కవచంగా ఈ ప్రభుత్వం నిలిచింది. విధి నిర్వహణలో మరణించిన వారికి రూ. 1.20 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు బీమా కల్పించడం ద్వారా యంత్రాంగానికి కొండంత అండగా నిలిచారు. ప్రజా ప్రభుత్వ ఏర్పడిన తొలినాళ్లలో సింగరేణి సంస్థలో ఈ పథకానికి శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ తర్వాత ట్రాన్స్కో, జెన్కో, డిస్కంలకు విస్తరించగా, ఈ బడ్జెట్లో ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఈ ప్రమాద బీమా వర్తించే విధంగా నిధులు కేటాయింపు చేయడం ఆయనకు ఉద్యోగుల పట్ల ఉన్న మమకారం.

### సరిహద్దులు దాటిన ఉపాధి స్వప్నం

గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు విదేశాలకు వెళ్లి మోసపోతున్న యువతను చూసిన భట్టి, వారి కోసం 'సీఎం ఓవర్సీస్ ఎంప్లాయి మెంట్' పథకాన్ని తెచ్చారు. రూ. 1,056 కోట్లతో భాషా నైపుణ్యాలు, గైడెన్స్ అందించడం ద్వారా తెలంగాణ యువతను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దే బాధ్యతను ప్రభుత్వం భుజాన వేసుకుంది. ఏటీసీలో శిక్షణ పొందే వారికి నెలకు రూ. 2,000 చొప్పున స్కాలర్‌షిప్ కోసం రూ. 80 కోట్లు కేటాయించారు. 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు', విద్యార్థులకు దివ్యాంగ విద్యార్థులకు ఎలక్ట్రిక్ వాహనాలు అందించడం వంటి నిర్ణయాలు రాష్ట్ర విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకనున్నాయి. చేయూత పథకం ద్వారా అదనంగా 2 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేస్తూ, మొత్తం ఈ పథకానికి రూ. 14,861 కోట్లు కేటాయించారు. పాదయాత్రలోహొఆపన్నుల అర్ధనాథాలను విన్న భట్టి చేయూత పథకం ద్వారా 2 లక్షల మంది పెన్షనర్ల జీవితాలకు ఆసరా అయ్యారు.

### ప్రజల నుంచే పుట్టిన బడ్జెట్

సాధారణంగా బడ్జెట్ అంటే ఏసీ గదుల్లో అధికారుల లెక్కలతో తయారవుతుంది. కానీ 2026-27 బడ్జెట్ ప్రజల కాళ్ల కింద నలిగిన మట్టి వాసనతో, వారి కన్నీటి తడితో తయారైంది. "పాదయాత్రలో నేను చూసిన ప్రతి కష్టం నాకు ఒక పాఠం నేర్పింది. ఆ పాఠాల నుంచే ఈ పథకాలు పుట్టాయి" అని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాటలు ఈ బడ్జెట్ ఆత్మను ప్రతిబింబిస్తున్నాయి. పీపుల్స్ మార్చ్ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, పేదరికం లేని తెలంగాణ లక్ష్యంగా 'బట్టి' ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ నిజంగా 'జన హృదయ బడ్జెట్'. ఇది కేవలం కేటాయింపుల పద్దు కాదు.. ప్రతి తెలంగాణ బిడ్డ భవిష్యత్తుకు భరోసా పత్రం!



**దుడుక రామకృష్ణ**
డిప్యూటీ సీఎం పిఆర్ఓ

---

## ఇంతకంటే ఏంచేస్తాం!

ఎవరి పనులువారివి
ఎవరిస్థానాల్లోవారు
ఎవరికులాలు వారివి
ఎవరిమతాలు వారివి
ఎవడికివాడు మేధావి!
నీతులుచెప్పేవాళ్ళేకాని
వినేవాళ్ళులేరు!

దిక్కులేని వాళ్ళకు
దేవుడొకడున్నాడు
దీనినిబాగానమ్మారు!
దేవుడొక్కడుచాలు!
మానవ మాత్రులు
ఏం చెయ్యగలరు?
ప్రజల మనోభావాలు
ఇలాగే ఉంటాయి!
ఎవ్వరూ మారరు!
రాసేవాళ్ళు రాస్తారు

పాడేవాళ్ళుపాడతారు
కీర్తి కండూతి
వేదికలు! శాలువాలు!
నేనుచెప్పాలనుకున్నది
ఇది కాదు!
ఎవరి అలవాట్లలోవాళ్ళు
ఎవరిదరిద్రంలో వాళ్ళు
ఉంటే ఉండనీయండి!
ఒదశాబ్దకాలంపైగా
'ట్రెండ్' మారింది!

ఆర్యదేవతలొచ్చారు!
కులపిచ్చి మతోన్మాదం
రెచ్చగొట్టేస్తున్నారు!
పాతబడ్డ పడిపోయిన
గుళ్ళ జీర్ణోద్ధరణ!
కాలుష్య నదుల్లో
పవిత్రస్నానాలు
ప్రత్యక్ష స్వర్గం(నరకం)
దేశం అల్లకల్లోలం!
మేమే గొప్ప!

మామతమే గొప్ప!
మా కులమే గొప్ప!
మిగిలినవాళ్లు పొండి!
భూతవైద్యంజ్యోతిషం
ఇవి చదవండి!
రోజూ సైన్స్ వెలుగుల్లో
జీవిస్తున్నప్పటికి
సైన్స్ మనకు వద్దు!
స్వామీజీలు బాబాలు
పీఠాలు మఠాలు!

సెక్స్ కు నెలవులు!
హత్యలు చేస్తున్నా
వాళ్ళకే సాష్టాంగం!
ఒకప్రక్కసామ్రాజ్యవాదం
మరోప్రక్క మత తత్వం
పీక్కు తినేస్తా ఉంటే
ఇలాగే బ్రతికేద్దాం!
ఇంతకంటే ఏంచేస్తాం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

---

### మార్క్సిస్ట్ చరిత్రకారుడు

# ప్రొఫెసర్ కె.ఎన్. పణిక్కర్



మార్క్సిస్ట్ చరిత్రకారుడు ప్రొఫెసర్ కె.ఎన్. (కందియూర్ నారాయణ) పణిక్కర్ 89 సంవత్సరాల వయసులో వృద్ధాప్య సమస్యలతో మార్చి 9 నాడు తిరువనంతపురంలో మరణించడం కడు విషాదకరం. చరిత్ర యొక్క మతపరమైన వక్రీకరణలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ తుదిశ్వాస వరకు నిబద్ధత గల చరిత్రకారుడుగా ఆదర్శవంతంగా జీవించిన ఆయన మరణం చారిత్రక - సామాజిక - సాంస్కృతిక రంగాలకు తీరని లోటు.

ప్రొఫెసర్ కె.ఎన్. (కందియూర్ నారాయణ) పణిక్కర్ కేరళలోని గురువాయూర్లో కృష్ణన్ నాయర్ మరియు ఇచ్చుకుట్టి అమ్మ దంపతులకు 1936 లో ఏప్రిల్ 26 నాడు జన్మించారు. ఆయన పాలక్కాడ్ ( కేరళ) లోని విక్టోరియా కళాశాల నుండి అండర్ గ్రాడ్యుయేట్ విద్యని అభ్యసించారు. జైపూర్లోని రాజస్థాన్ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ను అభ్యసించి మరియు అదే విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందాడు. ఆయన ఢిల్లీ విశ్వవిద్యాలయం లోని హన్స్రాజ్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేశారు. ఆ తర్వాత ఆయన 1972 లో జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో చరిత్ర అధ్యాపకుడి గాను, సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ మరియు డీన్ గాను పనిచేశారు. ఆ తర్వాత ఆయన సెంటర్ ఫర్ హిస్టారికల్ స్టడీస్ ఛైర్మన్గా పనిచేశారు.

ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ కాలడిలోని శ్రీ శంకరాచార్య సంస్కృత విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్గా పనిచేశారు. కేరళ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ గాను ఆయన పనిచేశారు. చారిత్రక పరిశోధనలకు మద్దతు ఇచ్చే సంస్థలను నిర్మించడంలో కూడా ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ ముఖ్యమైన పాత్ర పోషించారు. కేరళ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడిగాను కొనసాగారు. ఆయన 2001 నుండి 2017 వరకు కేరళ చారిత్రక పరిశోధన మండలికి నాయకత్వం వహించారు. ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ అధ్యక్షుడిగాను పనిచేశారు. పాఠశాల పాఠ్యపుస్తకాలను సమీక్షించడానికి కేరళ ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీకి ఆయన ఛైర్మన్ గాను వ్యవహరించారు. 2002 గుజరాత్ అల్లర్ల తరువాత హర్ష్ మందర్ మరియు షబ్నం హష్మి వంటి కార్యకర్తలతో కలిసి కె.ఎన్.పణిక్కర్ 'యాక్ట్ నౌ ఫర్ హార్మనీ అండ్ డెమోక్రసీ' అనే సంస్థని స్థాపించారు.

'చరిత్ర అంటే సంఘటనలను గుర్తుంచుకోవడం మాత్రమే కాదు, నిర్మాణాలు, వైరుధ్యాలు మరియు పరివర్తనలను అన్వేషించడం' అనే వాటికి ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. 'నూతన మానవ సమాజాలను రూపొందించే శక్తుల విమర్శనాత్మక అన్వేషణగా చరిత్ర రచన సాగాలి' అని ఆయన భావించారు. 'చరిత్రను రాజకీయ సమీకరణ సాధనంగా మార్చడం మూలంగా సామాజిక విభజనలను తీవ్రతరం చేయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను క్షీణింపజేస్తుంది' అని ఆయన పదే పదే నొక్కి చెప్పడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. మతతత్వ కథనాలు చారిత్రక అవగాహనను తప్పుదారి పట్టిస్తూ అంతిమంగా భారతీయ సమాజం యొక్క ప్రజాస్వామ్య పునాదులను కూడా క్షీణింపజేస్తాయని ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ వక్కాణించారు. చరిత్ర యొక్క మతపరమైన వివరణలతో విద్యను నింపడానికి మరియు రాజకీయ అజెండాలకు అనుగుణంగా చరిత్రని వక్రీకరించి రూపొందించడానికి చేసే కుటిల ప్రయత్నాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

బ్రిటిష్ డిప్లొమసీ ఇన్ నార్త్ ఇండియా, కల్చర్ అండ్ కాన్షియస్నెస్ ఇన్ మోడరన్ ఇండియా, నేషనల్ అండ్ లెఫ్ట్ మూవ్మెంట్స్ ఇన్ ఇండియా మరియు ల్యాండ్మార్క్ ఎగైనెస్ట్ లార్డ్ అండ్ స్టేట్: రిలిజియన్ అండ్ పెసెంట్ అప్రైసింగ్స్ ఇన్ మలబార్ మొదలైన ప్రఖ్యాత గ్రంథాలను ప్రొఫెసర్ కె.ఎన్. పణిక్కర్ రచించారు. అలాగే భారతదేశంలో కమ్యూనలిజం: చరిత్ర, రాజకీయాలు మరియు సంస్కృతి అనే పుస్తకంపై తీవ్రమైన విమర్శలు వెలువెత్తిననూ ఆ పుస్తకం లౌకిక చారిత్రక దృష్టికి అద్దం పట్టడం గమనార్హం. మొత్తంగా ప్రొఫెసర్ కె.ఎన్. పణిక్కర్ రచనలు లౌకికతకు పెద్దపీట వేయడం మూలంగా ఆధునిక భారతదేశం యొక్క ప్రజాస్వామ్య మరియు లౌకిక స్వభావాన్ని కాపాడుకోవడానికి ఆలంబనగా నిలిచాయి అని చెప్పవచ్చు. 'ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ రచనలు కేవలం గతం యొక్క రికార్డు కానే కాదు. వర్తమానం మరియు భవిష్యత్తులను గురించి అంతులేని సంభాషణలను కూడా గుర్తు చేస్తాయి' అని పేర్కొనడంలో ఏమాత్రం ఔచిత్యం లేదు.

ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ ఆధునిక భారతీయ చరిత్ర అధ్యయనంలో ప్రగతిశీల దృక్పథాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన 'మార్క్సిస్ట్ చరిత్ర రచనకు మారుపేరుగా నిలిచారు'. ప్రొఫెసర్ కె.ఎన్.పనిక్కర్ నాస్తికుడు. ఆయన ఏ మతపరమైన పండుగలకు డబ్బును విరాళంగా ఇచ్చిన దాఖలాలు లేవు. చరిత్ర రచనలో లౌకిక మరియు శాస్త్రీయ విధానాలను సమర్థించడం మరియు ఆవిష్కరించడంలో ఆయన విశేష కృషి చేశారు. 'ప్రొఫెసర్ కె.ఎన్.పణిక్కర్ రణించిననూ ఆయన రచనలు మరియు బోధనలు భారతదేశ సాంస్కృతిక వైవిధ్య వారసత్వానికి ప్రతీకలుగా బాసిల్లుతూనే ఉంటాయి'. ఈ సందర్భంగా ఆయనకు నేను వినమ్ర నివాళులు అర్పిస్తున్నాను.



**జె.జె.సి.పి.బాబూరావు**
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

---

# పోలీసు బీభత్సానికి రాజధాని!


దేశ రాజధాని ఢిల్లీ నుంచి అత్యంత భయానకమైన వార్తలు వస్తున్నాయి. ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ కారణాలు చూపకుండా పది మంది విద్యార్థి యువజనులను అక్రమంగా మూడు రోజుల పాటు నిర్బంధించడమే కాక, అమానుషమైన, నీచమైన చిత్రహింసలకు గురి చేశారని ఢిల్లీ హైకోర్టు ముందు బైటపడింది. వారిని అదుపులోకి తీసుకున్న స్థలాల దగ్గర సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని హైకోర్టు ఆదేశించింది.

పోలీసులు వేరు వేరు స్థలాల నుంచి ఎత్తుకుపోయిన వారందరూ కార్మిక హక్కుల కోసం, నిర్వాసిత హక్కుల కోసం ఏర్పడిన సంస్థలలో పని చేస్తున్న విద్యార్థి, యువజన కార్యకర్తలు. ఎక్కడా ఎప్పుడూ ఎటువంటి నేరారోపణలను ఎదుర్కొంటున్నవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వ అభిప్రాయాలతో విభేదిస్తున్న వారు అయినంత మాత్రాన వారిని దొంగతనంగా ఎత్తుకుపోవడం, ఇరవై నాలుగు గంటల లోపల న్యాయస్థానంలో హాజరు పరచకుండా, ప్రత్యేక చిత్రహింసా శిబిరంలో అక్రమ నిర్బంధంలో పెట్టడం, అత్యంత నీచమైన, అమానుషమైన, అవమానకరమైన పద్ధతిలో లైంగిక హింసతో సహా చిత్రహింసలు పెట్టడం ఈ దేశంలో, అందులోనూ రాజధానిలో చట్టబద్ధ పాలన సాగడం లేదనీ, ప్రజాస్వామిక హక్కులను, రాజ్యాంగబద్ధమైన పౌరహక్కులను గౌరవించాలనే కనీస స్పృహ అమిత్ షా మంత్రిత్వ శాఖకు ఎంతమాత్రమూ లేదనీ తేటతెల్లం చేస్తున్నది.

ఈ అపహరణ ప్రక్రియ మార్చ్ 12న మొదలయింది. మార్చ్ 23 భగత్ సింగ్ సంస్మరణ దినంతో ప్రారంభించి వారం రోజుల పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక వారం కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటున్నవారి మీద ఈ దాడి జరిగింది. ఆ కార్యక్రమం గురించి చర్చించడానికి ఢిల్లీ దయాళ్ సింగ్ కాలేజీ అధ్యాపకుడు ఎన్ సచిన్ దగ్గరికి మజ్దూర్ అధికార్ సంఘటన్ నాయకుడు శివ్ కుమార్, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో సైకాలజీ ఎంఎ విద్యార్థి, భగత్ సింగ్ చాత్ర ఏకతా మంచ్ కార్యకర్త ఇలక్కియ కాలేజీ గేటు దగ్గరికి ఒంటి గంటకు చేరి, ఎంతసేపట్లో బైటికి వస్తారని సచిన్ కు మెసేజి పంపారు. ఆయన ఒకటిన్నరకు బైటికి వచ్చేసరికి, ఒక అమ్మాయిని మామూలు దుస్తుల్లో ఉన్న ఒక మహిళా పోలీసు, మరొక నలుగురు పోలీసులు ఒక వీఐపీ లైట్లు ఉన్న వాహనంలోకి లాగి ఎత్తుకుపోయారని అక్కడి దుకాణదారులు చెప్పారు. అప్పటికే శివ కుమార్ ను ఆ వాహనంలోకి తోశారు.

తర్వాత కొద్ది సేపటికే, ఢిల్లీలో జరిగిన ఒక సభ నుంచి ఇంటికి వెళ్తున్న మజ్దూర్ అధికార్ సంఘటన్ కార్యకర్త, కార్మికుడు మన్ జీత్ కుమార్ ను జహంగీర్ పురి నుంచి ఎత్తుకుపోయారు. మర్నాడు రాత్రి 8 గంటలకు ఢిల్లీ యూనివర్సిటీ నార్త్ క్యాంపస్ దగ్గర విజయ్ నగర్ లో భగత్ సింగ్ ఛాత్ర ఏకతా మంచ్ కార్యాలయం మీద దాడి చేసి విద్యార్థి కార్యకర్తలు గౌరవ్, రుద్ర విక్రమ్ రాయ్, దృష్టి, కిరణ్ లమా, న్యాయశాస్త్ర విద్యార్థి అక్షయ్ నీ ఎత్తుకుపోయారు. ఆ సమయంలోనే ఫోరం అగెనెస్ట్ కార్పొరేటైజేషన్ అండ్ మిలిటరైజేషన్‌కు చెందిన కార్యకర్తలు ఎహ్తెమామ్, బాదల్ లను ఎత్తుకుపోయారు.

ఇలా దేశ రాజధానిలో ఆరుగురు విద్యార్థులను, ఇద్దరు కార్మిక సంఘ కార్యకర్తలను, ఇద్దరు సామాజిక కార్యకర్తలను ఎత్తుకుపోయి, రెండు రోజులు గడిచినా ఎక్కడా న్యాయస్థానంలో హాజరు పరచకపోవడంతో మార్చ్ 14న ఢిల్లీలో ముప్పై ఏడు పౌర సమాజ సంస్థల కూటమి క్యాంపెయిన్ అగెనెస్ట్ స్టేట్ రిప్రెషన్ (సిఎఎస్ఆర్) ఒక వివరమైన పత్రికా ప్రకటన ఇచ్చింది. ఆ మధ్యాహ్నం ముగ్గురు నిందితుల కుటుంబ సభ్యులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆ పిటిషన్లను స్వీకరించి, మర్నాడు ఆదివారం అయినప్పటికీ ఈ పిటిషన్ వినడానికి ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేస్తానని అన్నారు. అన్నట్టుగానే జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ రవీందర్ దుడేజాల ద్విసభ్య ధర్మాసనం మధ్యాహ్నం 12 గంటలకు ఈ పిటిషన్ వినాలని నిర్ణయమయింది.




ఒకవైపు హైకోర్టులో ఈ ప్రయత్నాలు జరుగుతుండగా, మార్చ్ 14 అర్ధరాత్రి 11.45కు అంటే మొదటి అపహరణల తర్వాత దాదాపు అరవై గంటలకు, రెండో విడత అపహరణల తర్వాత నలభై గంటలకు, హైకోర్టు విచారణ పన్నెండు గంటల్లో జరుగుతుందనగా నిర్బంధంలో ఉన్న పది మందిలో తొమ్మిది మందిని విడిచి పెట్టారు. 'వారెవరూ మా నిర్బంధంలో లేరు, కనుక ఈ పిటిషన్ విచారించనక్కర లేదు' అని చెప్పడం పోలీసుల ఉద్దేశం. అప్పటికీ రుద్ర విక్రమ్ రాయ్ ను వదిలిపెట్టలేదు. ఇలా కోర్టు విచారణకు భయపడి హడావిడిగా విడుదల చేసిన సంగతీ, అప్పటికీ మరొకరిని అక్రమ నిర్బంధంలోనే ఉంచుకున్న సంగతీ న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. మిగిలిన ఒక్కరినీ కోర్టు విచారణ తర్వాత నాలుగు గంటలకు విడుదల చేశారు.

ఈ పది మందినీ నిర్బంధంలో ఉంచుకోవడానికి కారణాలను, తమ చర్య ఏ చట్ట ప్రకారం చెల్లుతుందో చూపుకునే సమాధానాన్ని వారం లోపు సమర్పించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. వారి మీద నేరారోపణలు ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఎఫ్ఐఆర్) లో ఉన్నాయని, వారు స్వచ్ఛందంగా తమ వాంగ్మూలం ఇచ్చేందుకే పోలీసుల దగ్గరికి వచ్చారని ప్రభుత్వ న్యాయవాది చెప్పగా, ఆ ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వాలని నిందితుల తరఫు న్యాయవాది కోరారు. అది రహస్య పత్రమనీ, దాన్ని న్యాయమూర్తికి మాత్రమే ఇస్తామనీ ఢిల్లీ పోలీసులు అన్నారు. ఎఫ్ఐఆర్ అనేది బహిరంగ పత్రం. ఎవరి మీద నేరం ఆరోపిస్తున్నారో వారికి తప్పనిసరిగా ఇవ్వాలి. ఆ ఆరోపణలకు జవాబు చెప్పుకోవడానికి, ఖండించడానికి, అవి ఎలా తప్పో వాదించడానికి ఆ పత్రం నిందితులకు అవసరం. అది చట్టబద్ధమైన హక్కు. ఢిల్లీ పోలీసులకు చట్టం అంటే లెక్క లేనట్టుంది. పోలీసు న్యాయవాది ఆ మాట అన్నప్పుడు, న్యాయమూర్తులు కూడా అది తప్పు అనీ, ఎఫ్ఐఆర్ నిందితులకు ఇవ్వవలసిందే అనీ చెప్పలేదు! కాకపోతే, దయాళ్ సింగ్ కాలేజీ గేటు దగ్గర, జహంగీర్ పురిలో, విజయ నగర్ లో వారిని అదుపులోకి తీసుకున్న స్థలాల సీసీటీవీ ఫుటేజీ భద్రపరచాలని, సాక్ష్యాధారాలు చెరిగిపోకుండా చూడాలని కోర్టు ఆదేశించింది. విచారణను మార్చ్ 27కు వాయిదా వేసింది.

వారిని తమ దగ్గర అక్రమ నిర్బంధంలో పెట్టుకున్న అరవై - నలభై గంటల్లో ఒక్కొక్కరి మీద జరిగిన చిత్రహింసలు వింటే ఎమర్జెన్సీ చిత్రహింసలు, లాటిన్ అమెరికన్ నియంతృత్వాలలో జరిగిన చిత్రహింసలు గుర్తుకొచ్చి ఒళ్లు జలదరిస్తుంది.


శివ కుమార్ ను భౌతిక, లైంగిక హింసకు గురి చేశారు. లాకప్‌లో ఆయనను నగ్నంగా మార్చి ఆయన బెల్ట్ మెటల్ బకిల్ తో మర్మావయవాల మీద పదే పదే కొట్టారు. తలకిందులుగా వేలాడదీసి రబ్బర్ లాఠీతో తొడల మీద, పిక్కల మీద బాదారు. గడ్డం పట్టుకుని మనిషిని అమాంతం పైకి లేపారు. ఆయన పాదాల మీద తమ బూటు కాళ్లు పెట్టి తొక్కారు. నిర్బంధ కాలమంతా చేతులకు బేడీలు వేసి ఉంచారు. చంపుతామని బెదిరిస్తూ ఉన్నారు. తుపాకి గురిపెట్టి కొన్ని కాగితాల మీద సంతకం పెట్టించుకున్నారు. వాటిలో తనను ఎవరూ నిర్బంధించలేదని, తానే ఉద్దేశపూర్వకంగా అజ్ఞాతంలోకి వెళ్లానని రాసి ఉందంటే, ఈ అక్రమ నిర్బంధాన్ని కప్పిపెట్టడానికి కూడా ఏర్పాట్లు చేశారు. ఈ భౌతిక, మానసిక చిత్రహింసలకు తోడు, శివ కుమార్ నూ రుద్రనూ ఒకరి ముందు ఒకరిని నగ్నంగా నిలబెట్టి, లైంగికంగా అవమానించారు, ఒకరిమీద ఒకరు లైంగిక హింస సాగించమని ఒత్తిడి చేశారు.

మన్ జీత్ కుమార్ ను కూడా చిత్రహింసా శిబిరంలోకి తీసుకురాగానే నగ్నంగా మార్చి, నేల మీద బోర్లా పడుకోబెట్టి, కాలి మడమల మీద కొట్టారు. వీపు మీద పోలీసు అధికారులు కూచున్నారు. ఆయన దళితుడని తెలిసి, పోలీసు అధికారులు కులం పేరు పెట్టి దూషించారు. నగ్నంగానే ఉంచి అక్కడి గదులను ఊడిపించి, తుడిపించారు. ఆయన మీద కూడా లైంగిక వేధింపులు జరిగాయి. ఒక పోలీసు అధికారి ఆయన మీద లైంగిక అత్యాచారం చేశాడు. అది జరుగుతుండగా ఇతర అధికారులు దాన్ని వీడియో తీశారు.

మన్ జీత్ తల్లీ, ఆయన స్నేహితుడు అమన్ హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడానికి ఢిల్లీ వెళ్లి తిరిగి వస్తుండగా, వారి గ్రామ సమీపంలో తల్లి నుంచి అమన్ ను వేరు చేసి ఎత్తుకుపోయారు. ఆయనను కూడా న్యూ ఫ్రెండ్స్ కాలనీ లోని ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ కు తీసుకువెళ్లి కోర్టుకు వెళ్లినందుకు బెదిరించారు. అంటే అక్రమ నిర్బంధం సమస్యలో న్యాయస్థానం తలుపు తట్టడానికి రాజ్యాంగం ఇచ్చిన హక్కును కూడా కాలరాయదలిచారు.

గౌరవ్ నూ రుద్రనూ కూడా చిత్రహింసా శిబిరం చేర్చగానే నగ్నంగా మార్చి, భౌతికంగా దాడి చేశారు. గౌరవ్ మర్మావయవాల మీద ఇనుప గొలుసుతో కొట్టారు. ఆ ఇద్దరినీ లైంగికంగా అవమానించారు. తప్పుడు ప్రకటన మీద సంతకం చేయమని గౌరవ్‌ను ఒత్తిడిచేసి, ఆయన నిరాకరించగా, తలను గోడకేసి బాదారు. అక్షయ్‌కి కొద్ది కాలం కింద మోకాలు మీద గాయం అయిందని తెలిసి, సరిగ్గా ఆ గాయం మీద కొట్టారు. కాళ్లు విడదీసి ప్రత్యేకంగా ఆ మోకాలు మీద ఒత్తిడి పెట్టారు. అవినాష్‌ను కొట్టి, తన్ని, అవమానిస్తూ, ఆయన ఆడంగిగా ఉన్నాడని దుర్భాషలాడారు. ఆయననూ గౌరవ్ నూ అవమానకరమైన లైంగిక చర్యలలో పాల్గొనమని వేధించారు. రుద్రను కొడుతూ, చంపుతామని బెదిరిస్తూ, చంపి ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబానికి శవం ఇస్తామని భయపెడుతూ తీవ్రమైన లైంగిక దాడికీ, అవమానానికీ గురి చేశారు. ఆయన చేత కూడా తప్పుడు ప్రకటనల మీద సంతకాలు తీసుకున్నారు. ఈ పది మందిలో ఒకరిని 2021 జనవరిలో రైతు ఆందోళన సందర్భంగా హర్యానా పోలీసులు నిర్బంధించి వారం రోజులపాటు అక్రమ నిర్బంధంలో ఉంచి చిత్రహింసలు పెట్టారు. ఎనిమిది మందిని 2025 జూలై లో ఇలాగే వారం రోజులు అక్రమ నిర్బంధంలో పెట్టి చిత్రహింసలు పెట్టారు. ముగ్గురిని ఢిల్లీ కాలుష్యం మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ గత నవంబర్ లో ఇండియా గేట్ దగ్గర నిరసన ప్రదర్శన చేసినప్పుడు నిర్బంధించి, వారం తర్వాత కోర్టు ఆదేశాలతో వదిలిపెట్టారు.

అక్రమ అపహరణ, కారణాలు చెప్పకుండా నిర్బంధించడం, న్యాయవాదినీ, కుటుంబాన్నీ సంప్రదించే అవకాశం ఇవ్వకపోవడం, ఇరవై నాలుగు గంటల్లో న్యాయస్థానం ముందు హాజరు పరచకపోవడం, కస్టడీలో చిత్రహింసలకు, లైంగిక వేధింపులకు, కుల దూషణకు గురి చేయడం, చంపుతామని బెదిరించడం, తప్పుడు ప్రకటనల మీద బలవంతంగా సంతకాలు తీసుకోవడం, న్యాయస్థానానికి వెళ్లినందుకు బెదిరించడం - స్వయంగా ఈ దేశ హోమ్ మంత్రి అధీనంలో నడిచే ఢిల్లీ పోలీసు శాఖ చేసిన ఈ పనులన్నీ రాజ్యాంగానికీ, మానవ హక్కుల చట్టానికీ, భారత ప్రభుత్వం సంతకం చేసిన అనేక అంతర్జాతీయ ఒడంబడికలకూ, ప్రజాస్వామ్యానికీ, నాగరిక, సభ్య ప్రవర్తనకూ ఉల్లంఘనలు. సంఘ్ పరివార్ కు తెలిసినది ఆ ఉల్లంఘన మాత్రమే.



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# విద్య, వైద్య రంగాలకు అధిక నిధులు కేటాయించాలి

- బడ్జెట్ సవరించాల్సిందే, లేకుంటే ఉద్యమాలే...
- రాష్ట్రాల హక్కులను కేంద్రం లాక్కోవడం దారుణం..
- బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు తక్కువ నిధుల కేటాయింపు దారుణం
- పేదల సంక్షేమం కోసం సంపన్నులపై పన్నుల శాతాన్ని పెంచాల్సిందే
- సీపీఐ(ఎం) రౌండ్‌టేబుల్‌లో పలువురు వక్తలు...




**ముషీరాబాద్, మార్చి 21 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక నిధులను కేటాయించాలని, ఆ రెండు రంగాలను ప్రభుత్వ వ్యవస్థలో బలోపేతం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయ, సంక్షేమం లాంటి ప్రాధాన్యతా రంగాలకు నిధుల కేటాయింపును పెంచాలనీ, లేకుంటే ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు,టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్ లు హాజరై మాట్లాడారు. రాష్ట్రాల ఆదాయ వనరులను కేంద్ర ప్రభుత్వం లాక్కోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒకలా, బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు మరోలా నిధులు కేటాయించడాన్ని తప్పుబట్టారు. పేదల సంక్షేమం కోసం సంపన్నులపై పన్నుల భారాన్ని పెంచాల్సిందేనని నొక్కి చెప్పారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాల నుంచి పన్నుల రూపంలో కాకుండా సెస్‌లు, సర్‌చార్జీల రూపంలో వసూలు చేస్తున్నదనీ, దీనివల్ల రాష్ట్రాలకు వాటా దక్కకుండా పోతున్నదని ఆర్థిక విశ్లేషకులు, ప్రొఫెసర్ పాపారావు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే నిధులు ఇస్తాం, ప్రతిపక్ష పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు ఇవ్వబోమన్నట్టుగా కేంద్రంలోని ఎన్‌డీఏ సర్కారు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రాష్ట్రాలకు స్టేట్ ఓన్ ట్యాక్స్ రెవన్యూ పడిపోతున్నాయనీ, కేంద్రం ఆధిపత్యంతో రాష్ట్రాల ఆదాయ వనరులు గణనీయంగా పడిపోయాయని వివరించారు. వనరులు తగ్గటంతో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేని పరిస్థితిలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని చెప్పారు. ద్రవ్యోల్బణం తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటనీ, దీంతో తెలంగాణ ప్రజల కొనుగోలు శక్తి పడిపోతున్నదని తెలిపారు. ధనికుల, పేదల సంపదను కలిపి తలసరి ఆదాయం రూ.4 లక్షల కోట్లకుపైగా ఉందని గొప్పలు చెప్పుకోవడం వల్ల ప్రయోజనం లేదన్నారు. సంపద పంపిణీలో తీవ్ర అసమానతలు ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ... ఓపక్క రాష్ట్రాల ఆదాయ వనరులు, కేంద్రం నుంచి వచ్చేవాటాలు తగ్గుతున్నాయనీ, మరోపక్క ఖర్చులు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్రానికే పంపే వాటాలో తిరిగి 42 శాతమే వస్తున్నదనీ, ఆ కేటాయింపుల్లోనూ బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒకలా, ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలకు మరోలా ఉంటున్నదని ఎత్తిచూపారు. ఎక్సైజ్, స్టాంప్స్, కస్టమ్స్, వాహనాల కొనుగోళ్ల ద్వారా వచ్చే ఆదాయమే కీలంగా మారుతున్నదని చెప్పారు. కేంద్రం తీరుతో సంక్షేమం, అభివృద్ధికి నిధులను బ్యాలెన్స్ చేయలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్ర బడ్జెట్‌లో కేంద్రం నుంచి 24 వేల కోట్ల గ్రాంట్లు వస్తాయని రాసుకున్నప్పటికీ వాస్తవానికి అవి రూ.7 నుంచి రూ.8 వేల కోట్లకు మించడం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం నిధుల్లో కోత పెట్టిందనీ, సర్వశిక్ష అభియాన్ జీతభత్యాలను కూడా పెంచడం లేదని ఎత్తిచూపారు. కేంద్రం వాటాలు తగ్గినప్పుడు ఆదాయ వనరుల సమీకరణలో రాష్ట్రాలకు ఇబ్బందులు తప్పవన్నారు. గతంలో తక్కువ వడ్డీకి ఎల్‌ఐసీ, చిన్నమొత్తాల సంస్థల నుంచి రాష్ట్ర ప్రభుత్వాలు అప్పులు తీసుకునేవనీ, దీనిపై కేంద్రం ఆంక్షలు విధించడంతో రాష్ట్ర ప్రభుత్వాలు తప్పని సరి పరిస్థితుల్లో 10 శాతం వడ్డీకి అప్పులు తేవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఎఫ్‌ఆర్‌బీఎమ్ పరిధికి లోబడి అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వం నుంచి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు బడ్జెట్ ప్రతిపాదనలు, కేటాయింపులు, ఖర్చుల విషయానికి వచ్చేసరికి 10 నుంచి 15 శాతం మేరకు వ్యత్యాసం ఉంటున్నదని ఎత్తిచూపారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ..బడ్జెట్‌లో ఎక్కువగా రుణాలు, వడ్డీలు, జీతభత్యాలకే పోతే సంక్షేమం, అభివృద్ధి ఎలా అని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీలకు నిర్దిష్ట కేటాయింపులు ఏవని నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 వేల కోట్లు ఎలా సరిపోతాయని అడిగారు. కొత్తరేషన్ కార్డులు ఇచ్చారు సరే నిధుల పెంపు ఏది అని ప్రశ్నించారు. విద్యకు 8.2 శాతం కేటాయించడం దారుణమన్నారు. దళిత సంక్షేమానికి నిధులు తగ్గించడాన్ని తప్పుబట్టారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, వైద్య రంగాలకు అరకొర నిధులు కేటాయించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నేత డీజీ నర్సింహారావు, రైతు సంఘం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరాంనాయక్, వృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ రమణ, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణజ్యోతి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ. వెంకటేశ్, ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

## రామంతాపూర్‌లో మహిళల భద్రతపై ఆందోళన

- బ్రిడ్జ్ వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



**హైదరాబాద్, మార్చి 21 (జనం సాక్షి) :** రామంతాపూర్ బాగాయత్‌లోని వెంకట సాయి నగర్ కాలనీలో కొత్తగా నిర్మించిన బ్రిడ్జ్ (బాక్స్ కల్వర్ట్) వద్ద రాత్రివేళల్లో తీవ్రమైన చీకటి నెలకొనడం వల్ల మహిళలు, పిల్లలు, వృద్ధులకు భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ. విజయేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.కాలనీ ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం, బ్రిడ్జ్ పరిసర ప్రాంతంలో రాత్రి సమయంలో అనుమానాస్పద వ్యక్తులు గుమిగూడి మద్యం సేవించడం, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో కాలనీ ప్రజల్లో భయాందోళనలు పెరిగి, ముఖ్యంగా మహిళలు బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు బ్రిడ్జ్ వద్ద వెంటనే హైమాస్ట్ ఎల్‌ఈడి లైట్లు, లైట్ పోల్స్ ఏర్పాటు చేయాలని కాలనీ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. తగిన వెలుతురు ఉంటే అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడటంతో పాటు ప్రజల భద్రత కూడా మెరుగుపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పందిస్తూ, సమస్యను ప్రాధాన్యంగా తీసుకుని త్వరలోనే హైమాస్ట్ లైట్లు మంజూరు చేసి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎండీ జాంగిర్‌తో పాటు కాలనీ సభ్యులు ఆర్. గోవింద్, సిహెచ్. శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ, శివ, నరసింహ, చలపతిరావు, అశోక్, విద్యాసాగర్, రమేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య




**సికింద్రాబాద్, మార్చి 21 (జనంసాక్షి) :** రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య మండిపడ్డారు. విద్యారంగానికి 20% నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద బడ్జెట్ ప్రతులను చించివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ...అసెంబ్లీ సాక్షిగా ఆర్థికశాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రస్తావన, యూత్ డిక్లరేషన్ గురించి మాట్లాడక పోవడం బాధాకరం అన్నారు. బడ్జెట్లో విద్యారంగానికి రూ, 26,674 కోట్లు మాత్రమే కేటాయించారని అది మొత్తం బడ్జెట్లో కేవలం 8.22% మాత్రమే అవుతుందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలకు రూ,26,674 ఏ మాత్రం సరిపోదన్నారు. కోఠారి కమిషన్ విద్యారంగానికి 30% నిధులు కేటాయింపులు చేయాలని సూచించినప్పటికి, విద్యా కమిషన్ 18% నిధులు కేటాయించాలని చెప్పినప్పటికి ఏ మాత్రం పట్టించుకోకుండా 8.22% నిధులనే కేటాయించడం చూస్తుంటే రేవంత్ రెడ్డి సర్కార్ కు విద్యారంగం మీద ఉన్న చిత్తశుద్ధి స్పష్టం అవుతుందన్నారు.పేద మధ్య తరగతి విద్యార్థులు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ల కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తూ ఉంటే బడ్జెట్లో కనీసం ఊసెత్తకపోవడం సిగ్గుచేటన్నారు. యూత్ డిక్లరేషన్ కింద యువతకు వడ్డీలేని రూ. 10 లక్షలు రుణాలు, యువతులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ప్రస్తావన లేదన్నారు.విద్యా భరోసా పత్తా లేకుండా పోయిందన్నారు. గురుకుల విద్యాలయాల గురించి ఏమి పట్టనట్టు రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. విద్యార్థి, యువత, నిరుద్యోగ ఆశలపై రాష్ట్ర బడ్జెట్ నీళ్లు చల్లిందన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాటం శివ. నాగారం ప్రశాంత్. బొల్లు నాగరాజ్. రమేష్ గౌడ్. శీను నాయక్. రామకృష్ణ . శ్రీకాంత్ ముదిరాజ్. అవినాష్. పవన్. కొండ గణేష్. రాకేష్. వినోద్ కార్తీక్. తదితరులు పాల్గొనారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**శామీర్‌పేట్, మార్చి 21 (జనం సాక్షి) :** మల్కాజ్ గిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్,శామీర్‌పేట్ 300 డివిజన్ హకీంపేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ విచ్చేసి జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్ యాదవ్,వజ్జల శేశాంత్ లతో కలిసి లబ్ధిదారులు వజ్జల కళావతి--యాదగిరి దంపతులు సుమారు 5 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు గృహ వసతి కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.పేదల జీవితాల్లో ఇలాంటి సంక్షేమ పథకాలు వెలుగులు నింపుతాయని,ప్రభుత్వం అందించే సాయం సరైన విధంగా వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అలియా బాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మాజీ సర్పంచ్ ఎద్దు నాగేశ్ యాదవ్,అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ మొగుళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుంకి బిక్షపతి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పారనంది బాల్ రాజు,మహమ్మద్ జాఫర్,మన్నె బిక్షపతి,మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి శశిధర్ రెడ్డి,నాయకులు పాండు,నక్క మల్లేష్ గౌడ్,కుడుముల వేంకటేశ్,కీసరి బాను చందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై దృష్టి సారించాలి

- టీఎస్‌యుటీఎఫ్ డిమాండ్..




**ముషీరాబాద్, మార్చి 21 (జననం సాక్షి) :** కొద్ది మంది ధనవంతుల కోసం విదేశీ విద్యాలయాలను ఆహ్వానించడం కాకుండా రాష్ట్ర ప్రజలందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు చావ రవి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ఆఫీసు బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి మాట్లాడుతూ రాష్ట్రంలో యుకె పాఠశాలల ఏర్పాటు కోసం ఆయా యాజమాన్యాలతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్చలు జరిపి ఆహ్వానించడం పట్ల విస్మయం వ్యక్తం చేశారు. ఎవరి ప్రయోజనాల కోసం ఈ పాఠశాలలను ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యతను విస్మరించి, కొందరికే నాణ్యమైన విద్యను పరిమితం చేయాలనే ఆలోచన సరికాదన్నారు. గత ప్రభుత్వం కొన్ని వందల గురుకులాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలను గాలికొదిలేసిందనీ అన్నారు. ఈ ప్రభుత్వం కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అనే ఆకర్షణీయమైన పేర్లతో ప్రభుత్వ రంగంలో నాణ్యమైన విద్యను కొందరికే పరిమితం చేస్తోందన్నారు. బడ్జెట్ కేటాయింపులు అదే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలంటే ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కెజి తరగతులు ప్రారంభించాలని, పర్యవేక్షణ అధికారుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, జిఒ 25 ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, 50 మంది విద్యార్థులు మించిన పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మాట్లాడుతూ పిఆర్సీ రిపోర్టు విడుదల చేసి 1.07.2023 నుండి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎ లు, పెండింగ్ బిల్లుల మంజూరు, వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి జెఎసి ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని లేని పక్షంలో టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్వతంత్ర పోరాటం చేస్తామని ప్రకటించారు. మార్చి 29 న జోగులాంబ జిల్లా గద్వాల జిల్లా ఆలంపూర్ లో జరిగే టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశంలో కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, రాజశేఖర్ రెడ్డి, కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శులు సత్యానంద్, రాజు, రంజిత్ కుమార్, రవిప్రసాద్ గౌడ్, మల్లారెడ్డి, రవి కుమార్, శ్రీధర్, సింహాచలం, జ్ఞానమంజరి, వెంకటప్ప, వెంకటేశం, సోమయ్య, విశాలి, యాకయ్య, కొండలరావు పాల్గొన్నారు.

## పవిత్ర ఆరాధనలకు, క్రమశిక్షణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, మార్చి 21 (జనంసాక్షి) :** రంజాన్ పండగ సందర్భంగా తాండూరు పట్టణంలోని ఖాంజపూర్ గుట్ట సమీపంలో గల ఆఇలేహదిస్ ఈద్గాలో రంజాన్ వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డితో మరియు ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ళ నర్సింలు, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, సీనియర్ నాయకులు అబ్దుల్ రాహుఫ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, కర్ణం పురుషోత్తం రావు, ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్ లు బంటు వేణు, శ్రీకాంత్, రాము, మల్లేశం, రాజు గౌడ్, నాయకులు బంటు మల్లప్ప, అనిల్, అంకిత్, బిర్కట్ రఘు తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఏర్పుమళ్ళ గ్రామ అభివృద్ధే ప్రధాన ధ్యేయం



**బొంరాస్ పేట, మార్చి 21 (జనం సాక్షి) :** ఏర్పుమళ్ళ గ్రామాన్ని అభివృద్ధి చేయడమే ధ్యేయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,మాజీ సర్పంచ్ అంజిల్ రెడ్డి అన్నారు.శనివారం గ్రామ సర్పంచ్ బందెయ్యతో కలిసి 5వ వార్డులో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షల సిసి రోడ్డు,కాడ నిధులతో మంజూరైన రూ.10 లక్షల విలువ చేసే అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి సహకారంతో గ్రామాన్ని రానున్న రోజుల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతయ్య,వార్డు సభ్యులు వెంకటయ్య ,గ్రామస్తులు పాల్గొన్నారు.

## శామీర్‌పేట్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు



**శామీర్‌పేట్, మార్చి 21 (జనం సాక్షి) :** నెల రోజుల ఉపవాసాల అనంతరం శనివారం శామీర్ పేట్ ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా శామీర్ పేట్ నాయకులు ఈద్గా చేరుకొని వారికి అలయ్ బలయ్ తో శుభాకాంక్షలు తెలిపారు. ఈ రకంగా అందరూ సోదర భావంతో ఐక్యత చాటుకోవడం పట్ల అందరు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ ఉద్యమ కారులు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ.. పండుగను హిందు సోదరులతో కలిసి సోదర భావంతో జరుపుతున్నట్లు తెలిపారు . పోలీసులు ఉదయం నుంచే పటిష్ఠంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాలో ముఖ్యంగా నాయకులు మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ ఎంపిటిసి విలాసాగరం సుదర్శన్, డపు సాయిబాబా, ఐలయ్య యాదవ్,ముస్లిం మైనార్టీ నాయకులు సీనియర్ ఉద్యమ కారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్,హజ్ కమిటీ మెంబర్ మహ్మద్ ముజీబుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి మతీన్,చాంద్ పాషా, నజామ్ ,మహ్మద్ ఇర్ఫాన్, మహ్మద్ నిసార్ అహ్మద్ ఖాన్, ఇస్మాయిల్ ఖాన్,మహ్మద్ యూసుఫ్, మహ్మద్ ఫారూఖ్, మహ్మద్ నాసర్ అలీ, ఇలియాస్, అజ్మత్,సమీయోద్దీన్,షఫీయోద్దీన్, మహ్మద్ అరాఫత్,ఇమ్తియాజ్ అహ్మద్,మహబ్బుబ్ జానీ, నసీర్ ఖాన్, షోయబ్, అక్రమ్, అక్బర్ ఆజం,వంగ నర్సింహా రెడ్డి, దూడల నరేష్,పసుపుల నర్సింహా, మల్లేష్, సునీల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మున్సిపాలిటీలో ఘనంగా రంజాన్ వేడుకలు



**చేవెళ్ల, మార్చి 21 (జనంసాక్షి) :** అల్లాహ్ దయతో ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం నిండాలి అదే రంజాన్ ఆశయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ ఈద్గాల వద్ద ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకలలో చేవెళ్ల కాలే యాదయ్య, మున్సిపల్ చైర్మన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారీ ఆగి రెడ్డి పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ.. రంజాన్ మాసం శాంతి, సహనం, త్యాగం, సేవాభావానికి ప్రతీక అని అన్నారు. రంజాన్ పవిత్రమైన నెలలో ఉపవాస దీక్షలు, ప్రార్థనలు మనసును పవిత్రం చేసుకోవడానికి, సత్యనిష్ఠతో జీవించడానికి మనకు మార్గం చూపిస్తాయన్నారు. పేదలకు జకాత్ రూపంలో సహాయం చేయడం ద్వారా సమాజంలో సమానత్వం పెరుగుతుందన్నారు. ఇది మనకు మానవత్వం, పరస్పర గౌరవం, ప్రేమాభిమానాల విలువను తెలియజేస్తుందన్నారు. మన సమాజంలో మత సామరస్యం మరింత బలపడాలని, అందరం కలిసి సుఖశాంతులతో జీవించాలని కోరుకుంటున్నామన్నారు. రంజాన్ పర్వదినం జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని, మీరు చేసే ప్రతి ప్రార్థనకు అల్లాహ్ ఆశీస్సులు లభించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పల్ చైర్ పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాము గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు బండారి ఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, టేకులపల్లి శ్రీనివాస్, మద్దెల చింటు, చేవెళ్ల జామా మాజీద్ కమిటీ సభ్యులు ఆక్బర్, హాజీ, జాంగిర్, బాసిత్, ఆమ్మద్, రహ్మాన్, ఖాజా, మషియోద్దిన్, లియాకత్, పైమీద్, యూసుబ్, ఖాజాపాషా, షఫీ, నాయకులు, మైనార్జీ మత పెద్దలు తదితరులు ఉన్నారు.

# చేవెళ్లే డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- రాష్ట్ర బడ్జెట్లో సవరణలు చేయాలి
- దళితుల అభివృద్ధి సంక్షేమానికి నిధులు పెంచాలి
- కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన



**సంగారెడ్డి టౌన్, మార్చి 21 (జనం సాక్షి) :** 2026–27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం 3.24.254కోట్ల రూ.లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో దళితులకు భారీ కోత పెట్టారని 40వేల కోట్ల రూ.ల నుండి 11.784 కోట్ల రూ. లకు తగ్గించి దళితులను మోసగించారని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన చేవెళ్ల ఎస్సి ఎస్టీ డిక్లరేషన్ ఊసెత్త లేదని బడ్జెట్లో దళితులను మోసగించిన తీరుపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి లోని న్యూ బస్టాండ్ ముందు రోడ్డుపై నిరసన చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దళితులకు అన్యాయం జరిగిందని అన్నారు. బడ్జెట్లో దళిత సంక్షేమానికి ప్రభుత్వ కేటాయింపులకు విడుదలకు ఖర్చుకు మధ్యన ఏమాత్రం పొంతన ఉండటం లేదని విమర్శించారు గత బడ్జెట్ లో 40 వేల కోట్ల రూపాయలు కాగితాల్లో కేటాయించి 19 వేల కోట్ల రూపాయలు విడుదల చేసి అందులో 14 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేసినట్లు చూపించారని చెప్పారు. 2026–27 సంవత్సరానికి ఆర్థిక సంవత్సరానికి 11784కోట్ల రూ. లు కేటాయించారని చెప్పారు. ఎస్సి,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ఎక్స్ గ్రేషియోలు వేలాది మంది కి బాధితులకు బడ్జెట్ లేమి తో అందలేదన్నారు కులాంతర వివాహితుల ప్రోత్సాహకాలు పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు.మొత్తం ఎస్సీ సంక్షేమం పైన ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. బడ్జెట్లో ప్రతి ఏట అంకెలు మాత్రమే ఉంటున్నాయని అవి ఖర్చుకు నోచుకోకపోవడంతో దళితుల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం దక్కట్లేదన్నారు విద్యార్థులు తీవ్ర స్వస్థత గురికావడం ఆత్మహత్యలు జరగడం పరిపాటిగా మారిందన్నారు హాస్టల్ అద్దే భవనాల కిరాయిలు చెల్లించకపోవడం, బెస్ట్ అవైలబుల్ స్కూల్ పిల్లలకు బడ్జెట్ ఇవ్వకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులను నానా రకాలుగా ఇబ్బందులు పెట్టిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు.రాజీవ్ యువ వికాసం పథకం క్రింద 16 లక్షల మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం 6000 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందన్నారు అవి ఏమాత్రం సరిపోవు అన్నారు ఎస్సీ జనాభా 18% ఉండగా ప్రభుత్వ కేటాయింపులు అందుకు అనుగుణంగా లేవన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో సవరణలు తీసుకువచ్చి దళితుల అభివృద్ధి సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులు చేయాలని బడ్జెట్ ను ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పూర్తిస్థాయిలో కేటాయించిన బడ్జెట్ను ఖర్చు చేయాలని చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేసి అంబేద్కర్ అభయ హస్తం ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు మద్దూరి శివకుమార్ నాయకులు దత్తు, సాయిలు, బాలరాజు, శ్యాం,డి వై ఎఫ్ ఐ జిల్లా నాయకులు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రార్థనలతో నిండిపోయిన ఈద్గాలు, మసీద్‌లు



**చేర్యాల, మార్చి 21 (జనంసాక్షి) :** రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. పెద్దఎత్తున ప్రత్యేకప్రార్థనలు చేయడంతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఈద్గా, మసీదుల వద్ద ముస్లింలు ఉదయం నుంచే సామూహిక, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఉత్సాహంగా రంజాన్ వేడకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు. తదితర ప్రాంతాల్లోని మజీద్‌లు కిటకిటలాడాయి. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పి సంతోషాన్ని పంచుకున్నారు. నెల రోజుల ఉపవాస దీక్షకు ముగింపుపలికి ముస్లిం సాంప్రదాయ పద్ధతిలో వంటకాలను చేసుకొని ఆత్మీయులు, మిత్రులతో విందు ఆరగించారు. రంజాన్ పర్వదినాన్ని పుర స్కరించుకొని ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్మ చెరువులో మొసలి ప్రత్యక్షం



**వీపనగండ్ల, మార్చి 22 (జనం సాక్షి) :** వీపనగుండ్ల మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో ఉన్న అమ్మ చెరువులో మొసలి కనిపించడంతో గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి దగ్గరలో ఉన్న అమ్మ చెరువులో శనివారం మొసలి కనిపించినట్లు తెలిపారు.అమ్మ చెరువు చుట్టుప్రకల పొలాలు ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## క్యూరింగ్ లేక ఎండిపోయిన సీసీ రోడ్డు

- అధికారుల పర్యవేక్షణ కరువు...

**మల్దకల్, మార్చి 21 (జనంసాక్షి) :** మండల పరిధిలోని అమరవాయి గ్రామంలో ఎస్సీ కాలనీలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధుల ద్వారా సిసి రోడ్డు పనులు చేపట్టారు. 15 లక్షల రూపాయలతో చేపట్టిన రెండు సిసి రోడ్ పనులు చేపట్టి వారం రోజులు అవుతున్న వాటిపై నీళ్లు లేకపోవడంతో సిసి రోడ్డు క్యూరింగ్ కావడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం క్యూరింగ్ కోసం నీళ్లు చల్లాల్సి ఉండగా గుత్తేదారుడుఅడ్రస్ లేకుండా పోయారు.సిసి రోడ్డుకు పక్కన 10ఇంచులు పైగా గుంతలు ఉండడంతో ద్విచక్ర వాహన రహదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎప్పటికప్పుడు గుత్తేదారుడు పనులు పరిశీలించాల్సిండగా ఇంతవరకు కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.రోడ్డుకి ఇరువైపులా మట్టి వేయాల్సి ఉండగా ఇంతవరకు వేయకపోవడంతో,సీసీ రోడ్డుపై మట్టితో మల్లు కట్టి నీళ్ళు పోయాల్సి ఉండగా ఇంతవరకు అతిగతి లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా పర్యవేక్షణ లేకపోవడంతో సిసి రోడ్డు నాణ్యత కూడా లేదని కేవలం డ్రాస్టు,సిమెంటుతో కలిపి సీసీ రోడ్డు వేయగా ఎలాంటి ఇసుక లేకుండా సిసి రోడ్ నిర్మాణాలు చేపట్టడంతో గ్రామాలలో కొన్ని కాలలపాటు



ఉండాల్సిన రోడ్లు కేవలం సంవత్సరం కల్లా దెబ్బతిని పోతున్నాయని ఆ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రతిరోజు ఉదయం,సాయంత్రం క్యూరింగ్ చేయాల్సిండగా ఒక పూట మాత్రమే నీళ్లు పోసి చేతులు దులుపుకుంటున్నారుని పలువురు విమర్శిస్తున్నారు. ఆదివారం సిసి రోడ్డుపై అలసంద పొట్టు తీసుకొని వచ్చి సీసీ రోడ్డుపై పోయడంతో,వరిగడ్డి,గోన సంచులు వేసి క్యూరింగ్ చేయాల్సి ఉన్నప్పటికీ గుత్తేదారుడు అవేమి పట్టించుకోకుండా నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారనిఆ కాలినివాసులు వాపోయారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే గ్రామాలలో సిసి రోడ్డు పనులపై అధికారులు పర్యవేక్షణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల ఆగ్రహం

- పాఠశాల ముందు ఆందోళన



**అమీన్పూర్, మార్చి 21 (జనం సాక్షి) :** అడ్డగోలుగా ఫీజులు పెంచుతున్న ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బీరంగూడ వాడు పరిధిలో ఉన్న రెయిన్బో ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం అడ్డగోలుగా ఫీజులు పెంచారని తల్లిదండ్రులు పాఠశాల గేటు ముందు ఆందోళనకు దిగారు. ప్రతి ఏటా వారి ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20% ఫీజులు పెంచాలని తెలిపారు. ఫీజులతోపాటు యూనిఫామ్, బుక్స్, డైరీలకు అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. బయట మార్కెట్లో రూ.100 ఉన్న డైరీ ఏకంగా రూ. 400 కు విక్రయిస్తున్నారని తెలిపారు. పెంచిన ఫీజులను తగ్గించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించారు.

## కొరివి బాలకృష్ణ ముదిరాజ్‌కు ప్రతిభ పురస్కారం



**మహేశ్వరం, మార్చి 21 (జనంసాక్షి) :** తెలంగాణ గురుకుల టీచర్స్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ కొరివి బాలకృష్ణ ముదిరాజ్ సమాజానికి విశిష్ట సేవలందించినందుకు శనివారం హైదరాబాద్ లోని తెలుగు యూనివర్సిటీలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ ఉమేష్ కుమార్ చేతుల మీదుగా కొరివి బాలకృష్ణ ముదిరాజ్ ప్రతిభ పురస్కారం అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు ప్రొఫెసర్ నీల రాములు, రోటం భూపతి, శ్రీనివాస్,హనుమంతు, అనిల్ కుమార్, శ్రీతెలంగాణ జన సమితి జనరల్ సెక్రెటరీ నిజ్జన రమేష్,పీడీఎస్ యూ అధ్యక్షుడు శీలం నాగేశ్వరరావు, ఆంజనేయులు,బొక్క శ్రీను,జూలు నాగేశ్వర,చెన్నయ్య, వినోద్, పెబ్బెట్టి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి బ్యూరో, మార్చి 21 (జనం సాక్షి) :** 3 లక్షల కోట్ల అప్పుచేసి, మూడు అంటే మూడు పథకాలు పూర్తిచేయలేని, దుస్థితి రేవంత్ రెడ్డి ప్రభుత్వందని మాజీ మంత్రి సింగిరెడ్డీ నిరంజన్ రెడ్డి విమర్శించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి,తన స్వగృహంలో పత్రికా సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని,రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నెట్టే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఎద్దేవా చేశారు.ఆరు గ్యారంటీలు 11డిక్లరేషన్లు అన్ని మోసమేనని,భారతదేశ చరిత్రలో ప్రజలను ఇంత దగాపురితంగా మోసం చేసే బడ్జెట్ నేను చూడలేదని దుయ్యబట్టారు.ఎన్నికల డిక్లరేషన్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క వాగ్దానం నిలుపుకోకుండా మహిళలను, వృద్ధులను, దివ్యాంగులను, విద్యార్థినులను, రైతులను, కార్మికులను, ఉపాధి కూలీలను, హరిజన, గిరిజన, బడుగు బలహీన, మైనార్టీ వర్గాలను మోసం చేసి, చరిత్రలోకి ఎక్కిందని, నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశములో జిల్లా అధ్యక్షులు గట్టు



యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్,గంధం.పరంజ్యోతి,గోపాల్ పేట మండల అధ్యక్షులు బాలరాజు, పెబ్బేరు మండలం అధ్యక్షులు వనం.రాములు, కర్రెస్వామి, నాయకులు ధర్మా నాయక్,దేవర్ల.నరసింహ, నాగన్న యాదవ్,నారాయణ నాయక్, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి,చిట్యాల.రాము,వడ్డే. రమేష్ మంద.రాము,శంకర్ తదితరులు ఉన్నారు.

## రైతుల ఆపద్బాంధవుడు మంత్రి జూపల్లి కృష్ణారావు



**వీపనగండ్ల, మార్చి 22 (జనం సాక్షి) :** కేతేపల్లి – కల్వరాల గ్రామాల మధ్యన ఉన్న కే ఎల్ ఐకాలువలో విపరీతమైనజమ్ము ఉండటం వలన కల్వరాల గ్రామ రైతులకు సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి.కెఎల్ ఐ కాలువలో జమ్మూ తొలగించాలని గ్రామ రైతులుజిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహను రైతులు కోరారు. రైతులు అడిగిన వెంటనే పర్యాటక అధికారి నరసింహ మంత్రి జూపల్లి కృష్ణారావుతో గ్రామ రైతులు పడుతున్న ఇబ్బంద్దులను వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై వెంటనే స్పందించిన మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్ గురించి మాట్లాడి జమ్మును తొలగించి రైతులకు సాగునీరు అందించాలని వెంటనే మిషన్ ఏర్పాటు చేసి కాలువలో ఉన్న జమ్మును తొలగించాలని చెప్పడంతో స్పందించిన అధికారులు శనివారం కాలువలో పెరిగిన జమ్మును తొలగించారు. కల్వరాల గ్రామ రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని మిషన్ ను ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచినా మంత్రి జూపల్లి కృష్ణారావు రావుకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని గ్రామ రైతులు అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మధుగని నరసింహ, రంగాపురం తిరుపతయ్య,చింతల దయాకర్,పోచమోని ఆంజనేయులు,సత్తూరు భాస్కర్ గౌడ్, మల్లేష్,స్వాములు,బత్తుల హుస్సేన్,తంగేడి నాగేంద్రం,చెనమోని బోజ్జన్న,తదితరులు మంత్రి జూపల్లి కృష్ణారావు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## ముస్లిం సోదరులకు పండగ కిట్ల పంపిణీ

- రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి
- నియోజకవర్గ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు
- బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్

**తాండూరు, మార్చి 21 (జనంసాక్షి) :** నియోజకవర్గ ముస్లిం సోదరులు రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డా.సంపత్ కుమార్ పేర్కొన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని 27వ వార్డుకు చెందిన ముస్లిం సోదరులకు డాక్టర్ సంపత్ కుమార్ బొప్పి కృష్ణ ఆధ్వర్యంలో పండగ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండగ ఎంతో పవిత్రమైందని అన్నారు. పండగను పేద, ధనికులందరు సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. వార్డు ప్రజలకు పండగ కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమని డాక్టర్ సంపత్ కుమార్ బొప్పి కృష్ణను అభినందించారు. అనంతరం



నియోజకవర్గ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## చెరువుల పునరుద్ధరణతోనే పర్యావరణ పరిరక్షణ

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ



**జడ్చర్ల, మార్చి 21 (జనంసాక్షి) :** చెరువుల పునరుద్ధరణతోనే పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణ జరుగుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. మున్సిపాలిటీ 7వ వార్డు పోచమ్మ గుడి సమీపంలోని (ఊర) చెరువు పునరుద్ధరణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, జడ్చర్ల శాసన సభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి హాజరై భూమి పూజ నిర్వహించారు. రూ 1.11 కోట్లతో చేపట్టనున్న చెరువు అభివృద్ధి, ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా చెరువుల పునరుద్ధరణ ద్వారా నీటి వనరులను కాపాడుకోవడమే కాకుండా, భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాల కోసమే ప్రతి రూపాయిని సద్వినియోగం చేస్తామని, ఈ అభివృద్ధి పనుల ద్వారా పర్యావరణ సమతౌల్యం సాధ్య మవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ఉర చెరువు అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలని, భూగర్భ జలమట్టాన్ని పెంచడానికి, చెరువులను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## రాజకీయ ఎజెండాతో కాకుండా "ప్రజల ఎజెండాతోనే" ముందుకు వెళ్తాం

- ఏప్రిల్ 15 వరకు గ్రామ గ్రామాన జెండాలు ఎగురవేస్తాం
- చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ చైర్మన్ డా.పరమేశ్వర్

**చేర్యాల, మార్చి 21 (జనంసాక్షి) :** రాజకీయ ఎజెండాతో కాకుండా ప్రజల ఎజెండాతోనే రెవెన్యూ డివిజన్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ అన్నారు. శనివారం చేర్యాల మండల కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య గౌడ్ అధ్యక్షతన వహించగా ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష చిరకాల కోరికను నెరవేర్చడం కోసం రాజకీయ పార్టీలు



జెండాలు ఎజెండాలు పక్కనపెట్టి ప్రజల ఏజెండాతో ముందుకు వెళ్తామని అన్నారు. ఈనెల 25న మండల కమిటీల సమావేశాలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 1 నుండి 15 వరకు గ్రామస్థాయిలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి 15వ తేదీన గ్రామ గ్రామాన రెవెన్యూ డివిజన్ జేఏసీ జెండాలు ఎగరవేస్తామని అన్నారు. నూతనంగా గెలిచిన సర్పంచులు రెవెన్యూ డివిజన్ సాధన కోసం తీర్మానాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందే అశోక్, అందే బీరయ్య, బస్వగల్ల సిద్దయ్య, బుట్టి సత్యనారాయణ,కర్క తిరుపతిరెడ్డి, గుర్జకుంట సర్పంచ్ కాశెట్టి పాండు, బొమ్మగోని అంజయ్య, మాదాసు బాలకృష్ణ, ఈరి భూమయ్య, పిల్లి చంద్రం, జంగిలి యాదగిరి, తాడెం వెంకటస్వామి, పోలోజు వెంకటాద్రి, కుడిక్యాల బాల్ మోహన్, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, పాకాల ఇసాక్, సుందరగిరి భాస్కర్, శ్రీరామ్ మల్లేశం, బస్వగల్ల రమేష్, గూడెపు సుదర్శన్, గుండె ఉదయ్, టోనీ బక్కల్, ఎగుర్ల ఎల్లయ్య, బింగి పోశయ్య, గోమారపు నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కన్నప్రేమకు కరువై..

- పత్తి చేనులో పసికందు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మార్చ్ 21(జనంసాక్షి):** అభం శుభం తెలియని పసిపాపను ఓ తల్లి పత్తి చేనులో పారిసింది. ఆకలితో అలమటించిన ఆ పాప కేకలు విన్న ఓ మహిళా చూసి ఆ పాపను రక్షించింది. ఈ అవమానీయ ఘటన కాగజ్ నగర్ మండల పరిధిలో చోటు చేసుకుంది. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం వల్లగొండ గ్రామపంచాయతీ సీతానగర్ శివారులో పత్తి చేనులో పసికందును గుడ్డలో కట్టి పడేసిన ఘటన శనివారం కలకలం రేపింది. స్థానికులు ఉదయం పత్తి చేను వైపు వెళ్లగా శిశువు అరుపు వినిపించింది, అటు చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడకి చేరుకొని చేనులో సంచిలో చుట్టి పడేసి ఉన్న ఆడ శిశువును సురక్షితంగా బయటకు తీసి కాగజ్ నగర్ లోని ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించి ట్రీట్మెంట్ అందించారు . విషయాన్ని బాల సంరక్షణ అధికారి మహేశ్ కి తెలపడంతో సిబ్బందితో ఆయన చేరుకొని ఒక రోజు వయసున్న శిశువును బాల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ చేపట్టారు. కన్నపేగు బంధాన్ని తెంచుకుని కసాయిగా మారిన తల్లి ఆమె కుటుంబీకులను కర్కశత్వాన్ని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

## ఫ్లెక్సీలను దొంగిలించి దహనం చేసిన వారిపై ఫిర్యాదు



**వరంగల్ ఈస్ట్, మార్చి 21 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం ఇసుక అడ్డ జంక్షన్ వద్ద ఉగాది శ్రీరామనవమికి సంబంధించినటువంటి శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీలను శుక్రవారం అర్ధరాత్రి దొంగిలించి దహనం చేసిన సంఘటనపై రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు కాంగ్రెస్ నాయకులు , వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మెన్ శామంతుల శ్రీనివాస్, 34డివిజన్ అధ్యక్షులు చిట్టీమల్ల శ్రీనివాసరావు సంయుక్తంగా ఫిర్యాదు చేసారు. వివరలలోకి వెళ్తే ఉగాది సందర్భంగా, మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషాశ్రీనివాస్ ఆధ్వర్యంలో అండర్ బ్రిడ్జి దగ్గర, ఇసుక అడ్డా ఎస్ బి ఐ దగ్గర,సి యం.ఫోటో, మంత్రి కొండా సురేఖ మురళీధర్ లతో కూడిన పెద్ద ఫ్లెక్సీ లు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మంత్రి నగర పర్యటనకు వస్తున్న సందర్భంగా అర్ధరాత్రి ఫ్లెక్సీ లు ఎత్తుకుపోయి తగల బెట్టిన దుశ్చర్య పై ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మిల్స్ కాలనీ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై వెంటనే స్పందించిన మంత్రి సురేఖ స్థానిక మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ రమేష్ కీ వెంటనే చర్యలు తీసుకోవాలని నిందితులను వదిలిపెట్టొద్దని, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఫ్లెక్సీల దొంగతనం పై సీసీ ఫుటేజ్ వచ్చినట్లు సమాచారం. ఇందులో అర్ధరాత్రి పూట ఆటోలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలు ఎత్తుకెళ్లినట్లు తెలుస్తుంది.

## ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

- పర్యావరణ సంరక్షణపై కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపు




**హనుమకొండ ప్రతినిధి, మార్చి 21 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం అటవీ శాఖ, హనుమకొండ జిల్లా, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని కాకతీయ జూలాజికల్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం భాగంగా జిల్లా అటవీ శాఖాధికారి బి. లావణ్య, ఫారెస్ట్ కాంప్లెక్స్, సుబేదారి నుంచి కాకతీయ జూలాజికల్ పార్క్ వరకు నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పర్యావరణ పరిరక్షణపై ప్రాధాన్యతను వివరించారు. అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దాని కోసం అడవులకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. మట్టి పాత్రల్లో నీరు, ఆహారం ఉంచడం ద్వారా పక్షులు, జీవజాలానికి సహాయపడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ క్యూరేటర్ బి. మయూరి, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సభ్యులు ఇందారం నాగేశ్వర్ రావు, చెలుపూరి శ్యామ్ సుందర్, పిట్టల రవి బాబు, కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ తిప్పని రాధిక, జిల్లా అటవీ శాఖ సిబ్బంది, జూ పార్క్ సెక్షన్ ఆఫీసర్లు సురిదాస్, శివ కుమార్, బీట్ ఆఫీసర్లు శారద, శ్వేత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తరాఖండ్ ఏఐ ఛాంపియన్స్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న కలెక్టర్




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని మసూరీలో ఉన్న లాల్ బహాదూర్ శాస్త్రి జాతీయ పరిపాలన అకాడమీ లో నిర్వహించిన ప్రతిష్టాత్మక ఏఐ ఛాంపియన్స్ ప్రోగ్రామ్ శిక్షణా కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. మార్చి 16 నుండి 20 వరకు నిర్వహించిన డిజిటల్ రూపాంతరణ కోసం ఏఐ ఛాంపియన్స్ ప్రోగ్రామ్ లో ఆయన పాల్గొని శిక్షణను పూర్తిచేశారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పరిపాలనలో ఆధునిక సాంకేతికతల వినియోగం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు ఉపయోగపడుతుంది. ఈ శిక్షణ ద్వారా డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానం లభించనున్నాయి. భవిష్యత్తులో జిల్లాలో పరిపాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడనుంది. లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నాలుగు రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన కృత్రిమ మేధస్సు (ఏఐ) శిక్షణ కార్యక్రమానికి భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరు కావడం విశేషం. తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన జిల్లా కలెక్టర్లలలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కూడా సెలెక్ట్ కావడం అభినందనీయం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, ప్రజలకు త్వరితగతిన, నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ ఏఐ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఈ ప్రతిష్ఠాత్మక శిక్షణ కార్యక్రమానికి తనను ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆధునిక సాంకేతికతలను వినియోగించి ప్రజా సేవలను మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- కిలా వరంగల్ ఈద్గా వద్ద ప్రార్థనలు
- పాల్గొన్న మేయర్ గుండు సుధారాణి





**వరంగల్ ఈస్ట్, మార్చి 21 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అభివృద్ధికి నిరంతరం పాటుపడుతుందని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ కిలా వరంగల్ ఈద్గా వద్ద మంత్రి సురేఖ తోపాటు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి శనివారం ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ముస్లిం సోదరులు మహిళలు అందరూ కలిసి ఎంతో పవిత్రంగా రంజాన్ మాసాన్ని నిర్వహించుకుంటారని అన్నారు. ఉపవాసాలతో ఉండి భక్తిశ్రద్ధలతో అందరూ బాగుండాలని కాంక్షతో ఉంటారన్నారు. మైనార్టీల అభివృద్ధిలో భాగంగా వరంగల్ నగరంలోని పలు ఈద్గాలకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయిస్తున్నట్టు తెలిపారు. కిల వరంగల్ ఈద్గాకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. అదేవిధంగా రంజాన్ మాసం సందర్భంగా పలు ఇఫ్తార్ విందులతోపాటు, ఆయా పేద కుటుంబాలకు కానుకలు ఇచ్చేందుకు కూడా సుమారు 6 కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్లు మంత్రి పేర్కొన్నారు. మైనార్టీల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాలని కోరారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య కూడా ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు వరంగల్ లోని జెమిని టాకీస్ వద్ద ఉన్నా ఈద్గా వద్ద కూడా మంత్రి సురేఖ ప్రార్థన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఖిలా వరంగల్ ఈద్గా కమిటీ అధ్యక్షులు ఎంఏ జబ్బార్, కార్యదర్శి చాంద్ పాషా తో పాటు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## కుల, మతాలకతీతంగా ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సమాజంలో ప్రతి ఒక్కరు కుల, మతాలకతీతంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని ఈద్గా వద్ద నిర్వహించిన రంజాన్ వేడుకల్లో, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సి.ఆర్ నగర్ బాంబుల గడ్డ ఈద్గా వద్ద జరిగిన రంజాన్ వేడుకలో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు ఆచరించి, నెలవంక దర్శనం అనంతరం పండుగ జరుపుకోవడం ముస్లిం సోదరుల ఆధ్యాత్మిక నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. పండుగల సమయంలో అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవిస్తూ, ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలని అన్నారు. కుల,మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి లాభపడే శక్తులను ప్రజలు గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా విద్యా రంగంలో మైనార్టీ విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో ఇంకా ఖాళీగా ఉన్న సీట్లను వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ, ప్రతి ఒక్కరు విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్క ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్, చెల్పూర్ సర్పంచ్ కావటి రజిత రవీందర్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్స్, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గోలేటిలో కోల్ ట్రాన్స్పోర్ట్ కార్మికుల సమ్మె విరమణ

**రెబ్బెన, మార్చి 21(జనంసాక్షి):** సింగరేణి బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలో గత 4 రోజుల నుంచి కోల్ ట్రాన్స్ పోర్ట్ కార్మికులు అయిన డ్రైవర్ అండ్ క్లీనర్లు తమ హక్కుల సాధన కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేసిన నిరవధిక సమ్మెను విరమణ చేస్తున్నట్లు ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ ప్రెసిడెంట్ బోగే ఉపేందర్ తెలిపారు. శనివారం రోజున గోలేటిలో ఆయన మాట్లాడుతూ డ్రైవర్లకు 22000లు క్లీనర్లకు 11000- చెల్లించడానికి ఒప్పందం జరిగింది,వీటితో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని ఒప్పందం జరిగింది. అందువల్ల సమ్మెను విరమింప చేస్తున్నట్లు తెలిపారు. ఒప్పందం 01.04.2026 నుంచి 31.03.2028 2 సంవత్సరాలు మాత్రమే వరకు అమల్లో ఉంటుందని అన్నారు. సమ్మెకు సహకరించిన సింగరేణి, టిటిసి. యజన్యానికి,పోలీసు డిపార్ట్మెంట్ కు, మీడియా కు, ధన్యవాదాలు తెలిపారు.


## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండిచేయి

- ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రాలు దహనం




**హనుమకొండ ప్రతినిధి, మార్చి 21 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026,2027 సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఆర్థిక శాఖ బడ్జెట్లో విద్యారంగానికి 8.22% నిధులను మాత్రమే కేటాయించింది అని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ అన్నారు శనివారం రోజున ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ని రాంనగర్ అంబేద్కర్ సెంటర్ వద్ద రహదారిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పత్రాలను దహనం చేశారు ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు చాలా ఉన్నాయి అన్నారు ఈ రాష్ట్రంలో దాదాపు 8 వేల కోట్ల దాకా స్కాలర్షిప్స్ ఫీజు రియంబర్స్ మెంట్ పెండింగ్లో ఉన్నాయి అన్నారు దీనితో పోలిస్తే చాలా సమస్యలు విద్య రంగంలో ఉన్నాయన్నారు గురుకులాల కు సొంత భవనాలు లేవు అలాగే హాస్టల్స్ కు సొంత భవనాలు లేవు రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ యూనివర్సిటీల కు సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు ఇన్ని సమస్యలను పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 2026, 27 సంవత్సరం కలిపి మొత్తం 26,674 కోట్లు కేటాయించింది ఇంత తక్కువ బడ్జెట్ తో రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించలేక పోతుందన్నారు రాష్ట్రంలో విద్య రంగ సమస్యలు పరిష్కారం కావాలంటే విద్య రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని రాష్ట్రంలో విద్యార్థి సంఘాలు మేధావులు విద్యార్థులు గత రెండు సంవత్సరల నుండి చెబుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచింపజేసి విద్య రంగాన్ని చిన్నచూపు చూడకుండా 30% నిధులు కేటాయించి రాష్ట్రంలో విద్య రంగ సమస్యలను పరిష్కరించే విధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు నడవాలి అన్నారు లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఆందోళనలు చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్ జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్ జిల్లా కమిటీ సభ్యులు చెన్నూరీ సాయికుమార్ మల్లేష్ సన్నీ పవన్ సురాజ్ సాయి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రమాద బీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నాయిని



**హనుమకొండ ప్రతినిధి మార్చి 21 (జనంసాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో విషాద ఘటనకు గురైన కుటుంబానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అండగా నిలిచారు. నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ రంగంపేట కి చెందిన జన్ను మల్లయ్య కొద్ది నెలల క్రితం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందడం జరిగిందిఈ నేపథ్యంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు., కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ముందుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుపై రైతుల క్షేత్ర ప్రదర్శన




**నల్లబెల్లి, మార్చ్ 21 (జనంసాక్షి):** ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహనను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో ఆయిల్ ఫాం సాగు క్షేత్ర ప్రదర్శన తోపాటు పామాయిల్ గింజల నుండి ఇంధనాన్ని తీసే కర్మగారాన్ని సైతం సందర్శించే అవకాశాన్ని కల్పించింది. ఈ క్షేత్ర ప్రదర్శనకు మండలం నుండి నల్లబెల్లి, కొండాయల్ పల్లె, శనిగరం, ముచ్చింపుల, నందిగామ, రేలకుంట, మేడపల్లి, రామతీర్థం గ్రామాల నుండి సుమారుగా 250 మంది రైతులు ఈ ప్రదర్శనకు శనివారం బయలుదేరి వెళ్లారు. వీరి వెంట ఏఈఓ మహేందర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇంచార్జ్ సీఈవో ఎల్లన్న ఉన్నారు.

# లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..

- అసంపూర్తిగా ఉన్న పంచాయతీ కార్యాలయ భవనం
- పట్టించుకోని అధికారులు



**భీమిని, మార్చి 21 (జనంసాక్షి) :** భీమినిమండల కేంద్రంలోని భీమిని గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం లక్షలు వెచ్చించి నిర్మించి అర్ధాంతరంగా వదిలేశారు దీనికి కారణం గుత్తేదారు నిర్లక్ష్యమా అధికారుల అలసత్వమా అనేది తెలియని పరిస్థితి 8 సంవత్సరాల క్రితం సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో భీమిని గ్రామపంచాయతీ భవనాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది టెండర్లు పనులను దక్కించుకున్న కాగజ్నగర్ కు చెందిన గుత్తి గారు పనులను మొదలుపెట్టి స్లాబ్ వరకు పనులు పూర్తి చేసి అర్ధాంతరంగా వదిలేసి వెళ్లిపోయాడు సంబంధిత శాఖ అధికారులు దీన్ని అర్ధాంతరంగా ఎందుకు వదిలేశారని విషయంపై గుత్తేదారును అడిగిన సందర్భాలు లేవు. గుత్తేదారు కూడా రాణి కాడికి రాయి అనే చందంగా చేసిన పనికి బిల్లులు లేపుకొని చేతులు దులుపుకొని వెళ్ళిపోయాడు దీంతో భీమినికి గ్రామపంచాయతీ భవనం లేకుండానే కొనసాగుతోంది. అర్ధాంతరంగా పనులను వదిలివేసిన గుత్తేజారిపై చర్యలు తీసుకోకపోవడం లోని అంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి సంబంధిత ఇంజనీర్ కానీ ఆ పై స్థాయి ఉన్న అధికారులు కానీ గుత్తేదారుకు నోటీసులు ఇచ్చి పనులు ఎందుకు నిలిపివేశారు తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ అలాంటిదేమీ జరిగినట్లు దాఖలాలు లేవు ప్రస్తుతం భీమిని పంచాయతీ కార్యాలయాన్ని ఓ చిన్న గదిలో నిర్వహించుకుంటున్నారు గ్రామపంచాయతీ భవనం పక్కనే క్రీడా మైదానాన్ని కూడా మంజూరు చేసిన అధికారులకు అర్ధాంతరంగా ఆగిపోయిన గ్రామపంచాయతీ బిల్డింగ్ మాత్రం కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు తెలియని పరిస్థితి ఇక్కడ నెలకొంది సంబంధిత అధికారులు ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచి బిల్డింగును పూర్తి చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదని ప్రజలు మాట్లాడుకుంటున్నారు లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేసిన సదరు గుర్తిదారిపై చర్యలు తీసుకుని భవనాన్ని పూర్తిస్థాయిలో నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది మరి అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు అర్థం కాని పరిస్థితి ఇప్పటికైనా సంపాదిత శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు

## ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన రామగుండం పోలీస్ కమిషనర్



**గోదావరిఖని, మార్చి 21 (జనంసాక్షి) :** రామగుండం పోలీస్ కమీషనరేట్ గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 ఇంక్లైన్ వద్ద ఉన్న ఈద్గను సందర్శించి బందోబస్త్ ఏర్పాట్లు పరిశీలించి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా. పోలీస్ అధికారులకు పలు సూచనలు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం శాంతి, సహనం, దయ, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో ప్రశాంతమైన శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఉపవాస దీక్షల ద్వారా సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు. రంజాన్ పర్వదినాన్ని శాంతియుతంగా జరుపుకునేలా పోలీస్ శాఖ అన్ని విధాలుగా బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా, పరస్పరం సహకరించి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

## కామారెడ్డి ఈద్గా వద్ద రంజాన్ వేడుకల్లో పాల్గొన్న షబ్బీర్ అలీ



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 21 (జనం సాక్షి) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కామారెడ్డి పట్టణంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రార్థనలు నిర్వహించారు.ప్రార్థనల అనంతరం షబ్బీర్ అలీ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం మరియు సహనానికి నిలువుటద్దమని ఆయన పేర్కొన్నారు.ఆకలి విలువను తెలుసుకుంటూ, పేదలకు సహాయం చేయడమే ఈ పండుగ యొక్క అసలు పరమార్థమని వివరించారు. గంగా-జమునా తెహజీబ్ సంస్కృతితో అందరూ కలిసి మెలిసి పండుగను జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామన్నపేట, మార్చి 21 (జనంసాక్షి) :** విద్యుత్ నూతన లైన్ ఏర్పాటు చేయడం కోసం రామన్నపేట మండలం తుమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో గల తుమ్మలగూడం,నిధానపల్లి, భోగారం వ్యవసాయ విద్యుత్ సప్లై లక్ష్మాపురం సబ్ స్టేషన్ పరిధిలో గల లక్ష్మాపురం, శోభనాద్రిపురం, నీర్నెముల గ్రామాలలో సింగిల్ ఫేజ్ మరియు త్రీ ఫేజ్ వ్యవసాయ విద్యుత్ సప్లై ,రామన్నపేట టౌన్ లోనీ సుభాష్ సెంటర్ నుండి సిరిపురం వెళ్లే రోడ్ వరకు (కుడివైపున అనగా ప్రభుత్వ ఆసుపత్రి గోడవైపు నుండి సిరిపురం రోడ్ వరకు) సింగిల్ ఫేజ్ మరియు త్రీ ఫేజ్ సప్లై ఆదివారము ఉదయం 11 గంటల నుండి 5 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయడం జరుగుతుంది. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని విద్యుత్ శాఖ ఏఈ యం. కోటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన రంజాన్ ప్రార్థనలు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి 21 (జనం సాక్షి) :** కామారెడ్డి పట్టణంలోని ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సామూహిక ప్రార్థనలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తును జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఈద్గా మైదానానికి చేరుకున్న ఎస్పీ, బందోబస్తు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. ముఖ్యంగా భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. పవిత్ర రంజాన్ ప్రార్థనలు అత్యంత క్రమశిక్షణతో, శాంతియుత వాతావరణంలో ముగియడం జరిగింది అని తెలిపారు. అనంతరం, జిల్లా ఎస్పీ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ని కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి, ఎస్ఐలు, ముస్లిం సోదరులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## డ్యూటీ చేస్తూ లస్కర్ ఉద్యోగి మృతి

- **మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతోపాటు 50లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి..**



**చిగురుమామిడి, మార్చి 21 (జనంసాక్షి) :** కెనాల్ వద్ద రాత్రి సమయంలో డ్యూటీ చేస్తూ లస్కర్ అనే ఉద్యోగి మృతి చెందిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూర్ గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చిగురుమామిడి ఎస్సై పృథ్వీధర్ గౌడ్,మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం...చొప్పదండి మండలం చాకుంట గ్రామానికి చెందిన తడిగొప్పుల మల్లయ్య(55) అనే వ్యక్తి చిగురుమామిడి మండలం చిన్నములకనూర్,పీచుపల్లి గ్రామంలోని కెనాల్ కాల్వ మీద తాళ్ల అనిల్ తో కలిసి ఎప్పటిలాగే లాస్కర్ డ్యూటీ చేస్తున్నాడు.డ్యూటీలో భాగంగా ఇద్దరు కలిసి రాత్రి అక్కడే పడుకున్నారు.తెల్లవారుజామున అనిల్ లేచి చూసేసరికి మల్లయ్య కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతకగా గూడ తిరుపతి పొలంలోని మోటర్ నీళ్లు పోసే దగ్గర పడి మృతి చెంది ఉన్నాడని తెలిపారు.మృతుడు మల్లయ్య చిన్న కుమార్తె జంగపల్లి స్రవంతి తన తండ్రి గుండెపోటుతో గాని, ఇతర కారణాలతో గానిమృతి చెంది ఉంటాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు.పేద కుటుంబానికి చెందిన మల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని,ఆయనకు 50లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వడమే కాకుండా,వారి కుటుంబానికి చెందిన ఒకరికి ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులు బుత్వానికి విజ్ఞప్తి చేశారు.అంతేకాకుండా డ్యూటీ చేసే ప్రదేశంలో కనీసం ఉండడానికి రూము కూడా లేదని,రాత్రివేళలో చెట్ల కింద పడుకునే వారని కుటుంబ సభ్యులు రోధిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు.

# క్రమశిక్షణ, ధాతృత్వం, ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ పర్వదినం

- **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్లగొండ ప్రతినిధి, మార్చి 21 (జనం సాక్షి) :** మత కలహాలు లేకుండా సోదరభావంతో, ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలనిరాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.రంజాన్ పండుగను పురస్కరించుకొని శనివారం ఆయన నల్గొండ పట్టణంలోనిమునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులతోకలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర దీక్షలు, ప్రార్థనలు చేశారని ,క్రమశిక్షణ,దాతృత్వం, ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ పర్వదినం అని అన్నారు. అల్లా వారందరి జీవితాలలో వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షించారు.అల్లా ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు.ముస్లిం సోదరులంతా రంజాన్ పండుగను కుటుంబ సభ్యులందరితో కలిసి భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు.నల్గొండ పట్టణంలోగత 30 సంవత్సరాలుగా హిందు, ముస్లింలు ఎలాంటి మత కలహాలు లేకుండా పండుగలు శాంతియుతంగా జరుపుకుంటున్నారని మంత్రి తెలిపారు.ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని, ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లింల సంక్షేమానికి రూ.3,500 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాలలో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి ,ఏ ఎస్ పి రమేష్. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్,తహసిల్దార్ పరుశురాములు, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్, సుభాష్, నవీన్ ,అధికారులు, మైనార్టీ నాయకులు ,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## సమాజంలో సఖ్యత, ఐక్యత మరింత బలపడాలి

- **రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**గోదావరిఖని, మార్చి 21 (జనంసాక్షి) :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం శారద నగర్, రామగుండం,4 ఇంక్లైన్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థన కార్యక్రమంలో లిరామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు మేయర్ మహంకాళి స్వామి డిప్యూటీ మేయర్ పాతిపల్లి ఎల్లయ్య పలు కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారులి ముస్లిం సోదర సోదరీమణులతో కలసి ప్రత్యేక నమాజ్‌లో పాల్గొని, వారి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం మనకు సహనం, దానం, సోదరభావం వంటి గొప్ప విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. గోదావరిఖని షాదీ ఖానా కొరకు 2008 సంవత్సరంలో 18 గుంటల భూమి శాంక్షన్ చేయించి సుమారు రూ.46.00 లక్షలు ఖర్చు చేయడం జరిగింది. మరియు మరో రూ.50 లక్షల రూపాయలు విడుదల చేయించడం జరిగింది. రామగుండం షాదీఖానా కొరకు రూ 2.00 కోట్ల రూపాయలు ముస్లిం యువత కోసం ఎలెక్ట్రికల్ స్కూటర్స్, స్టిచ్చింగ్ మిషన్ లు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నయని తెలిపారు.తెలంగాణలో ఏ మునిసిపాలిటీలో లేని విధంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో 6 కార్పొరేటర్ సీట్లు ఇవ్వడం జరిగిందాని అన్నారు.రామగుండం చరిత్ర లోనే మొదటి సారిగా హజ్ కమిటీ మెంబర్ పదవిని ఒక ముస్లిం మహిళకు ఇవ్వడం జరిగిందాని తెలిపారు.ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సఖ్యత, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబంలో శాంతి, సంతోషం నెలకొనాలని ప్రార్థిస్తూ, ఈ పర్వదినం అందరికీ మంచి ఆరోగ్యం, అభివృద్ధి తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జీవితాలలో మార్పులు రావాలంటే రాజకీయంగా రాణించాలి



**ముషీరాబాద్, మార్చి 21 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో సగరులు రాజకీయంగా ఎదిగినప్పుడే జీవన స్థితిగతులలో మార్పు రాగలదని, దీని కోసం ప్రతి ఎన్నికల్లో సగరులు పోటీ చేయాలని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర పిలుపునిచ్చారు. ఈ మేరకు హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శేఖర్ సగర అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర సగర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ సగర మాట్లాడుతూ.. ఈ మధ్య కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 39 మంది సగరులు సర్పంచులు గా గెలుపొందారని, 9 మంది కౌన్సిలర్ లుగా, కార్పొరేటర్ లుగా విజయం సాధించారని, భవిష్యత్తులో హైదరాబాద్ నగర పాలక సంస్థకు కు జరిగే ఎన్నికల్లో సగరులు అనేక డివిజన్లలో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా దాదాపు లక్ష మందికి తగ్గకుండా శంఖారావం పేరిట పెద్ద బహిరంగ సభను నిర్వహించి ఈ రాజకీయ పార్టీలకు సగరుల చైతన్యం ఏంటో చాటి చెబుతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా సగరులను బి.సి. డి గ్రూప్ నుండి ఏ గ్రూప్ కు మార్చాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికృష్ణ సగర, సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ చైర్మన్ ఆస్కాని మారుతి సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి సగర, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆర్.బి ఆంజనేయులు సగర, రాష్ట్ర మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లవి సగర, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

## వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్ డీజిల్ అందించాలి



**కొండమల్లేపల్లి, మార్చి 21 (జనంసాక్షి) :** కొండమల్లేపల్లి మండల పరిధిలోని చిన్న అడిశర్లపల్లి గ్రామంలోని సంజీవని ట్రస్ట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోలియం ఫిల్లింగ్ స్టేషన్ ను శనివారం ఎమ్మెల్యే బాలు నాయక్ స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య, నాయకులతో కలిసి నూతన ప్రారంభోత్సవం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాహన వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్‌ను అందించాలని నిర్వాహకులకు సూచించారు. భారత్ పెట్రోల్ బంకులో వాహనదారులకు ఉచిత సౌకర్యాలు వాహన టైర్లలో గాలి నింపడం, పెట్రోల్, డీజిల్ బిల్లును పొందే హక్కు, ప్రథమ చికిత్స పెట్టె సౌకర్యం, టాయిలెట్ సౌకర్యం, అత్యవసర ఫోన్ కాల్, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు వంటి కొన్ని ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. వీటికి ఎటువంటి ఛార్జీలు చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులకు బంకు నిర్వాహకులు పెద్దబావి శోభా మహేందర్ రెడ్డి దంపతులు ముఖ్య అతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందుల వెంకటయ్య గౌడ్, ఉపసర్పంచ్ గడ్డం జ్యోతిరవి, దేవరకొండ మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని మాధవరెడ్డి, దూదిపాల వేణుధర్ రెడ్డి, దూదిపాల శ్రీధర్ రెడ్డి, తేరా సత్యనారాయణ రెడ్డి, మేకల శ్రీనివాస్ యాదవ్, ఉట్కూరి వేమన్ రెడ్డి, పసునూరి యుగేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, గోవర్ధన్ రెడ్డి, సతీష్ రెడ్డి, ముచ్చర్ల శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నరేందర్, జనార్దన్ రెడ్డి, అభిలాష్ రెడ్డి, శివానందరెడ్డి, గడ్డం శ్రీరాములు, కూర దేవేందర్, ఇస్లావత్ సురేష్, మామిళ్ళ లక్ష్మీనారాయణ, మూనా నాయక్ స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సాహాల నడుమ రంజాన్ పండుగ



**హుజూర్‌నగర్, మార్చి 21 (జనంసాక్షి) :** పట్టణంలోని ఈద్గాలో రంజాన్ పండుగ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ నెల ముగింపును పురస్కరించుకుని ముస్లింలు భారీ సంఖ్యలో ఈద్గాకు తరలివచ్చి ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణలో చిన్నా, పెద్దా అందరూ పాల్గొని పండుగకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు పరస్పరం ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ నెల ఉపవాస దీక్ష, సహనం, దానధర్మాలు, సోదరభావం వంటి గొప్ప విలువలను మనుషులకు నేర్పుతుందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, ప్రేమాభిమానాలు పెంపొందాలని ఆకాంక్షించారు. ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగ సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తుందని మత పెద్దలు పేర్కొన్నారు. ఉపవాస దీక్షలతో పాటు దానం, ధర్మం, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చే ఈ పండుగ ప్రత్యేకతను వారు వివరించారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఈద్గాకు చేరుకుని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు, యరగని నాగన్న గౌడ్, చిట్యాల అమర్నాథ్ రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి.అజీజ్ పాషా, ఎస్కే మన్సూర్ అలీ, ఎస్.కె బిక్కన్ సాబ్, అబ్దుల్ మజీద్ భాయ్, బాజీ, షఫీ, గౌస్ ఖాన్, అశ్రఫ్ అలీ, రహీం, ఖాదర్ సాబ్, జానీ, రఫీ, బాబా, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే కుంభం**



**వలిగొండ, మార్చి 21 (జనం సాక్షి) :** జలయజ్ఞంలో భాగంగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టినటువంటి కాలువలు మళ్ళీ కాంగ్రెస్ హయం లోనే పూర్తయ్యాయని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి వద్ద వరంగల్ - హైదరాబాద్ జాతీయ రహదారి కింది నుంచి వెళ్లే బస్వాపురం ప్రాజెక్ట్ కాలువను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం ఈ కాలువ పూర్తి కావటం తో భువనగిరి, వలిగొండ మండలాలలో చెరువులు నింపి పంట పొలాలకు నీరు అందించే కార్యక్రమం మొదలైందని అన్నారు.ఏడున్నర కోట్ల ఖర్చుతో కల్వర్టు నిర్మాణం పూర్తిచేసి నీరు అందిస్తున్నట్టు తెలిపారు. బసవపురం ప్రాజెక్టులో ఇంకా పూర్తిస్థాయి లో నీళ్లునింపలేదనీ ముంపు గ్రామం బి ఎన్ తిమ్మాపురం లో ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇంకా కొంత మంది కి పరిహారం అందలేదని, మరో 50 కోట్లు నిధులు విడుదల చేస్తే బి ఎన్ తిమ్మాపూర్ గ్రామం ఖాళీ అయ్యి నీళ్లు నింపడానికి అనువుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం బస్వాపురం ప్రాజెక్టు 0.7 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యం ఉందన్నారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి వద్ద కూడా రోడ్డును కటింగ్ చేసి కాల్వ ద్వారా నీరు వెళ్లేలా చేసే కార్యక్రమం చేయబోతున్నట్లు తెలిపారు. మరో పైపు హైలెవల్ కాలువ నిర్మాణం ద్వారా వడపర్తి కత్వా కు నీరు వచ్చేలా భూసేకరణ మొదలైందని, మరో 6 నుంచి 7 కోట్ల విలువ చేసే భూ సేకరణ పూర్తి అయితే హైలెవల్ కాలువ పూర్తి అయ్యి వడపర్తి నుంచి బీబీ నగర్ చెరువుకు నీరు అందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు

# మహనీయులు చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలి

- **శాసనసభ్యులు మందుల సామేలు**



**తుంగతుర్తి, మార్చి 21 (జనం సాక్షి) :** నవయుగ వైతాళికుడు మహాత్మ జ్యోతిరావు పూలే, స్వాతంత్ర సమరయోధుడు సమ సమాజ స్థాపనకు కృషిచేసి సమాజంలో నెలకొని ఉన్న అంటరానితనాన్ని రూపుమాపేందుకు విశేష కృషి చేసిన భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు, శనివారం మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో మహనీయులు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాన్ని పున ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు అరుంధతి యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే క్రీడోత్సవాలను సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మహనీయుల విగ్రహాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు చింతకుంట్ల విట్టల్ సభా అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. సమాజంలో సమానత్వం, విద్యాభివృద్ధి దళితుల హక్కుల కోసం వారు చేసిన కృషిని కొనియాడారు.మహనీయుల ఆలోచనలు ప్రతి ఒక్కరు ఆచరణలో పెట్టాలని, సమాజంలో ఐక్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు.జ్యోతిరావు పూలే మహిళా విద్య, కులవ్యవస్థ నిర్మూలనలో కీలక పాత్ర పోషించగా, బాబు జగ్జీవన్ రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడిగా నిలిచారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బహుజన యుద్ధనౌక డాక్టర్ ఏపూరి సోమన్న, గ్రామ సర్పంచ్ చిలకల మంజుల వెంకన్న, తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు,అరుంధతి యువజన సంఘం అధ్యక్షులు చింతకుంట్ల పరమేష్,ఉప సర్పంచ్ శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ కేతిరెడ్డి లతా విజయకుమార్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, ఏవైసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాశం అజయ్ కుమార్, గౌరవాధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న(బిల్డర్), విగ్రహ నిర్వహణ కమిటీ ఉపాధ్యక్షులు మందుల నరేష్, ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల పరమేష్ (బాబు), సభ్యులు మందుల పరమేష్, చింతకుంట్ల సైదులు, మాచర్ల ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రేగటి రవి, సుంకరి జనార్ధన్,వివిధ గ్రామాల సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు, యువజన లు మహిళలు భారీగా హాజరై మహనీయుల సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు ఆధ్వర్యంలో తుంగతుర్తి, మందిరాల ఎస్సై లు క్రాంతి కుమార్, వీరమల్లు పోలీస్ సిబ్బందితో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.




## సూచీలకు స్వల్ప ఉపశమనం

**ముంబై:**భారీ నష్టాల నుంచి దేశీయ సూచీలు శుక్రవారం స్వల్పంగా కోలుకున్నాయి. షేర్లు తక్కువ ధరల్లో లభిస్తున్నందున.. పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ, లోహ రంగాల్లో కొనుగోళ్లు రావడం ఇందుకు ఉపకరించింది. అయితే ఆఖర్లో అమ్మకాలతో లాభాలు పరిమితమయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 64 పైసలు క్షీణించి జీవనకాల కనిష్ఠమైన 93.53 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.20% లాభంతో 108.5 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా లాభపడగా, మిగతావి నష్టపోయాయి. ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.98 లక్షల కోట్లు పెరిగి రూ.429.11 లక్షల కోట్ల (4.60 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 352 పాయింట్ల (క్రితం ముగింపు 74,207.24) లాభంతో 74,559.38 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో రోజంతా లాభాలను కొనసాగించి సూచీ, ఇంట్రాడేలో 75,286.39 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. అక్కడ లాభాల స్వీకరణ ఫలితంగా కాస్త వెనక్కి వచ్చినా, 325.72 పాయింట్ల లాభంతో 74,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 112.35 పాయింట్లు పెరిగి 23,114.50 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,067.60- 23,345.15 పాయింట్ల మధ్య కదలాడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 21 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా 3.37%, టాటా స్టీల్ 3.23%, ఇన్ఫోసిస్ 2.78%, ట్రెంట్ 2.41%, రిలయన్స్ 2.11%, సన్‌ఫార్మా 1.90%, ఎన్‌టీపీసీ 1.83%, టైటన్ 1.80%, హెచ్‌సీఎల్ టెక్ 1.73%, ఎటర్నల్ 1.49% రాణించాయి. బీఈఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఇండిగో 1.10% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో పీఎస్‌యూ బ్యాంక్ 2.19%, ఫోకస్డ్ ఐటీ 2.18%, ఐటీ 2.08%, ఆరోగ్య సంరక్షణ 1.45%, లోహ 1.41%, ఇంధన 1.03% పెరిగాయి. ఆర్థిక సేవలు, ప్రైవేట్ బ్యాంకులు తగ్గాయి. బీఎస్ఈలో 2414 షేర్లు లాభపడగా, 1863 స్క్రిప్‌లు నష్టపోయాయి. 155 షేర్లలో ఎటువంటి మార్పులేదు. కోల్ ఇండియా అనుబంధ సంస్థ సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ ఐపీఓ మొదటి రోజు 7% స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 7,97,89,500 షేర్లను ఆఫర్ చేయగా, 52,44,320 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటెయిల్ విభాగంలో 10% స్పందన దక్కింది. ఎంటర్‌ప్రైజ్ స్థాయి కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని వేగవంతం చేయడానికి ఏఐ-డేటా సెంటర్ సొల్యూషన్ తీసుకొచ్చినట్లు ఐటీ దిగ్గజం విప్రో ప్రకటించింది. కోర్ డేటా కేంద్రాలను, కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ కార్యకలాపాలను ఆధునీకరించడానికి ఇది దోహదపడుతుందని తెలిపింది.

మన ఫారెక్స్ (విదేశీ మారకపు) నిల్వలు మార్చి 13తో ముగిసిన వారానికి 7.052 బి.డాలర్లు (దాదాపు రూ.64,000 కోట్లు) తగ్గి 709.759 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.64 లక్షల కోట్ల)కు చేరాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. అంతక్రితం వారం ఫారెక్స్ నిల్వలు 11.683 బి.డాలర్లు తగ్గి 716.81 బి.డాలర్లుగా నమోదయ్యాయి. సమీక్షిస్తున్న వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 7.678 బి.డాలర్లు తగ్గి 555.568 బి.డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 664 మి.డాలర్లు క్షీణించి 130.681 బి.డాలర్లుగా ఉన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరుకు కొనసాగిన నష్టాలు: నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అతాను చక్రబర్తి రాజీనామా నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు నష్టపోయింది.

# అనిశ్చితి వేళ.. ఇంధన ఆదా తప్పనిసరి

### ఇంటర్నేషనల్ ఎనర్జీ ఇంధన ఏజెన్సీ (ఐఈఏ) సూచనలు



**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నందున, ఇంధన పొదుపునకు సాధ్యమైనన్ని జాగ్రత్తలు అందరూ తీసుకోవాలని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) సూచిస్తోంది. రహదారులపై వాహన వేగాన్ని కనీసం గంటకు 10 కి.మీ. మేర తగ్గించాలని తెలిపింది. ప్రత్యామ్నాయం ఉంటే విమాన ప్రయాణాలను మానుకోవాలని.. విద్యుత్తు ఉపకరణాలపై వంట చేసుకోవాలని సూచించింది. ఒకే మార్గంలో ప్రయాణిస్తున్న వారు, ఒక కారును ఆశ్రయించాలని (పూలింగ్) విజ్ఞప్తి చేసింది. చమురు బ్యారెల్ ధర 108 డాలర్లకు చేరడంతో పెట్రోల్ - డీజిల్, విమాన ఇంధనం, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) ధరలపైనా ప్రభావం పడుతోంది. ప్రీమియం పెట్రోలు, పారిశ్రామిక డీజిల్ ధరలతో పాటు ఇళ్లలో వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.60 మేర పెరిగింది. సాధారణ పెట్రోలు, డీజిల్ ధరలను ప్రస్తుతానికి మార్చ లేదు. ఈ నేపథ్యంలో ఇంధన మార్కెట్ స్థిరీకరణకు ఐఈఏ కృషి చేస్తున్నట్లు తెలిపింది. 400 మిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలను విడుదల చేయడానికి ఐఈఏ సభ్యదేశాలు అంగీకరించాయని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలు, కంపెనీలు కూడా ఇంధనాన్ని పొదుపుగా వాడేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ ప్రకారం.. సాధ్యమైన చోట ఇంటి నుంచి పని విధానాన్ని అమలు చేయాలి. జాతీయ స్థాయిలో ఇది చేస్తే, చమురు వినియోగాన్ని 2-6% తగ్గించు కోవ చ్చు. జాతీయ రహదారులపై వేగంగా దూసుకె ళ్లకుం డా.. కనీసం 10 కి.మీ/గంట మేర తగ్గించాలి. తద్వా రా వ్యక్తిగత వాహనాల ఇంధన వినియోగం 5-10%, భారీ ట్రక్కులకు 5% ఆదా అవుతుంది.వ్యక్తిగత కార్ల బదులు బస్సులు, రైళ్లలో ప్రయాణిస్తే జాతీయ స్థాయిలో 1-3% ఇంధన వినియోగం తగ్గుతుంది. నంబర్ ప్లేట్ రొటేషన్ పథకాలను తీసుకురావడం ద్వారా ట్రాఫిక్, ఇంధనాన్ని ఆదాయ చేయొచ్చు.ఒకే మార్గంలో ప్రయాణించే వారు కార్ పూలింగ్ అమలు చేయొచ్చు. వాణిజ్య వాహనాలను మెరుగ్గా నడిపితే, డీజిల్ వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.కార్లలో ఎల్‌పీజీకి బదులు పెట్రోలు వాడితే, ఇళ్లకు మరిన్ని వంటగ్యాస్ సిలిండర్లు అందించొచ్చు. వ్యాపారావసరాల కోసం విమాన ప్రయాణాలు చేసేవారు 40% ప్రయాణాలు తగ్గించినా, 7-15% మేర విమాన ఇంధన గిరాకీని తగ్గించుకోవచ్చు.

## ట్విటర్ కొనుగోలులో మస్క్ మోసాలు..!

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 2022లో ట్విటర్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు జ్యూరీ నిర్ధరించింది. ట్విటర్ కొనుగోలు చేయడానికి కొన్ని నెలల ముందు ఉద్దేశపూర్వకంగా పెట్టుబడిదార్లను గందరగోళానికి గురిచేసినట్లు తెలిపింది. దానివల్ల ట్విటర్ షేర్ల విలువ తగ్గినట్లు వెల్లడించింది. అయితే స్టాక్ విలువను తగ్గించేందుకు కూడా కుట్ర పన్నారనే ఆరోపణలను తోసిపుచ్చింది. మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేయకముందు దాఖలైన దావాపై విచారణ జరిపిన జ్యూరీ ఈ వ్యాఖ్యలు చేసింది. ట్విటర్ కొనుగోలు ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు మే 2022లో మస్క్ చేసిన రెండు ట్వీట్లు, ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు, పలు ప్రకటనలతో ట్విటర్ వాటాదారులు తమ షేర్లను అమ్ముకునేలా చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై శాన్ ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టులో మార్చి 2న విచారణ ప్రారంభమయ్యింది. దీనిపై విచారణ జరిపిన తొమ్మిది మంది సభ్యుల జ్యూరీ 2022లో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు పేర్కొంది. మస్క్ కొనుగోలు చేయడానికి ముందు ట్విటర్ షేర్లు అమ్ముకున్న వాటాదారులకు నష్టపరిహారం చెల్లించాలని టెస్లా అధినేతను ఆదేశించింది. కాగా తాను ట్విటర్‌ను కొనుగోలు చేయాలని అనుకున్నప్పుడు అందులో నకిలీ ఖాతాల సంఖ్య అధికంగా ఉందని మస్క్ తెలిపారు. దీంతో కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ట్విటర్ డెలావేర్‌లోని కోర్టును ఆశ్రయించడంతో.. తన నిర్ణయాన్ని మార్చుకున్నానన్నారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు.

## లెక్సస్ విద్యుత్తు కారు ఇఎస్500 ధర రూ.89.99 లక్షలు


విలాసవంత కార్ల తయారీ సంస్థ లెక్సస్ ఇండియా, తమ తొలి విద్యుత్తు కారు ఇఎస్500ఇ ని శుక్రవారం ఆవిష్కరించింది. ఒక ఛార్జింగుతో 580 కిలోమీటర్ల వరకు ప్రయాణించేందుకు అనువైన ఈ కారు ధర రూ.89.99 లక్షలు (ఎక్స్ షోరూం) అని సంస్థ తెలిపింది. కొనుగోలుదార్ల నుంచే వచ్చే గిరాకీకి అనుగుణంగా మరిన్ని మోడళ్లు ఆవిష్కరిస్తామని సంస్థ ప్రెసిడెంట్ హికారు ఇకెచి పేర్కొన్నారు. ఈఎస్ హెచ్ఈవీ (హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వెహికల్) వివరాలను తగిన సమయంలో వెల్లడిస్తామని చెప్పారు.





## చేతులు కలపనున్న వొడాఫోన్-ఐడియా, బీఎస్ఎన్ఎల్..!

**న్యూఢిల్లీ:**అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ జట్టు కట్టనున్నాయి. టవర్లు, ఫైబర్ కేబుళ్లు, స్పెక్ట్రమ్‌ను ఈ రెండు సంస్థలు షేర్ చేసుకోనున్నాయి. కవరేజ్ మెరుగుపర్చేందుకు, డబ్బు ఆదా చేసే ఉద్దేశంతో ఈ రెండు సంస్థలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలు స్తోంది. నెట్‌వర్క్ నాణ్యతను మెరుగుపర్చేందుకు, 5జీ విస్తరణను వేగవంతం చేసేందుకు ఈ చర్య ఉపయోగపడొచ్చని భావిస్తున్నారు. ఒకట్రెండు కంపెనీలు ఆధిపత్యం చెలాయించకుండా టెలికాం మార్కెట్‌లో పోటీ ఉండేలా ఇది దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 4జీ సైట్స్, అప్‌గ్రేడ్‌ల కోసం ఇవి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీలు జట్టు కట్టడం వల్ల గ్రామీణప్రాంతాల్లో కూడా కవరేజీ మెరుగుపడనుందని తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగ సంస్థ కాగా.. వీఐలో కేంద్రానికి 49 శాతం వాటా ఉంది.




# పండగపూటా ఆరని యుద్ధ జ్వాలలు





దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం కొనసాగుతోంది. ఇజ్రాయెల్-అమెరికా దాడులతో ఎప్పటికప్పుడు గట్టి ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నా.. ఇరాన్ వెనక్కి తగ్గడం లేదు. ఇజ్రాయెల్‌పై, గల్ఫ్ దేశాలపై భీకర దాడులు కొనసాగిస్తూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా తమ శత్రుదేశాల్లోని వినోద కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలపై దాడులకు దిగుతామంటూ అది తాజాగా హెచ్చరించింది. తాము ఇప్పటికీ క్షిపణులను తయారుచేస్తున్నామని ఉద్ఘాటించింది. పశ్చిమాసియావ్యాప్తంగా శుక్రవారం పవిత్ర 'ఈద్ ఉల్-ఫితర్' పర్వదినాన కూడా దాడుల ప్రకంపనలు కొనసాగాయి. సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై దాడికి ప్రతీకారంగా ఇరాన్ భీకర దాడులతో విరుచుకుపడుతుండటంతో.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తి మేరకు ఇకపై ఆ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకోబోమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. మరోవైపు- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు వాషింగ్టన్ ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తమ సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై దాడికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై, పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై ఇరాన్ దాడులు కొనసాగించింది. కువైట్‌లోని కీలక మినా అల్-అహ్మదీ రిఫైనరీపై రెండు విడతలుగా టెహ్రాన్ డ్రోన్లతో శుక్రవారం విరుచుకుపడటంతో మంటలు చెలరేగాయి. పశ్చిమాసియాలోని అతిపెద్ద రిఫైనరీల్లో మినా అల్-అహ్మదీ ఒకటి. ఇది రోజుకు 7.3 లక్షల బ్యారెళ్ల చమురును శుద్ధి చేయగలదు. ఇరాన్ దాడులతో ఈ రిఫైనరీ గురువారం కూడా దెబ్బతిన్న సంగతి గమనార్హం. టెహ్రాన్ ప్రయోగించిన ఓ బాలిస్టిక్ క్షిపణిని తాము కూల్చివేసినట్లు కువైట్ మిలిటరీ తెలిపింది. దుబాయ్‌పైకి దూసుకొచ్చిన ఇరాన్ డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకొన్నాయి. ఈ క్రమంలో భారీ పేలుడు శబ్దాలు నగరాన్ని కుదిపేశాయి. సౌదీ అరేబియాలోని ఈస్టర్న్ ప్రావిన్సుపై దాడికి పలు డ్రోన్లు ప్రయత్నించాయి. వాటిని కూల్చివేసినట్లు సౌదీ తెలిపింది. బహ్రెయిన్‌పైకి దూసుకొచ్చిన ఓ క్షిపణిని ఆ దేశ బలగాలు కూల్చివేశాయి. ఈ క్రమంలో దాని శకలాలు ఓ గిడ్డంగిపై పడటంతో మంటలు చెలరేగాయి. ఇజ్రాయెల్‌పైకి ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. జెరూసలెం ఓల్డ్ సిటీ దగ్గర్లో క్షిపణి దాడి జరిగింది. అక్కడ ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. నగరవ్యాప్తంగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. తాజా ఉద్రిక్తతల కారణంగా జెరూసలెంలోని అల్ అక్సా మసీదును శుక్రవారం మూసివేశారు. 1967 తర్వాత ఈ మసీదు ప్రాంగణాన్ని ఈద్ ఉల్-ఫితర్ ప్రార్థనలు చేసేందుకు వీలు లేకుండా మూసివేయడం ఇదే తొలిసారి. పపంచవ్యాప్తంగా తమ శత్రుదేశాల్లోని పార్కులు, వినోద కేంద్రాలు, పర్యాటక ప్రాంతాలేవీ సురక్షితం కావని ఇరాన్ మిలిటరీ ప్రధాన అధికార ప్రతినిధి జనరల్ అబోల్‌ఫజల్ షెకార్చీ హెచ్చరించారు. యుద్ధం ముగించేలా ప్రపంచ దేశాలన్నీ అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఒత్తిడి పెంచాలని టెహ్రాన్ భావిస్తోందని, ఆ వ్యూహంలో భాగంగానే పశ్చిమాసియా ఆవల కూడా అది దాడులు చేయొచ్చని షెకార్చీ వ్యాఖ్యలతో అర్థమవుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. పశ్చిమాసియాలో తమ పొరుగు దేశాలకు ఇరాన్ విదేశాంగ శాఖ మరోసారి గట్టి హెచ్చరిక జారీ చేసింది. ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాల నుంచి తమపైకి దాడులను అనుమతించొద్దని ఓ ప్రకటనలో పేర్కొంది. ఒకవేళ దాడులను అనుమతిస్తే.. ఆయా దేశాలు యుద్ధంలో పాల్గొంటున్నట్లే పరిగణిస్తామని హెచ్చరించింది. గల్ఫ్ దేశాలపై ఇరాన్ తీవ్ర దాడుల నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి గురువారం అత్యవసరంగా సమావేశమైంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగాయి. టెహ్రాన్‌వ్యాప్తంగా భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. యుద్ధం కారణంగా ఇరాన్‌లో నౌరోజ్ (పర్షియన్ కొత్త సంవత్సరం ఆరంభం) వేడుకల సందడి శుక్రవారం అంతగా కనిపించలేదు. లెబనాన్‌పై దాడులను కొనసాగించిన ఇజ్రాయెల్.. కొత్తగా సిరియాపైనా విరుచుకుపడింది. సిరియాలో మైనార్టీ వర్గమైన డ్రూజ్‌లపై దాడులకు ప్రతిగా ఆ దేశ మిలిటరీని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. ఇరాన్ పాలకుల అణ్వాయుధ కలలను, ఆ దేశ మిలిటరీ-క్షిపణి సామర్థ్యాలను నాశనం చేశామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. జెరూసలెంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. "ఇరాన్ దశాబ్దాలుగా నిర్మించుకున్న క్షిపణి, డ్రోన్ వ్యవస్థలను అమెరికాతో కలిసి మేం ధ్వంసం చేశాం. వాటిని తయారుచేసే పారిశ్రామిక పునాదులనూ పెకిలించాం. టెహ్రాన్ గర్వపడే బాలిస్టిక్ క్షిపణి నిల్వలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు ఇరాన్ గగనతలంలో స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. ఇరాన్ నౌకాదళం మునిగిపోయింది. దాని వైమానిక దళం కకావికలమైంది. ఇరాన్ అణు మౌలిక సదుపాయాలపై దాడులు చేశాం. అది అణ్వాయుధ దేశంగా ఎదగకుండా అడ్డుకున్నాం. ఆ దేశం ఇక యురేనియంను శుద్ధి చేయలేదు. బాలిస్టిక్ క్షిపణులనూ తయారుచేయలేదు" అని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని అడ్డుపెట్టుకుని ప్రపంచాన్ని బ్లాక్‌మెయిల్ చేసేందుకు ఇరాన్ ప్రయత్నిస్తోందని, ఆ ప్రయత్నాలు ఇంకెంతోకాలం సాగవని నెతన్యాహు హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వినతి మేరకు.. ఇరాన్‌కు కీలకమైన సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇకపై దాడి చేయబోమని ఆయన వెల్లడించారు.

సరిపడా నిల్వలున్నాయ్: ఐఆర్‌జీసీ

ఇరాన్ మిలిటరీ సామర్థ్యాలను నాశనం చేశామంటూ నెతన్యాహు చేసిన వ్యాఖ్యలను ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్‌జీసీ) అధికార ప్రతినిధి జనరల్ అలీ మొహమ్మద్ నయీనీ తోసిపుచ్చారు. యుద్ధం జరుగుతున్నప్పటికీ తాము (ఇరాన్) క్షిపణులు ఉత్పత్తి చేస్తూనే ఉన్నామన్నారు. తమ వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని, యుద్ధాన్ని త్వరగా ముగించాలని ఇరాన్ కోరబోదని స్పష్టం చేశారు. శత్రుదేశాలను తాము ఆశ్చర్చపరుస్తామన్నారు. ఈ వ్యాఖ్యలు చేసిన తర్వాత కొన్ని గంటల్లోనే అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో జనరల్ అలీ మొహమ్మద్ నయీనీ మరణించడం గమనార్హం. పశ్చిమాసియాలో మరో మూడు యుద్ధనౌకలను అమెరికా మోహరించనుంది. యూఎస్ఎస్ బాక్సర్, మరో రెండు యుద్ధనౌకలు దాదాపు 2,500 మంది నౌకాదళ సిబ్బందితో పశ్చిమాసియా దిశగా వెళ్తున్నట్లు అమెరికా అధికారి ఒకరు శుక్రవారం స్పష్టంచేశారు. అమెరికాకు చెందిన విమానవాహక నౌక యూఎస్ఎస్ ట్రిపోలీ పశ్చిమాసియా వైపు కదులుతున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ దాడుల కారణంగా ఇరాక్ నుంచి తమ సెక్యూరిటీ అడ్వైజరీ మిషన్‌ను నాటో ఉపసంహరించుకుంది. సంబంధిత వందల మంది సిబ్బందిని ఐరోపాకు తరలించింది.

హర్మూజ్‌ను తెరిచేందుకు అపాచీ హెలికాప్టర్లు?

ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది! ఇందులో భాగంగా- అపాచీ అటాక్ హెలికాప్టర్లు, తక్కువ ఎత్తులో ఎగిరే యుద్ధవిమానాలను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతోంది. తీరప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంఛర్లు, డ్రోన్లు, బోట్ల వంటి లక్ష్యాలను ఛేదించేందుకు వీటిని ఉపయోగించే అవకాశాలున్నాయి.అమెరికాకు చెందిన ఎఫ్-35 యుద్ధవిమానంపై తమ గగనతల రక్షణ వ్యవస్థతో అడ్డుకున్న వీడియోను ఇరాన్ తాజాగా విడుదల చేసింది. దాడిలో ఆ యుద్ధవిమానం ఎంతగా దెబ్బతిందో తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది.

ట్రంప్ చిందులు

పశ్చిమాసియా సంక్షోభానికి కనుచూపుమేరలో పరిష్కారం కనిపించకపోవడం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అసహనానికి గురిచేస్తోంది. ఇరాన్‌పై యుద్ధం చేసేందుకు తనతో కలిసిరాని నాటో కూటమి దేశాలపై తాజాగా ఆయన అక్కసు వెళ్లగక్కారు. "నాటో దేశాలు పిరికిపందలు. వారి వైఖరి మాకు గుర్తుండిపోతుంది" అని ఆయన శుక్రవారం తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. "ఈ యుద్ధాన్ని సైనికంగా గెలిచేశాం. ఇప్పుడు ఇందులో పాల్గొంటే వారికి(నాటో దేశాలకు) వచ్చే ముప్పేదీ ఉండదు. ఆ దేశాలు చమురు ధరలు పెరిగిపోయాయంటూ ఫిర్యాదు చేస్తున్నాయే కానీ హర్మూజ్ జలసంధిని తెరిపించాలని కోరుకోవడం లేదు. ఒక చిన్న సైనిక ఎత్తుగడే చమురు ధరలు ఇంతగా పెరిగిపోడానికి ఏకైక కారణం. ఆ దేశాలు హర్మూజ్ జలసంధిని తెరిపించడం ఎంతో తేలిక. ఇందులో ముప్పే లేదు" అని ట్రంప్ అన్నారు.

ఇరాన్ సర్వం కోల్పోయింది

ఇరాన్‌పై పైచేయి సాధించేశామని ట్రంప్ పునరుద్ఘాటించారు. తాము జరుపుతున్న నిరంతర దాడుల్లో ఇరాన్ నౌకాదళాన్ని, వాయుసేనను, విమాన విధ్వంసక సామగ్రిని, రాడార్‌లను చివరికి నాయకులను కూడా కోల్పోయిందని ట్రంప్ వ్యాఖ్యానించారు. "ఇప్పుడు ఇరాన్‌కు నేతృత్వం వహించడానికి ఎవరూ సుముఖంగా లేరు. మేం వాళ్లతో మాట్లాడాలని అనుకుంటున్నాం. కానీ మాట్లాడేందుకు (ఇరాన్‌లో) ఎవరూ మిగల్లేదు" అని ట్రంప్ అన్నారు. ఈ పరిస్థితిపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.

## ఎల్‌పీజీ కొరతతో హోటళ్ల మూసివేత ప్రభావం

### ప్యాకేజ్డ్ ఆహారానికి పెరిగిన గిరాకీ

### ఇ-కామర్స్ వేదికలపై 15-20% పెరిగిన విక్రయాలు

హైదరాబాద్: పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాలో ఏర్పడిన అంతరాయం భారతీయుల ఆహారపు అలవాట్లను అనూహ్యంగా మారుస్తోంది. గ్యాస్ సిలిండర్ల లభ్యత తగ్గడంతో గంటల తరబడి వంట చేసే పని లేకుండా నిమిషాల్లో సిద్ధమయ్యే 'రెడీ-టు-ఈట్' ఆహార పదార్థాలకు గిరాకీ ఒక్కసారిగా పెరిగింది. భారత్ తన వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రస్తుతం పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో కీలకమైన హర్మూజ్ జలసంధి ద్వారా జరిగే రవాణా ఇబ్బందుల్లో పడింది. దీంతో గత 15 రోజుల్లోనే దేశీయ ఎల్‌పీజీ వినియోగం గతేడాదితో పోలిస్తే 17.7 శాతం మేర క్షీణించింది. ఫిబ్రవరితో పోలిస్తే ఈ తగ్గుదల ఏకంగా 26.3 శాతంగా ఉండటం పరిస్థితి తీవ్రతను ప్రతిబింబిస్తోంది. గ్యాస్ కొరత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులకు ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు వాడే వాణిజ్య సిలిండర్లపై భారీగా కోత పడింది. హోటళ్లలో రేట్లు పెరగడం, లభ్యత తగ్గడంతో మధ్య తరగతి ప్రజలు ప్యాకేజ్డ్ పులిహోర, ఉప్మా, బిర్యానీ వంటి 'హీట్ అండ్ ఈట్' ఉత్పత్తులను ఆశ్రయిస్తున్నారు. వీటితోపాటు ప్రముఖ సంస్థలు ఉత్పత్తి చేసే మిల్లెట్ ఆహార ఉత్పత్తులకూ గిరాకీ అధికం అవుతోంది. వంటగ్యాస్ కొరత ప్రభావంతో ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్యాకేజ్డ్ మీల్స్, స్నాక్స్ విభాగంలో 15 శాతం పైగా వృద్ధి నమోదైందని ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పేర్కొంది. హైదరాబాద్, ముంబయి వంటి మెట్రోలకే పరిమితం కాకుండా, చిన్న నగరాలు, పట్టణాల్లోనూ ఈ ధోరణి కనిపిస్తోందని పేర్కొంది. పెరుగుతున్న గిరాకీ తగ్గట్టు ఆయా సంస్థలూ ఉత్పత్తిని పెంచతున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

## రాష్ట్రాలకు ఎల్పీజీ కేటాయింపు పెంపు

### 20% అదనంగా సరఫరా చేసేందుకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ(జనంసాక్షి):వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే



కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది.చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.

## భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ నమోదు,
# దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 21 (జనంసాక్షి) :**
2027 నియామక సంవత్సరం,భారత సైన్యంలో వివిధ కేటగిరీల్లో నియామకానికి సంబంధించి అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఆన్‌లైన్ నమోదు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అగ్నివీర్ కేటగిరీల్లో అవివాహిత యువత కోసం నియామక నోటిఫికేషన్ 13 ఫిబ్రవరి 2026న www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో విడుదలైంది. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నివాసితుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.నియామకం క్రింది కేటగిరీలలో జరుగుతుంది: అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్ స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 10వ తరగతి, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 8వ తరగతి. అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా ఏ రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 22 సంవత్సరాలకు పెంచబడింది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష 13 భాషల్లో నిర్వహించబడుతుంది. ఐటిఐ, డిప్లొమా, ఎన్సిసి అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయి. దరఖాస్తులు కేవలం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 01 ఏప్రిల్ 2026. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష తాత్కాలికంగా 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 వరకు నిర్వహించబడుతుంది. అడ్మిట్ కార్డులు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తాజా సమాచారం కోసం www. joinindianarmy. nic.in వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించాలి, తమ నమోదు చేసిన ఈ-మెయిల్ ఐడీలను చెక్ చేయాలి. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ను 040-27740059 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, నిష్పక్షపాత, పారదర్శకంగా జరుగుతుంది.

## ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించిన
# గంభీరావుపేట మండల రైతులు



**గంభీరావుపేట మార్చి 21 (జనం సాక్షి):** సిద్దిపేట జిల్లా నంగానూరు మండలం నర్మెట గ్రామంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సందర్శనలో భాగంగా గంభీరావుపేట మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు శనివారం రోజు సిద్దిపేటలోని నర్మేట ఆయిల్ ఫ్యాక్టరీను సందర్శించారు అక్కడ 150 ప్రదర్శన స్టాళ్లను రైతులు సందర్శించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు అందుబాటులో ఉండే విధంగా ఆయిల్ ఫాం ఫ్యాక్టరీను రేపు రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నందున ముందుగానే రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ రైతే రాజుగా మారాలని ఆలోచనతోటి పూర్తిస్థాయిలో ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం పూర్తిగా మద్దతుగా ఉన్నందున వారికి రైతులు ధన్యవాదాలు తెలియజేశారు ఇలాంటి గొప్ప కార్యక్రమంలో పాల్గొన్నందుకు గంభీరావుపేట రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గేరుగంటి రాజనర్సు, కోటగారి లింగం, మలోతు పశీతుల్య నాయక్, అక్కపల్లి బాలయ్య, అజ్మీరా భాస్కర్ నాయక్,ఏవో ప్రవీణ్ నాయక్‌లు పాల్గొనారు.

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు
## చీరల పంపిణి చేసిన కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి



**మంథని, (జనంసాక్షి) :** ఉగాది తెలుగు నూతన సంవత్సర పండగను పురస్కరించుకొని మంథని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, వారి కుటుంబాలకు మంథని మున్సిపల్ (బోయిన్ పేట్) 6 వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి చీరలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీలతక్రాంతి మాట్లాడుతూ.. ప్రతి ఉగాది పండగ సందర్భంగా ఏదో ఒక సేవ కార్యక్రమం చేపడుతాం దానిలో భాగంగా ఈ సంవత్సరం బోయిన్ పేట్ అభివృద్ధి కి తమ వంతుగా సహకరిస్తున్న మంథని మున్సిపల్ పారిశుద్ధ కార్మికులను గౌరవించుకొని వారికి చీరల పంపిణి చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

# మహిళలు, విద్య, వైద్యం పట్ల మొండి చెయ్యి చూపిన బడ్జెట్

- మహాలక్ష్మి పథకానికి సరిపడ నిధులు లేవు.. : ఐద్వా
- బడ్జెట్ పునఃపరిశీలన చేయాలి.. లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

**ముషీరాబాద్ (హైదరాబాద్), మార్చి 21 (జనంసాక్షి):**
ఎన్నికల ముందు మహిళల అభివృద్ధి, సాధికారతే మా ధ్యేయమని, మహాలక్ష్మి పథకం, ఉచిత సేవలతో గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. బడ్జెట్‌లో మహిళలు, విద్య, వైద్య రంగాలపై మొండి చెయ్యి చూపిందని ఐద్వా (ఆల్ ఇండియా డెమోక్రటిక్ విమెన్స్ అసోసియేషన్) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. 2026-27 బడ్జెట్ మరోసారి పాలకుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని, ఈ బడ్జెట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.26 వేల కోట్లు (8.22 శాతం) మాత్రమే కేటాయించారని, యునెస్కో సూచించిన 15-20 శాతం కేటాయింపులతో పోలిస్తే ఇది సగానికి కూడా చేరని దుస్థితని ఐద్వా ఆందోళన వ్యక్తం చేసింది. ఆరోగ్య రంగానికి రూ.12-13 వేల కోట్ల మధ్యే కేటాయింపు ఉండటం, మొత్తం బడ్జెట్‌లో 5 శాతానికి కూడా తక్కువగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, జాతీయ ఆరోగ్య విధానం సూచించిన కనీస 8 శాతం లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడింది.
మహిళల ఆర్థిక భద్రతకు అద్దుగోలుగా ప్రచారం చేసిన మహాలక్ష్మి పథకం విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 6040 కోట్లు అవసరమయ్యే ఈ పథకానికి కేవలం 4305 కోట్లు మాత్రమే కేటాయించి సరిపడ నిధులు ఇవ్వకుండా మాటలకే పరిమితం చేసిందని ఐద్వా ఆరోపించింది. ఇది మహిళలతో చేసిన ఎన్నికల మోసం తప్ప మరొకటి కాదని స్పష్టం చేసింది. గత బడ్జెట్‌లతో పోలిస్తే మహిళా, శిశు సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులు సరిపోవని, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ విఫలమైందని విమర్శించింది. సన్నబియ్యం పథకానికి 3 వేల కోట్లు కేటాయించగా.. వడ్డీలకే 2 వేల కోట్లు పోతాయని, ఒక్క వెయ్యి కోట్లతో సన్నబియ్యం ఎలా అందరికీ అందిస్తారని ప్రశ్నించింది. ఎన్నికల మేనిఫెస్టోలో మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు రూ.5 లక్షల లోపు రుణాలకే పరిమితం చేయడం ఏమిటని నిలదీసింది. నెలకు రూ.2,500 సాయం (మహాలక్ష్మి పథకం కింద) హామీ ప్రకారం ప్రతి మహిళకు అందించాల్సిన ఈ పథకానికి బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు లేవని, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాల పెంపు లేదా ఇతర ప్రయోజనాలపై ఎటువంటి సానుకూల ప్రకటన లేదని ఐద్వా ఆందోళన వ్యక్తం చేసింది.
రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో మహిళలపై నేరాలు నమోదవుతున్నాయని పేర్కొంది. విద్యారంగంలో ఉపాధ్యాయుల కొరత, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల లోపం, బాలికల భద్రతా సమస్యలు పెరుగుతున్నాయని, ఉన్నత విద్యలో ఫీజుల భారంతో పేద కుటుంబాల అమ్మాయిలు చదువు మధ్యలోనే వదిలిపెట్టే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపింది.
వైద్య రంగంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు, నర్సులు లేకపోవడం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాల లేమి, ఉచిత ఔషధాల కొరత వంటివి పేద మహిళల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని ఐద్వా ఆందోళన వ్యక్తం చేసింది.
ప్రభుత్వం తక్షణమే బడ్జెట్‌ను పునఃపరిశీలించి విద్యారంగానికి కనీసం 20 శాతం, ఆరోగ్య రంగానికి కనీసం 8 శాతం, మహాలక్ష్మి పథకానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసింది. మహిళల భద్రతకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేయాలని, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక మద్దతు పెంచాలని సూచించింది. మహిళల పేరుతో ప్రచారం చేసి బడ్జెట్‌లో నిర్లక్ష్యం చూపడం ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఐద్వా రాష్ట్ర కమిటీ హెచ్చరించింది.

# బడ్జెట్‌లో వ్యవసాయాన్ని విస్మరించింది ప్రభుత్వం

- నిధుల కేటాయింపు తగ్గించడం దారుణం.. రైతులకు మోసమే
- వ్యవసాయ రంగంలో మాంద్యం పెరిగే ప్రమాదం : రైతు సంఘం ఆగ్రహం




**శంకరపట్నం, మార్చి 21 (జనంసాక్షి):**
రాష్ట్ర ప్రభుత్వం 'వ్యవసాయనామ సంవత్సరం' అని ప్రకటించిన ప్పటికీ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు తగ్గించడం రైతాంగాన్ని విస్మరించడమేనని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా కమిటీ తీవ్ర విమర్శలు గుప్పించింది. శంకరపట్నం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. 2026-27 బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు మాత్రమే కేటాయించా రని, గత సంవత్సరం రూ.24,000 కోట్లు కేటాయించినప్పటికీ ఈసారి తగ్గించడం దారుణమని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగంలో "క్యూర్, ప్యూర్, రేర్" లక్ష్యాలలో వ్యవసాయా న్ని ప్రాధాన్యతగా చెప్పినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు ఆ లక్ష్యాలకు అనుగుణంగా లేవని మండిపడ్డారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తు లు 236.87 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతున్నాయని, రాష్ట్ర బడ్జెట్‌కు రూ.1.11 లక్షల కోట్లు ఈ రంగం కాంట్రిబ్యూట్ చేస్తున్నప్పటికీ రైతులకు అవసరమైన పథకాలు, సౌకర్యాలు అందుబాటులో లేవని విమర్శించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకం, గ్రామ అధికారుల నియామకం, లైసెన్స్ సర్వేయర్ల నియామకం వంటి అంశాలపై సరైన చర్యలు లేవని, భూ భారతి అమలు, రెవెన్యూ కోర్టుల పునరుద్ధరణ, పహాణిలో వాస్తవ సాగుదారుల పేర్ల నమోదు, పంటల బోనస్, కనీస మద్ధతు ధరల నిర్ణయం వంటి ముఖ్య అంశాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవని ఆయన ఆరోపించారు.
పత్తి, వరి పంటలను మాత్రమే మద్ధతు ధరల ఆధారంగా సాగు చేస్తున్నప్పటికీ ఆ రైతులకు కూడా కనీస మద్ధతు ధరలు పూర్తిగా అమలు కావడం లేదన్నారు. పంటల రుణ ప్రణాళికను లీడ్ బ్యాంకులు తయారు చేయకపోవడంతో రాష్ట్ర రుణ ప్రణాళిక అమలు జరగడం లేదని వివరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అను గుణంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోతే వ్యవసాయ రంగంలో మాంద్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతాంగ హితాల కోసం తమ సంఘం ఉద్యమాలకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గోపు వీరమల్లు, కునమల్ల సతీష్, కూనమల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు పారమిత విద్యార్థి

### పారమిత పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు

**కరీంనగర్, మార్చి 21 (జనంసాక్షి) :**
స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి కె. విఘ్నేష్ 7వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ఈ నెల 18వ తేదీన జిల్లా బాక్సింగ్ అసోషి యేషన్ క్రీడా సమాఖ్య వారి ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ బాలుర బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో 80 కేజీల విభాగంలో పారమిత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె. విఘ్నేష్ బంగారు పథకం సాధించారని, మార్చి 22 నుండి 24 వరకు హైదారాబాద్ లో జరుగనున్న రాష్ట్ర బాక్సింగ్ క్రీడా సమైఖ్య అసోషియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని బాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే కె. విఘ్నేష్ ని, బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం. ప్రసాద రావు, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత సమన్వయకర్త శ్రీనాథ్‌లు పాల్గొని అభినంధించారు.

# రంజాన్ పండగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

### హాజరైన తెలంగాణ వక్ఫ్బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్

**గంభీరావుపేట మార్చి 21 (జనం సాక్షి) :** గంభీరావుపేట పట్టణంలోని ఈద్‌గాహ్‌లో ఈదుల్ ఫితర్ నమాజ్ ఉదయం భక్తి శ్రద్ధలతో నమాజ్ నిర్వహించబడింది. ఈ నమాజ్ మరియు ఖుత్బాను జామియా మసీదు ఖతీబ్ ఇమామ్ హాఫిజ్ అబుల్ కలాం నిర్వహించారు. తన ప్రసంగంలో ఆయన పవిత్ర రమజాన్ మాసపు ప్రాముఖ్యత, తక్వా, సహనం మరియు సోదరభావం గురించి వివరంగా మాట్లాడి, ఈ మాసపు ఆధ్యాత్మిక విలువలను జీవితంలో కొనసాగించాలని ముస్లింలకు సూచించారు. సాంప్రదాయ ప్రకారం తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మత్ ఉల్లా హుస్సేని తన స్వగ్రామమైన గంభీరావుపేటకు విచ్చేసి ఈద్ నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఐక్యతను పెంపొందించుకోవాలని, సామాజిక సౌహార్దతను బలోపేతం చేయాలని కోరారు. అలాగే స్థానిక మైనారిటీల అభివృద్ధి మరియు సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు, నమాజ్ అనంతరం దేశం మరియు సమాజం శాంతి, భద్రత, అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించబడ్డాయి. ఈద్‌గాహ్‌లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని ఒకరికి ఒకరు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈద్‌గాహ్ నిర్వాహకులు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# చౌక ధరకే మెడిసిన్





- ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రాలను వినియోగించుకోండి
- కరీంనగర్ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన.
- కరీంనగర్ డాక్టర్ స్ట్రీట్స్ లో "ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాన్ని" ప్రారంభించిన కేంద్ర మంత్రి

**కరీంనగర్ బ్యూరో, మార్చి 21 (జనంసాక్షి) :**
రాష్ట్రంలో మెడిసిన్స్ కొనుగోలు సామాన్య ప్రజలకు భారంగా మారిన నేపథ్యంలో కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంనగర్ ప్రజలంతా పీఎం జన ఔషధి కేంద్రాల్లో దొరికే చౌక మందులను వినియోగించుకోవాలని కోరారు. శనివారం రోజు కరీంనగర్ లోని ముకరంపుర డాక్టర్ స్ట్రీట్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ "ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రం"ను ప్రారంభించారు. పేద ప్రజలకు వైద్యం భారం కాకూడదనే ఉద్దేశంతో నరేంద్రమోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. దీంతోపాటు ప్రైవేట్ మెడికల్ షాపుల్లో మెడిసిన్స్ కొనుగోలు చేయాలంటే అత్యంత ఖరీదైన వ్యవహారమైందన్నారు. మెడిసిన్ కొనుగోలు చేసే స్థోమత లేక ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల బాధలు, ఆర్థిక కష్టాలు తెలుసు కాబట్టే నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున "ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలు" తెరిచి చౌక ధరకే మెడిసిన్స్ అందిస్తున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలు అంటే ప్రభుత్వం తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ మందులు అందించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక మెడికల్ స్టోర్లు అని, ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన అనే పథకం కింద నిర్వహించబడుతున్నాయని తెలిపారు. బ్రాండెడ్ మందులపై ఖర్చు తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో చౌక ధరలకే మందుల అందుబాటులో ఉంచడం, ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడంతోపాటు ప్రజలను జనరిక్ మెడిసిన్ వాడకాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మోదీ ప్రభుత్వం ఈ జన ఔషధీ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు.

# విద్యకు సరిపోనీ కేటాయింపులు

- 15 శాతం అన్నది అంతా మిధ్య
- టీచర్స్ అసోసియేట్ అధ్యక్షులు పెరకారి శ్రీధర్ రావు



**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రభుత్వం ఇచ్చిన మాటకు అనుకూలంగా విద్యారంగా నికి కేటాయింపులు లేవని, పెండింగ్ బిల్లులు, పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం శోచనీయం అని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పెర్కారి శ్రీధర్ రావు అభిప్రాయపడ్డారు. గత 2025 -26 సంవత్సరపు ఆర్థిక బడ్జెట్లో విద్యకు 23 వేల 108 కోట్లు కేటాయించగా ఈ 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరుల అభివృద్ధికి కేటాయించింది కేవలం 26,674 కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్లో 8.2%. మాత్రమేనని. గత సంవత్సరం కంటే రూ 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీనీ ముఖ్యమంత్రి ఈ సంవత్సరం ఇంటర్మీడి యట్ బోర్డు తీసివేసి పాఠశాల విద్యతో అనుసంధానిస్తాము అని చెప్ప ఇంటర్మీడి యట్ వారికి కూడా బ్రేక్ ఫాస్ట్ మరియు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నం దుకు, పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కోసమే సరిపోవచ్చు అని తెలియజేశారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాపనకై మరియుఅన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల గురించి గత బడ్జెట్లో ప్రస్తావించి గత సంవత్సరం 7.57% శాతం కేటాయించగా, ఈ సంవత్సరం 8.22% శాతం కేటాయించారు.
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు గురించి గానీ, అదనపు నిధుల కేటాయింపు గురించి గానీ బడ్జెట్ లో మాట మాత్రంగానైనా ప్రస్తావించకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేసింది. ఇప్పటికే పిఆర్సీ అమలు 33 నెలలు ఆలస్యమైంది. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో మంచి పిఆర్సీ అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం విచారకరం. పెండింగ్ డిఎలు, పెండింగ్ బిల్లులు, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావనే లేదు. వీటికి సంబంధించి బడ్జెట్లో సపరేట్ ఒక పద్దు ఉంటే బాగుండేదని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పిఆర్సీ, పెండింగ్ బిల్లులు, బకాయిల గురించి కూడా స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.



# అమ్మ లేదు.. నాన్నని రక్షించండి

- తండ్రి ప్రాణాల కోసం శ్రీనాథ్ ఆక్రందన
- పక్షవాతంతో సిద్దిపేట హాస్పిటల్‌లో చికిత్స


**ముస్తాబాద్ (సిద్దిపేట జిల్లా), మార్చి 21 (జనంసాక్షి):**
ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పల్లటి రాజయ్యకు శుక్రవారం రాత్రి పక్షవాతం వచ్చింది. ప్రస్తుతం సిద్దిపేటలోని లోహిత్ సాయి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ కుటుంబం చాలా బీద స్థితిలో ఉంది. చేతిలో ఏమీ లేక దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. వీరికి 12 సంవత్సరాల కుమారుడు శ్రీనాథ్ ఉన్నాడు. గతంలో తల్లి, అక్క, అన్న అనారోగ్యంతో బాధపడి లక్షల రూపాయలు ఖర్చు చేసినా ప్రాణాలు కోల్పోయారు. మిగిలినది శ్రీనాథ్, తండ్రి రాజయ్య ఇద్దరే. ఇప్పుడు తండ్రికి కూడా పక్షవాతం రావడంతో శ్రీనాథ్ దిక్కుతోసని స్థితిలో పడ్డాడు. అనాధలా మిగిలిన శ్రీనాథ్ తన తండ్రి ప్రాణాలను కాపాడాలని దాతల సహాయం కోరుతున్నాడు. ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ శ్రీనాథ్ ఆక్రందన చేశాడు. సహాయం అందించాల్సిన **వివరాలు: ఫోన్‌పే నంబర్: 9618751687, పేరు: పల్లటి రాజయ్య.** మీకు తోచిన సహాయం అందించి ఈ బీద కుటుంబాన్ని, చిన్నారి శ్రీనాథ్‌ను ఆదుకోవాలని జనంసాక్షి పాఠకులందరినీ కోరుతున్నాం.

# బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

- 12 డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి
- తేజస్విని మృతిపై న్యాయం.. వైస్ ఛాన్సలర్ తొలగింపు డిమాండ్
- ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమ హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 22 (జనంసాక్షి):** బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను పరిష్కరించేందుకు వెళ్లిన ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బాసర ట్రిపుల్ ఐటీ మెయిన్ గేట్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా చేపట్టిన నిరసన కార్యక్రమం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సంకేతమని, అలాంటి ఉద్యమాలను అణచివేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని పేర్కొంది. వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్న బాసర ట్రిపుల్ ఐటీలో కనీస సదుపాయాలు కూడా లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్ఎఫ్ఐ ఆరోపించింది. ఇంజనీరింగ్ అకాడమిక్ ఇయర్ ముగియబోతున్నా ఇప్పటి వరకు ల్యాప్‌టాప్‌లు అందించకపోవడం ఘోర నిర్లక్ష్యమని, ల్యాప్‌టాప్‌లు లేకుండా సాంకేతిక విద్య ఎలా సాధ్యమని ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది. శివశక్తి మెస్ కాంట్రాక్ట్ కారణంగా నాణ్యత లేని ఆహారం అందుతోందని, వెంటనే ఆ కాంట్రాక్ట్ రద్దు చేసి పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేసింది. వైద్య సదుపాయాల లోపం ప్రాణాలను బలి తీసుకుంటో ందని, విద్యార్థిని తేజస్విని మరణానికి ఆ కారణమేనని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఆరోపించింది. పదివేల మంది విద్యార్థులు ఉన్న క్యాంపస్‌లో కొద్దిమంది వైద్య సిబ్బంది మాత్రమే ఉండటం అత్యంత దారుణమని పేర్కొంది. వెంటనే పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించి, ఎంబీబీఎస్ డాక్టర్లతో 24 గంటల వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేసింది. బాసర ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనను వెంటనే తొలగించాలని, నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. తేజస్విని మృతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుని, బాధ్యులపై కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరింది. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల 12 డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది.

# బడ్జెట్లో దివ్యాంగులకు స్థానం లేకపోవడం సిగ్గుచేటు : సుజాత సూర్యవంశీ



**బోధన్, మార్చి 21 (జనంసాక్షి) :** రేవంత్ సర్ దివ్యాంగులకు బడ్జెట్లో తానం కల్పించకపోవడం సిగ్గుచేటని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రేవంత్ సర్కార్ దివ్యాంగులకు బడ్జెట్లో స్థానం లేదన్నట్టుగా మాకు మొండి చేయి చూపించాడన్నారు ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్న మేనిఫెస్టోలో ఇచ్చినట్లుగా దివ్యాంగులకు 4 నుండి 6000 పెంచుతామని అదేవిధంగా వృద్ధులకు వితంతువులకు బీడీ కార్మికులకు చేత పెన్షన్ దారులకు 2000 నుండి 4000 పెంచుతామని చెప్పి అసెంబ్లీలో అభిషేయమే తీయలేదు ఈ విధంగా రేవంత్ సర్కార్ దివ్యాంగులకు వృద్ధులకు వితంతువులకు అన్యాయం చేశారు బ్యాక్లాగ్ పోస్ట్ ఇస్తామని ఇవ్వలేదు ఇంద్రమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ఇల్లు కట్టిస్తామని కూడా అది కూడా చేయలే పక్క రాష్ట్రం లాగా పదవి ఎక్కగానే చేస్తానని చెప్పి మోసం చేశాడు పక్క రాష్ట్రం వాళ్లకు బడ్జెట్ ఉంటుంది కానీ మన తెలంగాణలో దివ్యాంగులకు ఎటువంటి బడ్జెట్ ఉండదు ఎందుకు ఇంత అన్యాయం సర్కారు ఎక్కిన నుండి ఇప్పటివరకు ఇస్తానన్న పెన్షన్ కట్టి ఇవ్వాలని అదేవిధంగా దివ్యాంగులకు బస్సులో మహిళలకు ఏ విధంగా అయితే ఉచిత ప్రయాణం ఉందో మాకు కూడా కల్పించాలని బడ్జెట్లో మా దివ్యాంగులకు ఈ డిమాండ్లను పూర్తి చేస్తామని చెప్పకపోతే వికలాంగులకు పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దివ్యాంగులము అందరం రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని ప్రతి జిల్లాలో కలెక్టరేట్ ఆఫీస్‌ల ముట్టడి చేసి మా దివ్యాంగుల యొక్క హక్కును నిలుపుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అలా చేయకపోతే మా దివ్యాంగుల అందరం రోడ్డుపై మా యొక్క నిరాహార దీక్షలు చేపడుతామని సర్కార్ దిగివచ్చే వరకు మేము వదలమని రేవంత్ సర్కార్‌ను హెచ్చరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 మార్చి 2026

# పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాల నిర్వహణ

- చీప్ లిక్కర్ నుంచి అన్ని బ్రాండ్ల అమ్మకాలు
- నిత్యం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు



**గంభీరావుపేట మార్చి 21 (జనంసాక్షి) :** పట్టణాలు పల్లెలు అన్న తేడా లేకుండా బెల్ట్ షాపుల్లో మందుతో పాటు చుక్క.. ముక్క.. కిక్కు.. పల్లెల్లో నేడు ట్రెండ్‌గా మారిపోయింది. వేకువజాము మొదలు.. అర్ధరాత్రి వరకు.. చీప్ లిక్కర్ నుంచి కాస్లీ మందు వరకు.. ఏ బ్రాండ్ కావాలన్నా.. కేరాఫ్ బెల్ట్ షాపులుగా పరిస్థితి తయారైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారు, పేద, సామాన్య మందుబాబుల 'బెల్ట్' తీస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. ప్రతి గ్రామంలో గల్లీకొక దుకాణం ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వం, అధికారుల నిఘా లేకపోవడంతో బెల్ట్ దుకాణాల దందా జోరుగా సాగుతున్నది. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ విమర్శలు వస్తున్నాయి.

# రెవిన్యూ రికవరీ ఆక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు

### మున్సిపల్ కమిషనర్ (అదనపు కలెక్టర్) అరుణ శ్రీ

**గోదావరిఖని, జనంసాక్షి :** ఆస్తి పన్ను చెల్లించని బడా బకాయదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బడా బకాయదారుల జాబితా తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కు సమర్పించినట్లు ఆమె తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం సదరు ఆస్తులను జప్తు చేసి వేలం వేయడం జరు గుతుందని ఆమె తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో బకాయలు పూడ్చుకోవడం జరుగుతుందని అన్నారు. చివరి హెచ్చరికగా రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని వారి పై ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కాగా శని , ఆది వారాలు సెలవు దినాలైనప్పటికీ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు యధాతథంగా పని చేస్తాయని ఆమె తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బకాయదారులు ఇంటి పన్ను , నల్లా బిల్లు , ట్రేడ్ లైసెన్స్ బకాయలు వెంటనే చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని ఆమె కోరారు.



### ఉపాధి హామీ కూలీలకు రోజు వారి

# కూలి 600 రూపాయలు నిర్ణయించాలి

### సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్

**జమ్మికుంట, మార్చి 21 (జనం సాక్షి):** జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో ఉపాధి కార్మికుల పని ప్రదేశాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొప్పుల శంకర్ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కొప్పుల శంకర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతంలో ఉన్న నిరుపేద వ్యవసాయ కూలీలకు గ్యారంటీ పని భద్రత అయినటువంటి ఉపాధిహామీ చట్టాన్ని ప్రతి సంవత్సరం బడ్జెట్ లో కోతలు పెట్టి ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయని కరపత్రాలు పంపిణీ చేసి కార్మికులకు వివరించారు. అలాగే మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి విబిజి రాంజీ అనే పేరుతో ఇరువై ఐదు రోజులు పని దినాలు పెంచినట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటుందని,కానీ అంతర్గతంగా నిధులు కోత పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు.

గతంలో కేంద్రమే 90% నిధులు చెల్లించేదని,దానిని తగ్గించి 60% శాతానికి కుదించిందని రాష్ట్ర ప్రభుత్వాల మీద 40% చెల్లించాలని భారం మోపడం వెనుక రానున్న రోజుల్లో ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఒకపక్క పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో గ్రామీణ ప్రాంత పేద ప్రజల కొనుగోలు చేసే శక్తి క్షీణించిందని,మరోపక్క పేదరికం పెరిగిపోతుందని,ఆర్థిక అసమానతలు ఏర్పడ్డాయని,దానికి తగ్గట్లుగా పని దినాలు పెంచి కనీస కూలీ 600ల కు పెంచాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు కన్నాం సదానందం,గ్రామ కమిటీ సభ్యులు వేముల సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు రవాణాలో జీడికే.1 సిహెచ్‌పి రికార్డ్‌ల పరంపర

### సింగరేణి ఆర్ జీవన్ జిఎం లలిత్ కుమార్



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జి1 ఏరియా జిడికే1 సిహెచ్‌పి బొగ్గు రవాణాలో అధికారులు, ఉద్యోగులు సమిష్టి కృషితో నూతన ఒరవడి దిశగా రికార్డుల పరంపర సాధిస్తున్నారు. ఆర్జి1 సిహెచ్ పి ప్రారంభం నాటి నుండి 2015-16 ఆర్థిక సంవత్సరం లో చేసిన 1322 బొగ్గు రేక్ ల రవాణా 51.84 లక్షల టన్నులు ను అధిగమించి, ఈ 2025-26 ఆర్థిక సంవత్సరంలో పది రోజుల ముందుగానే 1323 రేక్ ల ద్వారా 51.92 లక్షలు అధిగమించి రవాణా చేయడం విశేషం. ఈ ఆర్థిక సంవత్సర ముగింపు లో 1375 రెక్స్ చేసి 122% వృద్ధిరేటు తో పని చేస్తుండటం గమనార్హం.
సంస్థ విధించిన ఈ ఆర్థిక సంవత్సర కోల్ లింకేజి బొగ్గు రవాణా 30.57 లక్షల టన్నుల టార్గెట్ ను 4 నెలలు ముందు గా నవంబర్ 2025 నెల లో సాధించడమే గాక నెలవారీ 135 రేక్ ల రికార్డు స్థాయి రవాణా ను డిసెంబర్, జనవరి నెలలలో కూడా అందుకోవడం విశేషం.సాధారణం గా ఒక రేక్ బొగ్గు రవాణా చేయుటకు కు 3గంటల సమయం పడితే, జీడికే.1 సిహెచ్ పిలో సుమారు 2 గంటల లోపు రేక్ రవాణా చేయడం ఏరియా సిహెచ్ పి అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి కి నిదర్శనం. ఇంతే గాక ఎప్పటి కప్పుడు డైరెక్టర్ ఆపరేషన్స్. డైరెక్టర్ ఈడి కోల్ మూవ్మెంట్, మార్కెటింగ్ అధికారులు, ఏరియా జిఎం అధికారుల సమీక్షలో సలహాలు సూచనలు పాటిస్తూ, కార్పొరేట్ ఉన్నతాధికారుల ప్రోత్సాహం, రైల్వే శాఖతో సమన్వయంతో సాధించడం ఈ రికార్డుల పరంపర కు మూల స్థంభాలు.అన్ని ఏరియాల లోనీ గనుల నుండి బొగ్గు రవాణా సహకారాన్ని సమీక్షించుకుంటూ, రైల్వే రేక్‌ల ద్వారా ఎటువంటి ఆలస్యం లేకుండా బొగ్గును నింపి పంపడంతో ఆలస్య అపరాధ రుసుము చెల్లింపులు కూడా పూర్తిగా తగ్గిపోవడం వీరి కృషికి, సమన్వయంకు నిదర్శనం. ఇదే స్ఫూర్తి తో సమిష్టి కృషితో రక్షణ, నాణ్యతలను పాటిస్తూ సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని ఈ బొగ్గు రవాణాలో కృషిచేస్తున్న ప్రతీ సింగరేణీయనికి ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ శ్రీ రాంమోహన్, సిహెచ్‌పి పైడేశ్వర్, ఏరియా, అన్ని గనుల అధికారులు, ఉద్యోగుల కృషిని ఆర్జి.1 జియం లలిత్ కుమార్ అభినందించారు.

### సింగరేణి ఆర్జీజీ-1 ఏరియా జీడీకే 1,3 ఇంక్లైన్లో

# కార్మికుల సమస్యలపై వినతిపత్రం




**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి ఆర్జీజీ-1 ఏరియా జీడీకే 1 అండ్ 3 ఇంక్లైన్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గని మేనేజర్ కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు లాకర్స్ రూమ్ కట్టించాలి.కోల్ కట్టర్స్, సపోర్ట్మన్లకు అవసరమైన డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్ తెప్పించాలి.కార్మికులకు అసరమైన క్వాలిటీ హ్యాండ్ బ్లౌజెస్, మాస్కు, గగుల్స్ తెప్పించాలి.సీనియర్ కార్మికులకు వెస్టన్ టాయ్లెట్ కట్టించాలి. అలాగే వాష్ రూమ్ ఫ్లోర్, డోర్స్ రిపేర్ చేయించి, స్కావెంజర్ను నియమించాలి.సర్దార్లకు రెండు డిస్ట్రిక్లు చూడడం వల్ల సేఫ్టీ వాయిలెన్స్ జరిగే ప్రమాదం ఉంది. కావున ఒకటే డిస్ట్రిక్ అలాట్ చేయగలరు.మహిళా కార్మికులను సాండ్ బంకర్-2 దగ్గర వర్క్ అలాట్మెంట్ చేసినప్పుడు ట్రాన్స్పోర్టు వెహికల్లో పంపించగలరు.ఎస్ఏఎల్ వెహికిల్లో ఫైర్ ఎస్టింగ్ యూజర్ అరెంజ్ చేయగలరు. ఎస్ఏఎల్ మెయింటనెన్స్ కూడా పెట్టగలరు. అలాగే ఎస్ఏఎల్ యాక్టింగ్స్ ఉన్న వారికి ప్రమోషన్స్ ఇవ్వగలరు.సీమ్ లో త్రాగునీరు డిస్ట్రిక్ లోపల ఏర్పాటు చేయాలి. వెంటిలేషన్ పెంచగలరు.సర్వే వాళ్లకి రూమ్ లేక చాలా ఇబ్బంది పడుతున్నారు.రిటర్న్ ఎయిర్ ప్రదేశాల్లో పని చేయు సందర్భంలో సర్దార్ను అలాట్ చేయగలరు.బిట్ షార్ప్ నర్కు అప్రాన్ బ్లౌజెస్, మాస్క్, స్పెట్స్ ఇవ్వాలి.3సీమ్ 48వ లెవల్ 1డిప్లో ట్రాన్స్విచ్ 6నెలల నుంచి బైపాస్లో ఉన్నది, దాన్ని సరి చేసి రిమోట్లో పెట్టగలరు. ఆర్ ఓ ప్లాంట్, ఫ్రిడ్జు నిత్యం నిర్వహణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రాజారెడ్డి ( రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) తోట నరహరిరావు, శంకర్ 2ఇంక్లైన్ ఫిట్స్ సెక్రెటరీ, పెద్దపల్లి శశి కిరణ్ జీడికే 1 అండ్ 3 పిట్ సెక్రెటరీ, ఈదుల సాగర్ అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ, విప్రో, సిరికొండ శ్రావణ్ కుమార్, దశరథ్ రెడ్డి, అజయ్, ప్రవీణ్, వర్ణాల సాగర్, రాజు, వినోద్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వాంగ సుందరంగా వేములవాడ పట్టణ అభివృద్ధి

- నూతన విద్యుత్ స్తంభాల పనులను పరిశీలించిన విప్
- రోడ్డు విస్తరణతో పాటు పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత
- రంజాన్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన ఆది శ్రీనివాస్

**వేములవాడ, మార్చి 21 (జనం సాక్షి):** సర్వాంగ సుందరంగా వేములవాడ పట్టణాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని బ్రిడ్జి నుండి ఆలయం వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సుమారు 46 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా వేములవాడ పట్టణ ప్రజల చిరకాల కోరికగా ఉన్న రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణ నేపథ్యంలో గతంలో రోడ్డు మధ్యలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి అత్యాధునికమైన నూతన స్తంభాలను మంజూరు చేస్తున్నామని, దీనివల్ల భవిష్యత్తులో విద్యుత్ లైన్ల నిర్వహణ సులభతరం కావడమే కాకుండా పట్టణ సుందరీకరణ పెరుగుతుందని అన్నారు. త్వరితగతిన రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేస్తామని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు.
అదే రోజు వేములవాడ పట్టణంలో ఘనంగా రంజాన్ వేడుకలు జరిగాయి. ఈద్గా వద్ద నిర్వహించిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని అన్నారు. రంజాన్ మాసం త్యాగం, సహనం, దయ, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు.



నెలరోజుల పాటు ముస్లిం సోదరులు కఠోర ఉపవాస దీక్షలు చేసి కోరిన కోర్కెలు పలించాలని, అల్లా ఆశీస్సులతో సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతు వర్గంతో పాటు ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. వేములవాడ పట్టణంలో ముస్లిం సోదరులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న షాదీ ఖానా నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేశామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు.
దేశంలో ఎక్కడా లేనివిధంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీతో పాటు జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. రంజాన్ పండగ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఆది శ్రీనివాస్ ప్రజలందరికీ సంతోషం, సమృద్ధి కలగాలని కోరారు.

# గునుకుల కొండాపూర్‌లో సివిల్ సప్లై అధికారులు దాడులు

### 32 క్వింటాళ్ల రేషన్ (పిడిఎస్) బియ్యం పట్టివేత

**గన్నేరువరం, మార్చి 21 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ శివారులో గురువారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా తరలిస్తున్న 32 క్వింటాళ్ల రేషన్ (పిడిఎస్) బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఖాసీంపేట గ్రామానికి చెందిన బొజ్జ రాజు బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి రాజును అదుపులోకి తీసుకున్నారు. సివిల్ సప్లై అధికారి బంగారం. సురేందర్ నయబ్ తాసిల్దార్ ఫిర్యాదు మేరకు బొజ్జ రాజు పై కేసు నమోదు చేసినట్లు గన్నేరువరం ఎస్సై జి. నరేందర్ రెడ్డి తెలిపారు.

# బిజిగిరి షరీఫ్ దర్గాలో ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

### దర్గా కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్

**జమ్మికుంట, మార్చి 21 (జనంసాక్షి):**
ఆత్మపరిశుద్ధి, పాపప్రక్షాళనం, దానధర్మాచరణము, విశ్వ మానవతా ప్రబోధము, స్నేహ సౌభాతృత్వం,శాంతి సామరస్యాలకు ప్రతీకగా జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ గ్రామంలోని దర్గాలో వందలాది మంది ముస్లిం సోదరులు శనివారం నాడు ఆనందోత్సాహల మధ్య రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారని దర్గా అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ నెలసరి రోజాలను కఠిన నియామాలతో అత్యంత భక్తి శ్రద్దలతో పాటించిన ముస్లింలు శుక్రవారం నాటి రాత్రి షవ్వాల్ నెల చంద్ర దర్శనంతో రోజాలను (ఉపవాసాలను) విరమించి రంజాన్ పండుగను సాంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారన్నారు. పండుగా రోజున తయారుచేసిన తీపి వంటకం అయిన షిర్ ఖుర్మాను స్వీకరించి,నూతన వస్త్రాలు ధరించి స్థానిక ఈద్గా మైదానంలో ఈద్-ఉల్-ఫితర్ పండుగ ప్రత్యేక సామూహిక నమాజ్ ప్రార్ధనలు నిర్వహించారన్నారు. అనంతరం స్థానిక ఈద్గాల వద్ద మత గురువులు మౌలానా మొహమ్మద్ నౌమాన్ హష్మీ చదివి వినిపించిన ఖురాన్ లోని సూక్తులను అల్లాహ్ ఆదేశాలను ముస్లిం సోదరులు ఆలకించారన్నారు. దాన గుణానికి నిదర్శనంగా పేదలకు ఫిత్ర వస్త్ర దానం తో పాటు షీర్ ఖుర్మాను పంచారన్నారు. ఇతర మతాలకు చెందిన తమ మిత్రులకు ఇరుగుపొరుగు వారితో పరస్పరం అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారన్నారు.ఈ పండుగ సందర్భంగా పెద్దలు పిల్లలకు ఈది (నగదు రూపంలో బహుమానం) ఇవ్వడం సాంప్రదాయం



అన్నారు. ఈ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఈద్ ముబారక్ తెలుపుతూ సందడిగా కనిపించారన్నారు. అలాగే ఇటీవల ఎన్నికైన బిజీగిర్ షరీఫ్ గ్రామ 9వ వార్డు సభ్యులు మొహమ్మద్ నయీముద్దీన్ కి ఈద్గా వద్ద శాలువాతో సన్మానం చేసామన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండలం మాజీ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అంకుషావలి,సయ్యద్ సమీర్,ఈద్గా,దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్,దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌఫీక్ హుస్సేన్,దర్గా కమిటీ కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయిముద్దీన్,సభ్యులు అహమ్మద్, లతీఫ్, హుస్సేన్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ బడ్జెట్

# రాష్ట్ర ప్రగతికి దిక్సూచి

- విధ్వంసం నుండి వికాసం వైపు బడ్జెట్
- అన్ని వర్గాలకు సమన్యాయం.. ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యత
- హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ హర్షం



**హుజురాబాద్, మార్చి 21 (జనం సాక్షి):** శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా, పదేళ్ల విధ్వంసం తర్వాత వికాసం కలిగించేలా ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఆరు గ్యారంటీల అమలుకు ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్ రూపొందించారని, కొత్తగా కుటుంబానికి జీవిత బీమా అందిస్తున్నామని, ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రణవ్ తెలిపారు. ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ సుపరిపాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా బడ్జెట్ రూపొందించబడిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 22న ఆదివారం నుండి రైతు భరోసా నిధులు విడుదల చేస్తున్నామని ప్రణవ్ పేర్కొన్నారు. బడ్జెట్ రాష్ట్ర ప్రగతికి దిక్సూచిగా నిలుస్తుంద ని, ప్రజల ఆశలకు తగినట్లు అమలు చేస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హుజురాబాద్ నియోజకవర్గంలో బడ్జెట్ అమలుతో మరింత అభివృద్ధి, సంక్షేమం కనిపిస్తాయని, ప్రజలు ఈ బడ్జెట్‌ను స్వాగతిస్తున్నారని ప్రణవ్ తెలిపారు.

# విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలి

### ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ డిమాండ్




**కరీంనగర్ టౌన్ మార్చి 21 ( జనం సాక్షి) :** రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీలు డిమాండ్ చేస్తూ తెలంగాణ చౌరస్తా వద్ద రాష్ట్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసి నిరసన తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని విమర్శించారు. అధికారంలోకి వస్తే విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించి, రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగ యువతకు భృతి అందిస్తామని హామీ ఇచ్చినా, అవి అమలులోకి రాకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 9,000 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, వాటిపై బడ్జెట్‌లో సరైన ప్రస్తావన లేదని తెలిపారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా, వ్యక్తిగత విమర్శలకే పరిమితమవుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్,నరేష్ పటేల్, ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు భోగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, మానస, రక్షక్, సన్నీ, నరేష్, నాగేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, సహాయ కార్యదర్శులు అశోక్, అరవింద్, జిల్లా కమిటీ సభ్యులు సోయం రమేష్, నవీన్, సీనా, సిరి, శ్రీకాంత్, శ్రీనాథ్, శశిధర్ పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు చర్యలేవి

- రోడ్లపై ఇదేచ్ఛగా కేజీవిల్స్‌తో తిరుగుతున్న ట్రాక్టర్లు
- కోట్ల రూపాయల ప్రజాధనంతో రోడ్ల నిర్మాణం
- ఇందుర్తి, ముదిమాణిక్యంలో కొత్త రోడ్లను ధ్వంసం చేస్తున్న కేజీ వీల్స్
- చోద్యం చూస్తున్న ఆర్ అండ్ బి అధికారులు, సర్పంచులు

**చిగురుమామిడి 21 (జనంసాక్షి):**
కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్లను కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు దారుణంగా ధ్వంసం చేస్తున్నాయి.వ్యవసాయ పనుల కోసం వాడే ఈ కేజీవిజిల్స్ కు ఉండే ఇనుప పట్టీలు తారు రోడ్ల ఉపరితలాన్ని ఛిద్రం చేస్తూ రోడ్లను ప్రయాణానికి పనికిరాకుండా చేస్తున్నాయి.ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూసిన ఇందుర్తి, గాగిరెడ్డిపల్లె, ముదిమాణిక్యం, నవాబుపేట,తదితర గ్రామాల్లోని ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి రోడ్లు వేస్తే సంవత్సరం తిరగకుండానే రోడ్లను ధ్వంసం చేస్తుంటే తమకు ఎందుకులే అనుకుంటూ ఆయా గ్రామాల సర్పంచులు,ఆర్ అండ్ బి అధికారులు చోద్యం చూస్తున్నారు.
అదనపు శ్రమ,ఖర్చు తగ్గుతుందన్న కొందరు ట్రాక్టరు యజమానులు, రైతుల స్వార్థానికి కోట్లాది రూపాయల విలువైన రహదారులు ధ్వంసమవుతున్నాయి.ఎవరూ పట్టించుకోవడం లేదన్న ధీమాతో ఇష్టారీతిన రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లను పరుగుపెట్టిస్తుండడంతో రహదారులు దారుణంగా దెబ్బతింటున్నాయి.వ్యవసాయ పనుల్లో భాగంగా వరినాట్ల సీజన్‌లో ఇందు కోసం ట్రాక్టర్ల చక్రాలు తీసి వేసి కేజ్ వీల్స్ బిగించి దున్నుతారు.దీనివల్ల ట్రాక్టర్లు బురదలో ఇరుక్కొనే అవకాశం ఉండదు.ఈ చక్రాలను పొలంలో బిగించుకొని దున్నడం పూర్తయ్యాక విప్పివేసి టైర్లు బిగించిన తర్వాతే రోడ్లపైకి రావాలి.అయితే ట్రాక్టర్ల యజమానులు ఈ కాస్త శ్రమ ఎందుకన్న



భావంతో ఇంటి వద్దనే కేజ్ వీల్స్ బిగించుకుని పొలాలకు వెళుతున్నారు. దీంతో ఇనుప చక్రాల ధాటికి తారురోడ్లపై గారెలు పడుతున్నాయి. ఈ కేజ్ వీల్స్‌తో ట్రాక్టరు ఒక్కసారి ప్రయాణిస్తే పదేళ్లు ఉండాల్సిన రహదారి రెండేళ్లకే దెబ్బతినిపోతుందని వాహనదారులు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో వందలాది ట్రాక్టర్లు కేజీ వీల్స్ తో ఈ రహదారుల్లో ప్రయాణిస్తున్నాయి.ఎవరైనా అడిగినా సమాధానం చెప్పే పరిస్థితి లేదు.పట్టించుకోవాల్సిన రవాణా శాఖ,రహదారుల శాఖ, పోలీసులు ఈ వాహనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేజ్ వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే వాహనాన్ని సీజ్‌చేసి జరిమానా విధించే అవకాశం ఉన్నప్పటికీ, ఎవ్వరూ పట్టించుకోరన్న ధీమాతో ట్రాక్టర్లు కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రహదారులు దెబ్బతిని ప్రయాణానికి పనికి రాకుండా పోతున్నాయి.మరమ్మతులు చేసినా మళ్లీ యథా పరిస్థితే. వీటి దెబ్బకు రోడ్డు మొత్తం నాశనమయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.రవాణా శాఖ అధికారులతో పాటు రహదారుల శాఖ, పోలీసులు సమన్వయంగా స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు ప్రజలు కోరుతున్నారు.

# భార్య మరణం తట్టుకోలేక ఐదు రోజులకే ఎస్ఐ ఆత్మహత్య

### వరస విషాద ఘటనలు.. అనాథలైన ఇద్దరు చిన్నారులు

**కరీంనగర్ టౌన్, మార్చి 21 (జనం సాక్షి):**
మనస్పర్థల నేపథ్యంలో భార్య ఆత్మహత్య.. భర్త కూడా ఉరి వేసుకున్నాడు కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఇల్లందకుంట మండలం సీతపేట గ్రామంలో శనివారం ఓ దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్య మరణించిన ఐదు రోజులకే కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ తన అత్తగారింట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇల్లందకుంట మండలం సీతపేట గ్రామానికి చెందిన తెల్ల దివ్యతో 2016లో వివాహం జరిగింది. ఆయన పలు స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం కరీంనగర్ టూ టౌన్‌లో ఎస్ఐగా కొనసాగుతున్నాడు. సజావుగా సాగుతున్న వీరి సంసారంలో భార్య-భర్త మధ్య ఏమాత్రం మనస్పర్థలు ఉన్నాయో తెలియదు కానీ, మంగళవారం దివ్య గన్నేరు పప్పు తిని ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది.
దీంతో ఆమె మృతదేహాన్ని తల్లిగారి ఊరైన సీతపేటకు తీసుకొచ్చి అక్కడే అంత్యక్రియలు నిర్వహించే క్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చంద్రశేఖర్ వల్లనే దివ్య మృతి చెందిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.





ఇదిలా ఉండగా గత ఐదు రోజుల క్రితం భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ శనివారం ఐదో రోజు కార్యక్రమానికి వెళ్లి దుస్తులు మార్చుకుంటానని గదిలోకి వెళ్లిన వెంటనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, బంధువులు హుటాహుటిన జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం ఎస్ఐ మృతదేహాన్ని సీతపేటకు తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. వీరికి అశ్వద్ధామ (8), అభిమన్యు (5) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో ఇద్దరు చిన్నారులు అనాథులయ్యారు. భార్య ఆత్మహత్య ఘటన మరువక ముందే భర్త కూడా ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ వరస విషాద ఘటనలు గ్రామంలోనూ, పోలీసు వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
22 మార్చి 2026

# కుళ్లిన గుడ్లతో ఎగ్‌ఫఫ్స్

- కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు
- పాతపబస్తీ కుల్సుంపురాలో అధికారుల దాడి
- అక్రమంగా నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్



**హైదరాబాద్, మార్చి 21 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని కుల్సుంపురా ప్రాంతంలో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. కుళ్లిపోయిన పదార్థాలతో సమోసాలు, పఫ్స్ తయారు చేసి నగరంలోని ప్రముఖ హోటళ్లకు సరఫరా చేస్తున్న నిందితుడిని అధికారులు అరెస్ట్ చేశారు. అబ్దుల్ అనే వ్యక్తి అపరిశుభ్ర వాతావరణంలో నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. ముఖ్యంగా కుళ్లిపోయిన గుడ్లతో ఎగ్ పఫ్స్ తయారు చేసి హోటళ్లకు పంపిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయం తెలిసిన వెంటనే అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పెద్ద మొత్తంలో పాడైన, నాసిరకం ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఊఈం÷ అధికారులు కేసు నమోదు చేసి అబ్దుల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనతో కుల్సుంపురా ప్రాంతంలో తయారవుతున్న ఫుడ్ ఐటమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండలని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోను హైదరాబాద్ పోలీసులు సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారవుతున్న ఆహారం కనపడుతుంది. హైదరాబాద్ ఫుడ్ అడల్టేష్రన్ సర్వేలేన్స్ టీం, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కులసుంపుర పోలీస్ సమన్వయంతో ఈ దాడి చేపట్టారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో 73 ఏళ్ల అబ్దుల్ రషీద్ అనే వ్యక్తి ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా సమోసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్నట్లు బయటపడింది. అతనికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్ ఏదీ లేకపోవడం గమనార్హం. దర్యాప్తులో భాగంగా కుళ్లిపోయిన గుడ్లు, పలుమార్లు వాడిన వంటనూనె వంటి నాసిరకం పదార్థాలతో ఆహారం తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ యూనిట్‌లో అపరిశుభ్ర పరిస్థితుల్లో సమోసాలు, ఇతర ఫుడ్ ఐటమ్స్ తయారు చేసి నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తేలింది. దాడి సమయంలో సుమారు రూ.5 లక్షల విలువైన నాసిరకం ఆహార పదార్థాలు, ముడి సరుకులు, యంత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వివిధ రకాల సమోసాలు, మైదా, స్వీట్ కార్న్ వంటి ముడి పదార్థాలు కూడా ఉన్నాయి. నిందితుడు అబ్దుల్ రషీద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీ పోలీసులు ఆహార కల్తీపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని సూచించారు. హోటళ్లకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యతపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# సర్పంచుల ఫీడ్‌బ్యాక్‌కు అధిక ప్రాధాన్యత

- మంత్రి సీతక్క ఆదేశాలతో సర్పంచ్‌ల ఫీడ్‌బ్యాక్ తీసుకున్న మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయం
- సర్పంచులు గుర్తించిన తాగు నీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశాలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయం నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల సర్పంచులతో నేరుగా అనుసంధానం చేపట్టి తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర ఫీడ్‌బ్యాక్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పది రోజులుగా ఫోన్ ద్వారా సర్పంచులతో సంప్రదింపులు జరిపి, మొత్తం 12,728 గ్రామ పంచాయతీలలో 12,457 మంది సర్పంచుల అభిప్రాయాలను సేకరించారు. తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, ఓవర్ హెడ్ ట్యాంకుల క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత, పైపులైన్ లీకేజీలు, పంపుల పనితీరు, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్లు, టోల్ ఫ్రీ నెంబర్ 1916పై అవగాహన తదితర 16 కీలక అంశాలపై వివరాలు సేకరించారు. దీనిపై మంత్రి సీతక్క శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్పంచ్‌ల అభిప్రాయ సేకరణ వివరాలను తెలుసుకున్నారు.

ఈ అభిప్రాయ సేకరణలో అధిక శాతం సర్పంచులు తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేయడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, “గ్రామస్థాయిలో సర్పంచ్‌ల అభిప్రాయమే ప్రభుత్వానికి అసలైన మార్గదర్శకం. వారి సూచనల ఆధారంగా మిషన్ భగీరథ సేవలను మరింత మెరుగుపరుస్తాం. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడం మా ప్రధాన లక్ష్యం” అని తెలిపారు. సర్పంచులు గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిషన్ భగీరథ అధికారులు గ్రామాలకు వెళ్లి పరిశీలించి, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 2026 ఏప్రిల్ 1 నుండి 15 లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మిషన్ భగీరథ వ్యవస్థ లేని మారుమూల గ్రామాల్లో ప్రజల అవసరాల మేరకు ఓపెన్ వెల్స్ తవ్వించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా వర్షాకాలానికి ముందే చెక్‌డ్యాంలు నిర్మించాలని మంత్రి సూచించారు. “స్థానిక నీటి వనరులను బలోపేతం చేయడం ద్వారా దీర్ఘకాలికంగా నీటి లభ్యత పెరుగుతుంది” అని పేర్కొన్నారు. తాగునీటి సమస్యలపై ఎవరైనా టోల్ ఫ్రీ నెంబర్ 1916కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గత వేసవిలో ఎలాంటి తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నట్లే, ఈ వేసవిలో కూడా మిషన్ భగీరథ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అటవీ ప్రాంతాలు, ఆదివాసీ గూడాలు, లంబాడీ తాండాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వార్తా పత్రికలు, సోషల్ మీడియాలో తాగునీటి సరఫరాపై వచ్చే ప్రతి సమాచారం పట్ల వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్క మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు.

# ఖమ్మం జిల్లాలో రెండు అగ్నిప్రమాదాలు

**భారీగా ఆస్తినష్టం.. సకాలంలో స్పందించిన అధికారులు**



**ఖమ్మం, మార్చి21 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లాలో రెండు వేర్వేరు అగ్నిప్రమాద ఘటనలు జరిగాయి. ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం నగరంలోని రోటరీ నగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మరో ఘటనలో మధిర మండలం ఆత్కూర్ వద్ద శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగింది. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ ప్రాంతంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షోరూమ్‌లో ఉన్న పలు ఎలక్ట్రిక్ బైకులు మంటలకు ఆహుతయ్యాయి. బైకుల బ్యాటరీల కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో దట్టమైన పొగ అలుముకుంది. ఈ ఘటనపై పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు స్థానికులు సమాచారం అందజేశారు. ఫైర్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. చార్జింగ్ పెట్టిన సమయంలో లేదా షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని మధిర మండలం, ఆత్కూర్ సమీప ప్రాంతంలో గల శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులు మంటల్లో చిక్కుకున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కోల్డ్ స్టోరేజీలో ఉండే ఇన్సులేషన్ మెటీరియల్ కారణంగా మంటలను ఆర్పడం సిబ్బందికి సవాలుగా మారింది. ఖమ్మం జిల్లాలో జరిగిన ఈ రెండు అగ్నిప్రమాదాలు భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చినట్లు తెలుస్తోంది. విద్యుత్ ఉపకరణాల వినియోగంలో అజాగ్రత్త వహించవద్దని అధికారులు సూచించారు. ఈ రెండు ఘటనల్లో ప్రాణనష్టం సంభవించకపోయినా, భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. ఈ రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# యువతిపై కత్తితో ప్రేమికుడు దాడి

- తను కోరుకున్న యువతి మరొకరితో పెళ్లి
- మియాపూర్‌లో దారుణం!

**హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) :** మియాపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. తనని కాదని వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుందన్న కోపంతో ఓ యువకుడు మహిళపై కత్తితో దాడి చేశాడు. తండ్రి, స్నేహితుడితో మహిళ ఇంటికి వెళ్లి మరీ ఈ ఘోరానికి ఒడిగట్టాడు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన 25 ఏళ్ల నూకరత్నం అనే మహిళ కొన్నేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. ప్రస్తుతం తన ఇద్దరు కూతుళ్లతో కలిసి మియాపూర్‌లోని రెడ్డి కాలనీలో నివసిస్తోంది. స్థానికంగా హౌస్ కీపింగ్ పని చేస్తూ జీవిస్తోంది. కొంత కాలం క్రితం ఆమెకు ప్రసాద్ అనే వ్యక్తితో పరిచయం అయింది. ఇద్దరూ ఫిబ్రవరి 20వ తేదీన పెళ్లి చేసుకున్నారు. అయితే, వీరి పెళ్లి ఆలీషా అలియాస్ పాండు అనే యువకుడికి నచ్చలేదు. నూకరత్నం హౌస్ కీపింగ్ చేస్తున్న చోట పాండు వంటవాడిగా పని చేస్తున్నాడు. అతడు నూకరత్నంను ఇష్టపడ్డాడు. పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నాడు. ఇంతలోనే నూకరత్నం.. ప్రసాద్‌ను పెళ్లి చేసుకుంది. దీంతో పాండు తట్టుకోలేకపోయాడు. ఈ నెల 19వ తేదీన తండ్రి లాలూ, స్నేహితుడు జాన్‌లతో కలిసి నూకరత్నం ఇంటికి వెళ్లాడు. ఆమెను తనతో పాటు రమ్మని అడిగాడు. ఇందుకు నూకరత్నం ఒప్పుకోలేదు. ఆమె తన మాట వినకపోవటంతో పాండు ఆగ్రహానికి గురయ్యాడు. వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. పాండు కత్తి దాడిలో నూకరత్నం తీవ్రంగా గాయపడింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే ఆమెను గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడ్డ పాండుతో పాటు అతడి తండ్రి లాలూను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# తమిళనాడు, కేరళను ఆనుకుని ఉపరిత ఆవర్తనం

- 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం
- వాతావరణ కేంద్రం వెల్లడి

**చెన్నై, మార్చి21 (జనంసాక్షి) :** మన్నార్ గల్ఫ్ నుంచి దక్షిణ కర్ణాటక అంతర్గత ప్రాంతాలు, తమిళనాడు, పరిసరాల్లో కేరళ ఆనుకొని ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 వరకు ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు జిల్లాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఈ నెల 24వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి భారీవర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

# తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- హైదరాబాద్ ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్, మార్చి21 (జనంసాక్షి) :** దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక, హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవు తున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్- ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరా లం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారత దేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

# కోతుల దాడిలో వృద్ధురాలు మృతి

**కాకినాడ, మార్చి 21 (జనంసాక్షి) :** కోతుల మూక దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామ శివారులో జీడిమామిడి తోటను ఆనుకుని ఉన్న ఇంట్లో దానబోయిన చిన్నబుల్లి (68) నివాసం ఉంటున్నారు. గేదెకు నీరు పెట్టేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. 20కి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి దాడి చేయడంతో తప్పించుకునే వీలు లేకుండా పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. చిన్నబుల్లి తనకు ఉన్న 3 ఎకరాల తోటలో తన కుమార్తె కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటోంది. ఈ ప్రాంతంలో కోతుల దాడిలో గాయపడిన ఘటనలు చాలా జరిగాయని.. అయితే ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారని గ్రామస్థులు వాపోయారు.

# గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతి

- ప్రమాదంలో చనిపోయాడన్న పోలీసులు
- హత్య చేశారంటూ స్థానికుల ఆందోళన
- జాతీయ రహదారి దిగ్బంధనం...ఉద్రిక్తత



**లక్నో, మార్చి21 (జనంసాక్షి) :** ఉత్తరప్రదేశ్‌లోని మథురలో శనివారంనాడు తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. గో సంరక్షకుడు చంద్రశేఖర్ మృతిని ఖండిస్తూ స్థానికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. గోవుల స్మగ్లింగ్‌ను అనుమానించి ఒక ట్రక్కును వెంబడిస్తుండగా అది ఆయన బైకును ఢీకొట్టిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో ఫర్సా వాలే బాబాగా పేరున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో కోసి కలాన్ ఏరియాలో జాతీయ రహదారిని గో సంరక్షకులు దిగ్బంధించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ-ఆగ్రా రహదారిపై ఆందోళనలు చోటుచేసుకోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అక్కడకు చేరుకున్న పోలీసులు, వారి వాహనాలపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనకారుల్ని పోలీసులు చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయితే నిరసకారులు తిరగబ డడంతో.. ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటన జరిగిన ప్రాంతంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భారీగా మోహరించారు .ఘటనపై మథుర ఎస్ఎస్పీ మాట్లాడుతూ, గోవులను స్మగ్లింగ్ చేస్తున్నారనే అనుమానంతో కంటైనర్ ట్రక్కును బాబా అడ్డుకున్నారని, దట్టమైన మంచు కారణంగా ఆయన బైక్‌ను ట్రక్కు ఢీకొందని తెలిపారు. ట్రక్కులో వైర్లు, రేషన్ సరుకులు ఉన్నాయని, డ్రైవర్, హెల్పర్‌ను ప్రశ్నిస్తున్నామని చెప్పారు. గోవుల స్మగ్లింగ్‌తో ఈ ఘటనకు సంబంధం ఉన్నట్టు అనిపించడం లేదని, రోడ్డు ప్రమాదంగానే కనిపిస్తోందని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరుపుతున్నామని చెప్పారు. ఫార్సా వాలే బాబా మృతికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం తెలిపారు. తక్షణం ఘటనా స్థలికి వెళ్లి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# యూఎన్ఐ ఆఫీస్ స్వాధీనం

- జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు
- హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం




**న్యూఢిల్లీ, మార్చి21 (జనంసాక్షి) :** దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు. అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది. 1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

# ఆదిలాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
- 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు

**ఆదిలాబాద్, మార్చి21 (జనంసాక్షి) :** జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ముఖ్యంగా క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమా చారం. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఓవర్‌టేకింగ్ కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370